తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 26.05.2026 | సంపుటి :12 సంచిక : 306 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# విరబూసిన పద్మాలు

- అట్టహాసంగా అత్యున్నత పురస్కారాల ప్రదానం
- పలువురికి అవార్డులు అందచేసిన రాష్ట్రపతి
- కార్యక్రమానికి మోడీ, అమిత్ షాల హాజరు



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమ వారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవి భూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. మిగతా 2లో..



# మెట్రోకు భారీ ఆర్థిక ఊరట

## రూ.13,600 కోట్ల రుణానికి ఒప్పందం



హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ఊరట చేకూరింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్‌ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో కీలక రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై సోమవారం ఢిల్లీలో సంతకాలు జరిగాయి. మిగతా 2లో..



తమిళనాడులోనూ

# రైతుల రుణమాఫీ

- కోఆపరేటివ్ బ్యాంకు రుణాల మాఫీ ప్రకటన
- రూ.50వేల వరకు రుణమాఫీకి సీఎం విజయ్ ఆదేశం

చెన్నై(జనంసాక్షి): తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రైతులకు ఉపశమనం కలిగించే కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు కోఆపరేటివ్ బ్యాంక్ నుంచి తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు సోమవారంనాడు ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీ ప్రకారం రూ.50,000 వరరూ పంట రుణాలు తీసుకున్న సన్నకారు మిగతా 2లో..

# మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే మా లక్ష్యం

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

## ఆదానీ, అంబానీలను మించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



- మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్లు
- సోలార్ పవర్, పెట్రోల్ బంకుల ఏర్పాటుతో ఎదగాలి
- రుణపరిమితి రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నాం
- రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటుకు సహకారం
- వర్చువల్‌గా 8వేల స్వయం సహాయక భవనాలకు శంకుస్థాపన
- మహిళా సంఘాలతో నేరుగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి మిగతా 2లో..

## మద్దతు ధరలు పెంచి కేంద్రం చేతులు దులుపుకుంటోంది

కనీసం 30శాతం కూడా ధాన్యం సేకరించడం లేదు

- తెలంగాణలో విద్యారంగం పటిష్టతకు కఠిన చర్యలు
- లెఫ్ట్ నేతలతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ
- కార్మికుల కనీస వేతనం పెంచడంపై లెఫ్ట్ నేతల అభినందన

12లో..

# 'నీట్' నిర్వహణలో ఎన్‌టీఏ నిర్లక్ష్య వైఖరి

## గత ఘటనల నుంచి గుణపాఠం నేర్చుకోలేదు : సుప్రీం

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా.. గత పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగిన మిగతా 2లో..

కాక్రోచ్ జనతాపార్టీపై అత్యవసర విచారణ అవసరంలేదు

అంతగా భావోద్వేగానికి గురికావద్దని సుప్రీం చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలు

2లో..

నేషనల్ హైవే అథారిటీకి

## దక్కని ఊరట

రైతులకు మద్దతుగా సుప్రీం తీర్పు




# పదిరోజుల్లో నాలుగోసారి పెట్రోవాతలు

## సామాన్యులకు తప్పని బాధలు

పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరగడంతో ప్రజలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు తాజా ధరల సవరణలో భాగంగా లీటర్ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంచినట్లు వెల్లడించాయి. ఈ సవరించిన ధరలు సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా గత పది రోజుల వ్యవధిలో ఇది నాలుగోసారి ఇంధన ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. వరుస ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత భారంగా మారింది. గత పది రోజుల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు కలిపి లీటరుకు సుమారు రూ.8 వరకు పెరిగినట్లు అంచనా. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.115.58, డీజిల్ రూ.103.74గా నమోదవగా, విజయవాడలో పెట్రోల్ ధర రూ.117.19, డీజిల్ రూ.104.88కు పెరిగింది. ఇంధన ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా అంతర్జాతీయ మిగతా 2లో..



## పెట్రో ధరల పెంపు ఎవరి లాభం కోసం ?

కేంద్రం తీరుపై మండిపడ్డ మల్లికార్జున ఖర్గే

వ్యాట్‌ను సవరించి పెట్రో ధరల భారాన్ని

## తగ్గించండి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ

2లో..

# సింగరేణి వికాసమే మా ధ్యేయం

ఇతర రాష్ట్రాల్లో కొత్త బొగ్గు బ్లాకులు సాధించాలి: డిప్యూటీ సీఎం భట్టి

## కోల్ బెల్ట్ సమస్యలపై ప్రతీ 15 రోజులకోసారి సమీక్ష

మంత్రులు, కోల్‌బెల్ట్‌ఎమ్మెల్యేలతో ఉపముఖ్యమంత్రి ఉన్నత స్థాయి భేటీ

హైదరాబాద్(జనంసాక్షి):ప్రస్తుత పోటీ మార్కెట్లో సింగరేణి నిలదొక్కుకోవాలంటే ఇతర రాష్ట్రాల్లో కొత్త బ్లాకులను సాధించాలని ఉప ముఖ్యమంత్రి సంస్థ యాజమాన్యానికి దిశానిర్దేశం చేశారు. అంతేకాకుండా అత్యంత నాణ్యమైన బొగ్గును మార్కెట్లో విక్రయించే దిశగా ప్రయత్నాలు చేయాలని ఆయన సూచించారు. సోమవారం హైదరాబాద్ లోని బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలంలో జరిగిన సింగరేణి కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలతో జరిగిన సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, ఎనర్జీ స్పెషల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, సింగరేణి జనరల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గౌతమ్ పొట్రు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఎంపీ బలరామ్ నాయక్, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, విజయ రమణా రావు, పాయం వెంకటేశ్వర్లు, మిగతా 2లో..



# భారత్‌లో ఎబోలా లేదు



వైరస్‌పై కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఉన్నత స్థాయి సమీక్ష..

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలాను అంతర్జాతీయ స్థాయిలో ఆందోళనకరమైన పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా డబ్ల్యూహెచ్‌వో ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం నిఘా పెంచింది. ఈ క్రమంలోనే సీనియర్ అధికారులతో కేంద్ర వైద్యారోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేశంలో ఇప్పటి వరకు ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని ఈ సందర్భంగా ఓ ప్రకటనలో వెల్లడించారు. వైరస్ వ్యాప్తిని నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.దేశంలోని ఎయిర్‌పోర్టులు, సీ పోర్టులు, సరిహద్దుల్లో ఎబోలా స్క్రీనింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఎబోలా గుర్తింపు, టెస్టింగ్‌లు, నిఘా కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్‌కూ మంత్రి సూచనలు చేశారు. కేంద్రమంత్రి ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ కార్యదర్శి వివిధ శాఖలు, ఏజెన్సీల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

# కేంద్రం తీరుతోనే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు

- ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం
- మిగతా ధాన్యం కూడా సేకరించడానికి ప్రభుత్వం సిద్ధం
- బీజేపీ తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

వార్త 2 లో



# మండుటెండల నుంచి ఉపశమనం

## పలు ప్రాంతాల్లో ఈదురుగాలుల వర్షం

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. హైదరాబాద్‌లోని వనస్థలిపురం, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ఘట్‌కేసర్‌లో వడగళ్ల వర్షం కురిసింది. మెదక్, సూర్యాపేట జిల్లాల్లోనూ వర్షం కురిసింది. దీంతో ఎండల తీవ్రతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. మెదక్ పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. మిగతా 2లో..

# అమెరికాతో జరుగుతున్న చర్చలు కేవలం యుద్ధం ముగించడానికే

## ఈ విషయమై ఆ దేశంతో అమెరికాతో అవగాహన ఒప్పందం కుదిరితే 60 రోజుల వ్యవధిలో అణు అంశంపై చర్చలు జరుపుతాం... స్పష్టం చేసిన ఇరాన్

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికాతో పరోక్షంగా జరుగుతున్న చర్చల్లో కేవలం యుద్ధాన్ని ముగించడంపైనే దృష్టి పెట్టినట్లు ఇరాన్ స్పష్టం చేసింది. ఈ దశలో అణు రంగానికి సంబంధించి ఎలాంటి చర్చలు జరపడం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి వెల్లడించారు. యుద్ధం ముగింపుపై అమెరికాతో అవగాహన ఒప్పందం కుదిరితే తర్వాత 60 రోజుల వ్యవధిలో అణు అంశంపై చర్చలు జరుపుతామని వివరించారు. పాకిస్థాన్‌కు ఇరాన్ ప్రతినిధులు వెళ్లడం కానీ, పాక్ ప్రతినిధులు ఇరాన్‌కు రావడంపైకానీ ప్రస్తుతానికి ఎలాంటి ప్రణాళికలు లేవన్నారు. తమతో కుదుర్చుకునే ఒప్పందానికి అమెరికా కట్టుబడి ఉంటుందని చెప్పేందుకు ఎలాంటి గ్యారెంటీలు లేవని బఘాయి పునరుద్ఘాటించారు. ఇదే సమయంలో ఎలాంటి బెదిరింపులను అస్సలు పట్టించుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం లెబనాన్‌లో కొనసా గుతున్న ఘర్షణను ముగించేలా ఒక నిబంధనను మిగతా 2లో..



## ఇంకా చర్చల స్థాయిలోనే ఉన్నాం

ఇరాన్‌తో శాంతి ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు

మా ప్రతిపాదనలకు ఆ దేశం అంగీకరిస్తేనే ఈ విషయంలో ముందడుగు : ట్రంప్

వార్త 2లో

## పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

న్యూఢిల్లీ(జనంసాక్షి): అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరమూ లేదని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశంలో ఉన్న రుబియో మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకాబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో మాట్లాడిన రుబియో.. భారత్, పాక్ సంబంధాల గురించి స్పందించారు. 'భారత్‌కు పాకిస్థాన్ విషయంలో మిగతా 2లో..



# బీఆర్‌ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

- ప్రతి ఇంటికీ మంచి నీరు అందించి తీరుతాం
- సర్ ప్రక్రియతో జాగ్రత్తగా ఉండాల్సిందే
- కూకట్‌పల్లి కార్యకర్తల భేటీలో బీఆర్‌ఎస్ నేత కేటీఆర్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే హైదరాబాద్ సిటీలో 24 గంటల తాగునీటిని సరఫరా చేస్తామని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. 24 గంటల కరెంట్ ఇచ్చిన తీరుగానే ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆరే అని.. హైదరాబాద్ లో 24 గంటల తాగునీరు ఇచ్చేది కూడా కేసీఆరే అని వెల్లడించారు. కాంగ్రెస్ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని మాజీ మంత్రి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలకు స్పెషల్ ఇంటెన్సీవ్ రివ్యూపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, భవనాలను ఓపెన్ చేస్తూ తామే చేశామని అబద్దాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో కేవలం అభివృద్ధిపైన మాత్రమే దృష్టి సారించామని.. ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీకి అండగా ఉన్న కార్యకర్త, నాయకుడికి తగిన అవకాశం, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీ నమోదు చేసిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ ఒక్కరి ఓటు కోల్పోకుండా బీఆర్‌ఎస్ శ్రేణులు పనిచేయాలని నేతలకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ ఒక్క రూపాయికే నల్లా కనెక్షన్ ఇచ్చి ఇంటింటికీ మంచినీటి గోస తీర్చారని తెలిపారు. ఏడాదిన్నరలోనే 24 గంటల కరెంటు ఇచ్చారని పేర్కొన్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరా బాద్‌లో 24 గంటలు మిగతా 9లో..

## విరబూసిన 'పద్మా'లు

ఈ సందర్భం గా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకా రణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

## పదిరోజుల్లో నాలుగో'సారి' పెట్రోవాతలు

మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదలని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ప్రభావాన్ని చమురు మార్కెటింగ్ సంస్థలు నేరుగా వినియోగదారులపై మోపుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా రవాణా ఖర్చులు, నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారితే భవిష్యత్తులో కూడా ఇంధన ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

## పెట్రో ధరల పెంపు ఎవరి లాభం కోసం ?

న్యూఢిల్లీ (జనంసాక్షి):దేశంలో రోజురోజుకు పెరుగుతోన్న ఇంధన ధరల పై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. ఈ రోజూవారీ దోపిడీ వల్ల ఎవరు లాభపడుతున్నారని ప్రశ్నించారు. సామాన్యుల పొదుపును తగలబెట్టడానికి మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లుతోందని విమర్శించారు. 2014లో రూ.71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను మోదీ సర్కారు 2026 నాటికి రూ.102.12కు చేర్చిందని ఎద్దేవా చేశారు. రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ఇది నాలుగోసారి అని.. ఈ రోజువారీ ఇంధన దోపిడీ ఇంకా ముగిసిపోలేదన్నారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ఇంధనంపై రూ.43 లక్షల కోట్లు దోచుకుందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగోసారి పెరగడంతో ఈరోజు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 5.8, 4.44, 3.90 శాతం పెరిగాయన్నారు. ప్రజల అవసరాల కంటే లాభానికే ప్రాధాన్యం ఇవ్వడం భాజపా నైజమన్నారు. ఇంధన ధరల పేరుతో రైతుల నుంచి ఎంఎస్‌ఎంఈల వరకు, సమాజంలోని ప్రతి వర్గం భాజపా దోపిడీ భారాన్ని మోస్తోందన్నారు. దేశవ్యాప్తంగా నేడు మరోసారి భారీగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై రూ.2.84, డీజిల్‌పై రూ.2.86 చొప్పున ప్రభుత్వ రంగ చమురు సంస్థలు పెంచాయి. పెంచిన ధరలు ఇవాళ ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. కాగా ఇప్పటికే మూడు విడతలుగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. దీంతో దిల్లీలో పెట్రోల్ ధర రూ.102.12, డీజిల్ రూ.95.20కు చేరింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.115.58, డీజిల్ ధర రూ.103.74గా ఉంది.

## వ్యాట్‌ను సవరించి పెట్రో ధరల భారాన్ని తగ్గించండి

హైదరాబాద్(జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నేపథ్యంలో చోద్యం చూడటం మానేసి, వెంటనే రాష్ట్ర వ్యాట్ తగ్గించి, ప్రజలకు ఉపశమనం కలిగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓ లేఖ రాశారు. 'పెట్రోల్, డీజిల్ ధరలు ప్రజల నడ్డి విరుస్తున్నాయి, రాష్ట్ర పన్నులు తగ్గించాలి'అని నాడు పీసీసీ హోదాలో ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి, నేడు అధికారంలో ఉండి ఎందుకు వ్యాట్ తగ్గించడం లేదని లేదని నిలదీశారు. ప్రతిపక్షాలపై అడ్డగోలుగా మాటలు దంచుడు కాదు.. దమ్ముంటే మాట మీద నిలబడి పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలు దించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.వారంలో నాలుగు సార్లు ఫ్యూయల్ ధరలు పెంచి కేంద్రం ప్రజలపై పెను భారం మోపితే, మరోవైపు రేవంత్ రెడ్డి రాష్ట్ర పన్నులు తగ్గించకుండా ప్రజల నడ్డి విరిస్తున్నారని మండిపడ్డారు. పెరిగిన సాగు ఖర్చులు భరించలేక రైతులు సతమతమవుతుంటే, మరో వైపు పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు రైతుల పరిస్థితి తయారైందన్నారు.రవాణా రంగం తీవ్ర సంక్షోభానికి లోను కావడంతో ద్రవ్యోల్బణం పెరిగి అన్ని వర్గాల ప్రజల జీవనంపై ప్రతికూల ప్రభావం పడుతున్నదన్నారు.పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, పన్నుల భారం వల్ల ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పొలం దున్నాలన్నా డీజిల్ భారం..సామాన్యుడు బైక్ తీయాలన్నా పెట్రోల్ భారం?ఆటో సోదరుడి బతుకు బండి నడవాలన్నా ఇంధన భారం.. పెరిగిన ధరలు ప్రజానీకానికి పెను శాపంగా మారిందన్నారు హరీశ్ రావు.పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు భరించలేక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఉపశమన చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు.పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన ప్రతిసారీ రేవంతు ప్రభుత్వం వ్యాట్ రూపంలో ఖజానా నింపుకుంటూ సంబుర పడుతుందని, పైశాచిక ఆనందం పొందుతుందన్నారు. పెరిగిన ధరలతో ప్రతి నెలా రూ.162 కోట్లు, ఏడాదికి దాదాపు 2,000 కోట్ల అదనపు వ్యాట్ ఆదాయం వస్తుంటే.. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విడిచి పెట్టి ప్రచారాలకే పెద్ద పీట వేస్తున్నది విమర్శించారు. ఎన్నికల ముందు వ్యాట్ పై విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, రెండున్నరేళ్లుగా కేనీసం 0.1శాతం వ్యాట్ కూడా తగ్గించకపోవడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అన్నారు.

## మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే మా లక్ష్యం



శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు.

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థిక ఊరట

ఈ కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సమక్షంలో ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా ఈ ఒప్పందాన్ని అధికారులు అభివర్ణించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎస్ రామకృష్ణ రావు తెలిపారు. హైదరాబాద్ దేశ ఆర్థిక వృద్ధికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని, మెట్రో కనెక్టివిటీ విస్తరణతో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న రుణాలను రీ÷నాన్స్ చేసేందుకు రూ.13,600 కోట్ల రుణం మంజూరు చేయనున్నారు. నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ నిధులను వినియోగించనున్నారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో ఈ రుణ సదుపాయం ఇవ్వనున్నారు. దీని ద్వారా హైదరాబాద్ మెట్రోపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలకు కూడా ఆర్థిక వెసులుబాటు కలగనుంది. మరో కీలక పరిణామంగా, లార్సెన్ అండ్ టూబ్రో నుంచి ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వందశాతం యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానుంది. దీంతో హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుంది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు బృందాలకు సీఎస్ రామకృష్ణరావు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు సమర్థవంతమైన, సుస్థి రమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎస్ స్పష్టం చేశారు.

## 'నీట్' నిర్వహణలో ఎన్‌టీఏది నిర్లక్ష్య వైఖరి

నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటుచేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోకపోవడం విచారకరం. ఈ అంశం గతంలోనూ సుప్రీంకోర్టును చేరింది. అప్పుడు మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేశాం. ఆ కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. మరి వాటి అమలు కోసం ఎలాంటి చర్యలు చేపట్టారో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం. ఆ వివరాలకు సంబంధించి గురువారం లోగా అఫిడవిట్ దాఖలు చేయండని ధర్మాసనం ఎన్‌టీఏను ఆదేశించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## కాక్రోచ్ జనతాపార్టీపై అత్యసవర విచారణ అవసరంలేదు

**అంతగా భావోద్వేగానికి గురికావద్దని సుప్రీం చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఇటీవల నిరుద్యోగులను కాక్రోచ్‌లతో పోల్చడం, అవి కాస్తా వివాదం కావడం, వివాదాస్పద వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ వైరల్ అయింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి సంబంధించిన పిటిషన్‌ను అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అయితే న్యాయవాదులు మాత్రం ఈ పిటిషన్ విచారణకు పట్టుబడుతుండడంతో సోమవారం న్యాయవాదులనుద్దేశించి సుప్రీం చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'దానిపై అంత భావోద్వేగానికి గురికావద్దని ఆయన న్యాయవాదుల్ని కోరారు. కోర్టులో రెండు కీలక ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. కోర్టు పరిశీలనలు వాణిజ్యపరంగా ఉపయోగించుకుంటున్నారని ఆరోపిస్తూ ఓ పిల్ దాఖలైంది. కాక్రోచ్ జనతాపార్టీ ప్రచారానికి సంబంధించి సిబిఐ విచారణ కోరుతూ మరొక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ రెండు పిల్‌లపై న్యాయవాదులు కోర్టు ముందు ప్రస్తావించగా ఈ పిటిషన్లను అంత అత్యవసరంగా విచారించాల్సిన ఆవశ్యకత ఏమీ లేదని, వాటిని తగిన సమయంలో పరిశీలిస్తామని సిజెఐ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.ఎం. పంచోలీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఆన్‌లైన్ ఉద్యమం న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీస్తోందని ఎన్ కె గోస్వామి అనే న్యాయవాది వాదించగా.. 'దానికంత భావోద్వేగానికి లోనుకావద్దు' అని సిజెఐ అన్నారు.

## నేషనల్ హైవే అథారిటీకి దక్కని ఊరట

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**భూ వివాదంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై 'స్టే' ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. భూములు కోల్పోయిన యజమానులు పెంచిన నష్ట పరిహారాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు ఆర్డర్‌పై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు ససేమిరా అంది. యాదాద్రి - వరంగల్ నేషనల్ హైవే భూసేకరణ వివాదంలో భూ యజమానులకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో హైకోర్టు ఆదేశాలు యథాతథంగా సుప్రీంకోర్టు ఉంచినట్లు అయింది.దాంతో రైతులకు భారీ ఉపశమనం కలిగినట్లు అయింది. అలాగే అధికారులు పెంచిన నష్టపరిహార మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవచ్చని రైతులకు వెల్లడించింది. నగదు విత్‌డ్రా చేసుకుంటే తర్వాత రికవరీ కష్టమన్న ఎన్‌హెచ్‌ఏఐ వాదనను ఈ కేసు విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. కేవలం ఆర్థిక భారాన్ని సాకుగా చూపి భూ బాధితులకు అందాల్సిన న్యాయమైన పరిహారాన్ని ఆపలేరని స్పష్టం చేసింది. కోర్టు విధించిన షరతులకు లోబడి పెరిగిన పరిహారం మొత్తాన్ని తెలంగాణ భూయజమానులు విత్‌డ్రా చేసుకోనున్నారు.

## తమిళనాడులోనూ రైతు రుణమాఫీ

రైతులకు పూర్తిగా రుణ మాఫీ చేస్తారు. రూ.50 వేలకు పైబడి తీసుకున్న రుణాలకు 50 శాతం మాఫీని ప్రకటించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలో సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమీపంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం 2025 మే 1 నుండి 2026 ఫిబ్రవరి 28 మధ్యకాలంలో సహకార బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు మాత్రమే తాజా రుణమాఫీ వర్తిస్తుంది. ప్రభుత్వ నిర్ణయంతో 14.22 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతుందని, రాష్ట్ర ఖజానాపై రూ.2,044 కోట్ల భారం పడుతుందని విజయ్ తెలిపారు. కావేరీ నదిపై కర్ణాటక ప్రతిపాదిత మేకేదాటు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వ ఏవిధంగా స్పందించాలనే దానిపై కూడా ముఖ్యమంత్రి విజయ్ ఉన్నత స్థాయి సమావేశంలో చర్చించారు. కర్ణాటక ప్రతిపాదనను తమిళనాడు వ్యతిరేకిస్తూ వస్తోంది. ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్రాలకు రావాల్సిన జలాలపై ప్రభావం పడుతుందని, రైతులకు నష్టం జరుగుతుందని తమిళనాడు ప్రభుత్వ వాదనగా ఉంది. కర్ణాటకలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఇటీవల భూమిపూజ జరగడం, ఈ వివాదంపై లీగల్ స్టాటస్‌ను విజయ్ సమావేశంలో అధికారులు సమీక్షించారు. కోర్టు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుని సమగ్ర సంప్రదింపుల అనంతరం తీసుకోవాల్సిన లీగల్ చర్యలను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. మంత్రి ఎన్.ఆనంద్, ఆధవ్ ఆర్జున, ఆర్.నిర్మల్‌కుమార్, అడ్వకేట్ జనరల్ విజయ్ నారాయణ్ తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## అమెరికాతో చర్చలు కేవలం యుద్ధం ముగించడానికే..

కూడా ఈ చర్చల్లో చేర్చినట్లు ఆయన పేర్కొన్నారు.అటు శాంతి చర్చలు కొనసాగుతున్న తరుణంలో అమెరికా వైపు తరచుగా మారుతున్న వైఖరులను ఇరాన్ సోమవారం తీవ్రంగా తప్పుబట్టింది. ఈ మార్పులు చర్చలను మరింత క్లిష్టతరం చేస్తున్నాయని అభిప్రాయపడింది. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ఈ వ్యాఖ్యలు చేశారు. చర్చల్లో పాల్గొంటున్న పక్షాలు అనేక అంశాలపై ఒక నిర్ణయానికి వచ్చాయని ఆయన ధ్రువీకరించారు. "చర్చాంశాల్లో చాలా విషయాలపై మేము ఒక నిర్ణయానికి వచ్చామన్నది నిజమే. కానీ దీని అర్థం ఒప్పందం కుదరడం ఇక తథ్యం అని ఎవరూ చెప్పలేరు. అమెరికన్ అధికారుల వైఖరుల్లో తరచుగా వచ్చే మార్పులు ప్రతి చర్చను సంక్లిష్టతరం చేస్తున్నాయి. అయితే, ప్రస్తుత చర్చల ప్రధాన ఉద్దేశం యుద్ధాన్ని ముగించడమే. ఈ దశలో మేము అణు సమస్య వివరాలను చర్చించడం లేదు" అని బఘాయి అన్నారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌తో ఒప్పందంపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్- వాషింగ్టన్ మధ్య శాంతి ఒప్పందానికి కృషి జరుగుతోందని, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెడ్డ ఒప్పందం చేయరని హామీ ఇచ్చారు. ఒప్పందం కుదుర్చుకోవడానికి తామేమీ తొందరపడటం లేదని స్పష్టంచేశారు. తాము ప్రత్యామ్నాయాలను పరిశీలించే ముందు దౌత్యానికి అన్ని అవకాశాలు ఇస్తామన్నారు. మంచి ఒప్పందం కుదరకుంటే, మరోమార్గంలో సమస్యను ఎదుర్కోవాల్సి ఉంటుందని రూబియో వెల్లడించారు."మేము ఇంకా దీనిపై పని చేస్తున్నాము. నేను చెప్పినట్లు ఆదివారం రాత్రి మాకు ఏదైనా సమాచారం వస్తుందనుకున్నాం, బహుశా ఈరోజు రావచ్చు. దీనికి కొంచెం సమయం పట్టొచ్చు. మా వద్ద బలమైన ప్రతిపాదన ఉందని అనుకుంటున్నాను. జలసంధిని తిరిగి తెరవడం, జలసంధి తెరిచిన తర్వాత అణు విషయాలపై చాలా నిజాయితీతో కూడిన, గణనీయమైన, కాలపరిమితితో కూడిన చర్చలు జరపడం. దీనికి గల్ఫ్ దేశాల్లో మంచి మద్దతు ఉంది. ప్రపంచవ్యాప్తంగా మంచి మద్దతు ఉంది. మేము ఎవరికైతే దీని గురించి వివరించామో ఆయా దేశాలన్నీ ఇది చాలా సహేతుకమైనదని మాత్రమే కాకుండా, ప్రపంచానికి మేలు చేస్తుందని అర్థం చేసుకున్నాయి. అధ్యక్షుడు చెప్పినట్లు ఆయనేమీ తొందరపడటంలేదు. అలాగని ఆయన ఒక చెడ్డ ఒప్పందాన్ని చేసుకోరు. అధ్యక్షుడు ఎలాంటి తప్పుడు ఒప్పందాన్ని అంగీకరించరు. కాబట్టి ఏం జరుగుతుందో చూద్దాం. మేము ప్రత్యామ్నాయాలను పరిశీలించే ముందు దౌత్యం విజయవంతం కావడానికి అన్ని అవకాశాలు ఇస్తాము." అని రూబియో అన్నారు.

## ఇంకా చర్చల స్థాయిలోనే ఉన్నాం

న్యూయార్క్(జనంసాక్షి):యుద్ధం ముగింపుపై అమెరికా ఇరాన్-మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కుదిరే ఏ ఒప్పందమైనా చాలా గొప్పగా ఉంటుందని.. లేదంటే అసలు ఉండదని పేర్కొన్నారు. తాము చర్చల స్థాయిలోనే ఉన్నామని.. ఒప్పందం ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేశారు. తమ నేతలు ఇరాన్ ముందు ఉంచిన ప్రతిపాదనలకు ఆ దేశం అంగీకరిస్తేనే ఈ విషయంలో ముందడుగు వేస్తామన్నారు. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని.. ఈ విషయంపై గల్ఫ్ దేశాల అధినేతలతోనూ సంప్రదింపులు జరుపుతున్నానని తెలిపారు. టెహ్రాన్‌తో తాము కుదుర్చుకోబోయే ఒప్పందంపై ఎటువంటి అవగాహన లేని డెమోక్రాట్లు తమ యంత్రాంగాన్ని విమర్శిస్తుండడం నవ్వు తెప్పిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. తాను సాధించే ప్రతి విజయాన్ని విమర్శించమే వారి పని అని అసహనం వ్యక్తం చేశారు. అటువంటి వ్యక్తులు దేశంలో విభజనను, ప్రజలకు నష్టాన్ని కలిగించడం తప్ప మరేమీ చేయరని అన్నారు. గతంలో ఒబామా, ఆయన యంత్రాంగంలోని అనుభవం లేని అధికారులు ఇరాన్ అణు ఒప్పందాన్ని ప్రతిపాదించి, అమలులోకి తెచ్చారని విమర్శించారు. వారు చేసుకున్న ఒప్పందానికి.. తాము జరుపుతున్న చర్చలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఇరాన్‌కు 'అణు' శక్తిని అందించే ఒప్పందాలను అంగీకరించబోనని స్పష్టం చేశారు.

## పాక్ మధ్యవర్తిత్వంపై భారత్‌కు అభ్యంతరం లేదు

ఉన్న ప్రధాన ఆందోళనలు ఉగ్రవాద సంస్థల గురించే. వాటికి ఇరాన్ చర్చల్లో పాకిస్థాన్ పాత్రతో సంబంధం లేదు. పాక్ భూభాగం నుంచి పనిచేస్తూ భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న సాయుధ ఉగ్రవాద బృందాల గురించే ఇండియన్లు ఎక్కువగా మాట్లాడతారు. వారు దాని గురించే ఎప్పుడూ ఆందోళన చెందుతూ ఉంటారు. కానీ ఇరాన్ విషయంలో మధ్యవర్తిత్వం గురించి ప్రస్తావన రాలేదు. దాని గురించి వారు ఫిర్యాదు చేస్తారని నేను అనుకోను' అని రుబియో పేర్కొన్నారు. ÷ారతదేశం అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామి అని, ప్రముఖ వాణిజ్య భాగస్వామి అని రుబియో అభివర్ణించారు. 'ఈ బంధం బలంగా కొనసాగుతుందని నేను భావిస్తున్నాను. ప్రస్తుత అమెరికా పరిపాలన ముగిసేనాటికి రెండు దేశాల మధ్య బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను' అని రుబియో అన్నారు.

## కేంద్రం తీరుతోనే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు

ఖమ్మర్(జనంసాక్షి):దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరిధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కనీసం గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్థితి ఉందని అన్నారు. కేందప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కనీసం డీజిల్ ఇవ్వకపోవటంతో ఎక్కడికక్కడా ధాన్యం రవాణా ఆగిపోయిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ధ్వజ మెత్తారు. అటు సాగర్ ఆయకట్టు.. ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కృష్ణా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పలు సంస్థలను నిర్వీర్యం చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. ఇంకా కొంటామని స్పష్టం చేశారు. సోమవారం యాతాలకుంట టన్నెల్‌ను మంత్రి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్ వద్ద అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందాలనేది తన చిరకాల వాంఛ అని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చివరి ప్రాంతమైన ఖమ్మానికి గోదావరి జలాలు అందలేదని ప్రస్తావించారు. ఎక్కువ భూభాగం ఎన్నెస్పీ కెనాల్ పైభాగం.. కింద భాగంలో గోదావరి ఉండటంతో నీరు అందలేదని అన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసి.. అప్పటి ముఖ్యమంత్రిని.. ఖమ్మానికి గోదావరి జలాలు అందించాలని కోరానని ప్రస్తావించారు. నల్గొండ ఎ÷-లోరైడ్ పీడిత ప్రాంతానికి మాజీ సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రారంభించామని చెప్పుకొచ్చారు. గోదావరిపై ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరిపై 1998లో దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామని వివరించారు. ఆనాడు దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్ - ఇందిరా సాగర్ వరకు ప్రారంభించిన పంపులు మోటా ర్లకే పరిమితమయ్యాయని అన్నారు. దుమ్ముగూడెం శ్రీరామ చంద్రుడు నడయాడిన ప్రాతంలో సీతారామ ప్రారంభించామని చెప్పుకొచ్చారు. ఆ ప్రభుత్వంలో కేవలం పంప్‌హౌస్ నిర్మాణ పనులకే పరిమితమయ్యాయని అన్నారు. యాతాలకుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు నీరు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఈ టన్నెల్ పూర్తి చేయడానికి కూడా నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల అన్నారు. ఇది తన జీవిత ఆశయమని.. లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పానని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి మొదటిసారి రాజీవ్ లింక్ కెనాల్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు. ఆరునెలల్లో రాజీవ్ లింక్ కెనాల్ పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాతాలకుంట టన్నెల్‌కు అనుమతి ఇచ్చారని వెల్లడించారు. 15 నెలల్లో రెండు కిలోమీటర్ల పొడవు టన్నెల్ నిర్మాణం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు చేపట్టిన ఏజెన్సీ, అధికారులను మంత్రి తుమ్మల అభినందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని.. ఇది తన రాజకీయ కోరిక అని వ్యాఖ్యానించారు.

## సింగరేణి వికాసమే మా ధ్యేయం

గండ్ర సత్యనారాయణ, మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు, కోవా లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని అన్నారు. తెలంగాణకు కొంగు బంగారంగా ఉన్న సింగరేణితో పాటు, కోల్ బెల్ట్ అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ తరఫున, అలాగే ప్రభుత్వం తరఫున కోల్ బెల్ట్ లో ఇచ్చిన హామీల అమలు విషయంలో తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధించగలిగే కొత్త బ్లాకులను సింగరేణి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈనేపథ్యంలో కొత్త బ్లాకులు సాధించేలా సింగరేణి తగు ప్రణాళికలు రూపొందుకుని ముందుకు సాగాలని సూచించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న గత ప్రభుత్వం సింగరేణికి కొత్త బ్లాకులు సాధించడంలో విఫలమైందన్నారు. 100 ఏళ్ల క్రితం ఇల్లందు ప్రాంతంలోని మారుమూల సింగరేణి గ్రామంలో పుట్టిన సింగరేణిని తమ ప్రభుత్వం నేడు ఒడిశా వరకు విస్తరించేలా చేసిందన్నారు. కొత్త బ్లాకులను సాధించడంతోపాటు నాణ్యమైన బొగ్గును అమ్మడం ద్వారా సింగరేణి సంస్థను కాపాడుకోగలమని ఆయన చెప్పారు.ఈ సందర్భంగా సింగరేణి ప్రాంతంలో ఉన్న సమస్యలను ఆయా ప్రాంత శాసన సభ్యులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకొచ్చారు. సింగరేణి అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు చేస్తున్న విజ్ఞప్తులను, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని భట్టి విక్రమార్క సంస్థ యాజమాన్యానికి సూచించారు. దీనిపై ఇకపై ప్రతీ 15 రోజులకు ఒకసారి కోల్ బెల్ట్ శాసన సభ్యులు సమర్పించే విజ్ఞాపనలపై తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎన్నికల సమయంలో సింగరేణి ప్రాంత కార్మికులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ డానికి ప్రజా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుం దన్నారు. ఇక ముందు కూడా సంస్థ అభివృద్ధికి, సింగరేణి ప్రాంత అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

## మండుటెండల నుంచి ఉపశమనం

గంగినేని థియేటర్ వద్ద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మెదక్ మార్కెట్ యార్డులో ధాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ర్యాలమడుగులో ఈదురుగాలుల తీవ్రతకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయింది. మంభోజిపల్లిలో 3 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడులో ఈదురుగాలులు ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇకపోతే రోహణి కార్తె సోమవారం నుంచే ప్రారంభం అయ్యింది. దీంతో ఎండలు మండిపోతున్నాయి. రోహిణీ కార్తె ప్రవేశించిన వేళ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. తెలంగాణ ప్రణాళికా సంఘం మే 25న విడుదల చేసిన గరిష్ట ఉష్ణోగ్రతల వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఎండ తీవ్రత 45 డిగ్రీల నుండి ఏకంగా 46.5 డిగ్రీల సెల్సియస్‌కు చేరడంతో జనం ఇళ్ల నుండి బయటకు రావడానికే భయపడుతున్నారు.

## ప్రధాని మోడీ విధానాలే దేశానికి శాపం

- మీడియా సమావేశంలో విహెచ్ విమర్శలు



**హైదరాబాద్, మే25 (జనంసాక్షి) :** ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే దేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని.. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గాంధీ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పెట్రోల్ కొరత, విపరీతమైన ధరల పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు, దేశ ఆర్థిక పరిస్థితిపై ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వీ.హెచ్ మాట్లాడుతూ.. 'దేశంలో సామాన్యుడు ఎక్కడికి వెళ్లినా పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనం. మోదీ నిర్ణయాల వల్ల ఆయన స్నేహితులు అంబానీ, అదానీ లాభపడుతున్నారు. ప్రధాని మోదీ నిరంతరం జపించే 'సబ్ కా సాత్-సబ్ కా వికాస్' అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోయింది. ఆచరణలో మాత్రం అది 'అందరినీ ఇబ్బంది పెట్టే' విధానంగా మారింది. యుద్ధాన్ని ఆపేందుకు మోదీ ఎందుకు ప్రయత్నం చేయలేదు? మోదీకి ట్రంప్ ఫ్రెండ్ అని అంటారు కదా ట్రంప్‌కి చెప్పి యుద్ధాన్ని ఆపవచ్చు కదా. దేశ ఆర్థిక పరిస్థితి కుంగి పోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో ఎలా గెలవాలో తెలిసిన అమిత్ షాకి ఆర్థిక సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదా?' అని అన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించండి

- కేంద్రానికి పొన్నం సవాల్
- రైతులపై కేంద్రానికి ప్రేమ లేదని వ్యాఖ్య



**హైదరాబాద్ (జనంసాక్షి):** పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజల నడ్డి విరుస్తూ బీజేపీ ఇబ్బంది పెడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులకు భరోసా అంటూ బీజేపీ మోసపూరిత యాత్రలు చేస్తోందన్నారు. రైతు వ్యతిరేక విధానాలతో బీజేపీ ప్రజలను మోసం చేస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంప్రజల అసలు సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకు 'రైతు ఘోస -- బీజేపీ భరోసా' పేరుతో బస్సు యాత్రలు చేపట్టడం పూర్తిగా రాజకీయ డ్రామా ఆడుతుందన్నారు. నిజంగా తెలంగాణ రైతులపై ప్రేమ ఉంటే ముందుగా పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావంతో రైతులపై సాగు వ్యయం భారీగా పెరిగిందన్నారు. ట్రాక్టర్లు, మోటార్లు, రవాణా ఖర్చులు అన్నీ పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కానీ రైతు సంక్షేమం గురించి మాట్లాడుతున్న బీజేపీ నేతలు ఈ అంశంపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదన్నారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంలో బాయిల్డ్ రైస్ సాంక్షన్ చేయడంలో, లేవీ రైస్‌కు అనుమతులు ఇవ్వడంలో కేంద్రం సహకరించడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పదేపదే కోరినా కేంద్రం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 53.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు మాత్రమే అనుమతి ఇచ్చిందన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలగకుండా 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణ రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, తెలంగాణలో పండిన మొత్తం ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు.

## ప్రైవేట్ ఆయిల్ గోదాంలో మంటలు

- అగ్నిప్రమాదంలో పేలిపోయిన ఆయిల్ బ్యారెళ్లు



**చెన్నై, మే25 (జనంసాక్షి) :** తమిళనాడు రాజధాని చెన్నై పరిధిలోని మణలి ప్రాంతంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. లక్ష్మీనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆయిల్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాంలో భారీగా నిల్వ ఉంచిన ఆయిల్ బ్యారెళ్లు వరుసగా పేలిపోయాయి. ఈ ప్రమాదంలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గోదాంలో దాదాపు లక్ష లీటర్ల ముడి చమురు (క్రూడ్ ఆయిల్) నిల్వ ఉన్నట్లు సమాచారం. మంటల తీవ్రతకు ఆయిల్ బ్యారెళ్లు పెద్ద శబ్దాలతో పేలుతూ, దాదాపు 60 అడుగుల ఎత్తు వరకు పైకి ఎగిరిపడ్డాయి. ప్రమాద స్థలం నుంచి దట్టమైన నల్లటి పొగ మైళ్ల దూరం వరకు వ్యాపించడంతో మణలి, దాని పరిసర ప్రాంతాలు దట్టమైన పొగతో నిండిపోయాయి. స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే మణలి, ఎన్నూర్, మాధవరం ప్రాంతాల నుంచి భారీగా ÷ర్ ఇంజిన్లు రంగంలోకి దిగాయి. అయితే, ఆయిల్ బ్యారెళ్లు నిరంతరాయంగా పేలుతుండటంతో అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఆరు గంటలుగా సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. సాధారణ నీటితో ఆయిల్ మంటలు అదుపు కాకపోవడంతో, రసాయన నురుగు కలిపిన నీటిని ఉపయోగించి మంటలను అణచివేసేందుకు రెస్క్యూ టీమ్స్ రంగంలోకి దిగాయి. ఈ ప్రమాదంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస భద్రతా ప్రమాణాలు, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకుండానే నివాస ప్రాంతాలకు సమీపంలో ఇలాంటి ప్రమాదకరమైన ఆయిల్ గోదాంలను నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతానికి ప్రమాద స్థలంలో ఉద్రిక్త పరిస్థితి కొనసాగుతుండగా, పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస భద్రతా ప్రమాణాలు, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకుండానే నివాస ప్రాంతాలకు సమీపంలో ఇలాంటి ప్రమాదకరమైన ఆయిల్ గోదాంలను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పుతో కండ్లు తెరవండి బీసీలకు న్యాయం చేయండి

- హైకోర్టు న్యాయవాది మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచినఓ బీసీల జనాభా లెక్కలు తేల్చకపోవడం అన్యాయమని అప్రజా స్వామీ కం అని ఆయన అన్నారు స్వతంత్రానికి పూర్వం దేశంలో బ్రిటిష్ ప్రభుత్వం 1831 నుంచి 1931 వరకు ప్రతి 10 సంవత్సరములకు ఒకసారి దేశ జనాభాను అన్ని కులాల మతాల వారిని లెక్కించిందని దాని ప్రకారమే వాళ్లు పాలన సాగించారని దురదృష్టం ఏమిటంటే ఈ దేశంలో స్వతంత్రం వచ్చిన తర్వాత నేటి వరకు బీసీల జనాభా లెక్కించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు పాలన కొనసాగించిన కేంద్ర ప్రభుత్వాలు ఈ దేశంలో గ్రామాలలో ఉన్న పశువులను లెక్కపెట్టారని అడవుల్లో ఉన్న జంతువులను లెక్క పెడుతున్నారు కానీ ఓబీసీల లెక్క తేల్చడం లేదని ఆయన అన్నారు ఈ దేశంలో స్వతంత్రం వచ్చిన తర్వాత బీసీల జీవన ప్రమాణాలు స్థితిగతులు విద్యా ఉద్యోగాలలో అవకాశాలను అధ్యయనం చేయడానికి దేశ మొదటి ప్రధాని నెహ్రూ కాకా ఖాలేల్కర్ సారధ్యంలో మొట్టమొదటిసారి నేషనల్ బీసీ కమిషన్ను ఏర్పాటు చేశారని ఆ కమిషన్ దేశవ్యాప్తంగా స్థితిగతులు అధ్యయనం చేసిన తర్వాత రిపోర్టు ఇచ్చి ఆ రిపోర్టులో ఈ దేశంలో బీసీల జనాభా ని లెక్కించాలని రిపోర్టు ఇచ్చిందని దాని ఆధారంగా బీసీల యొక్క జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి సంక్షేమ కార్యక్రమాలు మరియు పథకాలు రూపొందించడం కొరకు జనాభా లెక్కలు అవసరమని తేల్చి చెప్పారు కానీ ఆ రిపోర్టును అమలు చేయలేదు తర్వాత 1980లో మండల్ కమిషన్ రిపోర్ట్ కూడా జనజనగణన చేయమని రిపోర్టు ఇచ్చిందని దానిని కూడా తుంగలో తొక్కారని ఆయన అన్నారు అనేక సందర్భాలలో సుప్రీంకోర్టు జడ్జిమెంట్లు వివిధ రాష్ట్రాల హైకోర్టు జడ్జిమెంట్లు వివిధ రాష్ట్రాల కమిషన్ రిపోర్ట్ లు ఈ దేశంలో ఓ బీసీల జనగణ చేయమని తీర్పులు ఇచ్చాయని దురదృష్టవశాత్తు ఈ పాలకులు బీసీల లెక్కచేస్తే వాళ్లకు విద్య ఉద్యోగాలలో అవకాశాలు కల్పించాల్సి వస్తుందని సంపదలో వాటా ఇవ్వాల్సి వస్తుందని బడ్జెట్లో కేటాయింపులు వారి జనాభా ప్రకారం అడుగుతారని రాజకీయంగా విద్యా ఉద్యోగాలలో ప్రమోషన్లలో ఉపాధిలో వారు వాటా అడుగుతారని ఒక కుట్రతో నేటి వరకు జనాభా గణన చేయకుండా మెజార్టీ ప్రజలైన ఈ దేశంలో 75 కోట్ల జనాభా జీవితాలతో ప్రభుత్వాలు ఆడుకుంటున్నాయని అన్నారు ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పు కులగనన చేయవద్దు అని కొంతమంది వేసిన పిటిషన్ను కొట్టివేస్తూ ప్రభుత్వాలు ఆ ప్రజల యొక్క జీవితాలు బాగుకోసం చేయవచ్చు అని తీర్పు ఇచ్చిందని ఇది చాలా శుభ పరిణామం అని ఇలాంటి తీర్పుతో న్యాయ వ్యవస్థ పై ప్రజలకు గౌరవం పెరిగిందని అన్నారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు 75 కోట్ల జనాభా ప్రజల ఆకాంక్షను గుర్తిరిగి సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ ఇప్పుడు జరుగుతున్న జనగణనలో కులగనన జరిపి ఈ దేశంలో రాజకీయ సామాజిక ఆర్థిక స్వరూపాన్ని అంచనా వేసి సబ్కా సాత్ సబ్ సబ్ కా వికాస్ అని మీరు చెబుతున్న విజన్ ఏదైతే ఉందో అందరికీ సామాన్యం జరపాలని అన్నారు జనాభా తమాషా ప్రకారం విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో వారి జనాభా తమాషా ప్రకారం అవకాశాలు కల్పించి సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు లేదంటే ప్రజలలో ప్రభుత్వాలపై వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లి పరిస్థితి వస్తాయని అలాంటి పరిస్థితులు దేశా సౌభ్రాతత్వానికి మంచిది కాదని ఆయన అన్నారు ఇప్పటికైనా కేంద్రం వెంటనే కుల గణన జరిపించాలని విజ్ఞప్తి చేశారు



## నక్సల్బరీ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

- సీపీఐ (ఎం-ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా

**పాలకుర్తి, మే 25(జనంసాక్షి) :** నక్సల్బరీ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని సీపీఐ (ఎం-ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రం లో నక్సల్బరీ పోరాట అమరుల స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజు సాంబయ్య మాట్లాడుతూ 1967 పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని డార్జిలింగ్ జిల్లాలో నక్సల్బరీ గ్రామంలో చారిత్రాత్మకంగా సాయుధ తిరుగుబాటు ఉద్యమం కామ్రేడ్ చారు మజుందార్ నాయకత్వంలో ప్రారంభమైందని అన్నారు. అనాటి ప్రభుత్వం రైతాంగ ఉద్యమాన్ని క్రూరంగా అణిచి వేసిందన్నారు. ఫలితంగా రైతులు, కూలీలు, చిన్నారులు ఆ ఉద్యమంలో అమరత్వం పొందారని అన్నారు. నక్సల్బరీ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించి సీపీఐ (ఎంఎల్) రూపుదిద్దుకుందని అన్నారు. ఈ సమావేశంలో అనంతోజు రజిత, జీడి సోమయ్య, సారయ్య, రాజు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఎన్‌టీ గెస్ట్ హౌస్‌లో భారీ అగ్ని ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ



**మహదేవపూర్, మే 25 (జనంసాక్షి) :** మేడిగడ్డ ఎల్ఎన్టి ప్రధాన కార్యాలయం నిన్న భారీ అగ్ని మంటలు చెలరేగి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక ఫైల్స్ లాప్టాప్ కు సంబంధించిన కంప్యూటర్స్ సామాగ్రి అగ్ని ప్రమాదానికి ఖాళీ బూడిది అయినందున సోమవారం రోజున జిల్లా ఎస్పీ సంకీర్త్ పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదానికి గల కారణాలు జరిగిన నష్ట వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే మహదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకో రావడానికి చర్యలు చేపట్టారు అనంతరం ఫైరు సిబ్బందికి సమాచారం అందించగానే వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్ పి వేశారు. గెస్ట్ హౌస్ లో కాలిపోయిన మొత్తం వస్తువుల విలువ సుమారు రూ కోటి 48 లక్షల 11,795 రూపాయల విలువ ఉంటుందని ఎల్ అండ్ టి గెస్ట్ హౌస్ ఇన్చార్జ్ తపస్ కుమార్ నాయక్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ సూర్యనారాయణ. సీఐ వెంకటేశ్వర్లు ఎస్సై పవన్ కుమార్ ఉన్నారు.

## పదవుల కోసం వారు అక్కర్లేదు

- పార్టీ కోసం, ఎపి అభివృద్ధి కోసం పనిచేయండి
- ఎదుటి వారి విమర్శలను సహించడానికి లేము
- అవసరమైతే తాట తీస్తాం: పవన్ హెచ్చరిక



**అమరావతి, మే 25 (జనంసాక్షి) :** పదవులు వచ్చిన తర్వాత చాలా మంది జనసేన నాయకులు మెత్తబడి పోయారని, అలాంటి నాయకులు జనసేనకు అవసరం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'మీ ఎదుగుదల కోసం నన్ను వాడుకోవద్దు. శత్రువులు బయట ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు' అంటూ పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనలో ఉండగలిగేవాళ్లు మాత్రమే పార్టీలో ఉండండి అని స్పష్టం చేశారు. తాను టీడీపీ కోసం కాదు.. రాష్ట్రం కోసం సర్దుకుపోతున్నా.. అంటూ వ్యాఖ్యానించారు. ఇకపై జనసేన కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, వ్యక్తిగతంగా విమర్శిస్తే అదే స్థాయిలో బదులిస్తామని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఇకపోతే కుల రాజకీయాలు, ప్రత్యర్థి పార్టీల విమర్శలు, పార్టీ అంతర్గత పరిస్థితులపై జనసేన పార్టీ సమావేశంలో ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో రాజకీయాలు చాలా సాఫీగా సాగిపోయాయని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అక్కడి రాజకీయాలను చూస్తే అసూయ కలిగేంత సులభంగా జరిగాయని అన్నారు. తాను పదేపదే కులం గురించి మాట్లాడుతున్నానని కొందరు విమర్శిస్తున్నారని పేర్కొన్న పవన్.. తాను ఎప్పుడైనా కుల నాయకుడినని చెప్పానా? మిగతా పార్టీ నేతలు కులం గురించి మాట్లాడటం లేదా? అంటూ ప్రశ్నించారు. కులాలను రెచ్చగొట్టే మనస్తత్వం సమాజానికి మంచిది కాదని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో జరిగిన చర్చలపై కూడా ఆయన స్పందించారు. 'నేను అమిత్ షాతో మాట్లాడిన విషయాలు బయటవాళ్లకు ఎలా తెలుస్తాయి? ఏపీ బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదు? వైసీపీ నేత జైలుకెళ్లాలని నేను ఎందుకు కోరుకుంటాను? ఒక నాయకుడు జైలుకెళ్తే జనసేన ఎదుగుతుందా?' అంటూ వ్యాఖ్యానించారు. కేంద్ర హోంమంత్రితో రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనే మాట్లాడతాం.. ఇలాంటి ఆరోపణలు చేయడం వ్యవస్థను అవమానపరచడమేనని పవన్ అన్నారు. తాను అమిత్ షాను కలిసింది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసమేనని స్పష్టం చేశారు. 'నేను అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చాను. శత్రువు బలంగా ఉన్నప్పుడే ఎదుర్కొంటా.. బలహీనులను కాదు' అని వ్యాఖ్యానించారు. 'మాకు కూడా కోపాలు, బాధలు ఉంటాయి. చూస్తూ ఊరుకుంటామని అనుకోవద్దు. దేనికైనా ఒక హద్దు ఉంటుంది.. భరిస్తాం.. సహిస్తాం.. అవసరమైతే తాట తీస్తాం' అంటూ పవన్ హెచ్చరించారు.

## సమ్మయ్యకు అంతర్జాతీయ హరిత మిత్ర అవార్డు ప్రదానం




**నెక్కొండ మే 25 (జనం సాక్షి) :** నెక్కొండ మండలంలోని గుండ్రపల్లి గ్రామానికి చెందిన నల్లగొండ సమ్మయ్య, కొన్ని సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తు సామాజిక భాధ్యతగా స్వచ్ఛందంగా నెక్కొండ మండలంతో పాటు పరిసర మండలాల్లో సైతం సుమారు యాభై ఎనిమిది వేల పైన స్వంత ఖర్చులతో మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించేందుకు కృషి చేసినందుకు సమ్మయ్య, కు లూసియానా యూనివర్సిటీ (అమెరికా) వారు ఆదివారం పూణేలో యూనివర్సిటీ అధికారుల చేతుల మీదుగా హరిత మిత్ర అంతర్జాతీయ అవార్డు ను అందించారు.

## యూత్ డిక్లరేషన్ మోసాన్ని ఎండగట్టేందుకు 'చలో సరూర్‌నగర్' సభ

- మాజీ మంత్రి తలసాని ప్రకటన

**హైదరాబాద్ (జనంసాక్షి) :** అభయహస్తం కింద ఏవైతే డిక్లరేషన్ చేసిర్రో.. దాంట్లో ప్రధానమైంది 'యూత్ డిక్లరేషన్'. యూత్ అంటే మన రాష్ట్ర, దేశ భవిష్యత్. యూత్ డిక్లరేషన్ పేరిట నిరుద్యోగులకు ఎన్నో అలవికాని హామీలిచ్చి కాంగ్రెస్ సర్కార్ గద్దెనెక్కిందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తలసాని మాట్లాడుతూ.. యూత్ డిక్లరేషన్ పేరుతో అమరవీరుల త్యాగాలకు గుర్తింపుగా ప్రభుత్వ ఉద్యోగమని.. వారికి నెలనెలా పెన్షన్ అని ఒక కార్యక్రమం చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తమన్నరు. గ్రూప్ 1 కానీ గ్రూప్ 2 కానీ జాబ్ క్యాలెండర్ ఇస్తరని చెప్పి రెండున్నర సంవత్సరాల నుంచి యువత అంతా ఎదురుచూస్తున్నారు. కానీ గద్దెనెక్కిన నాటి నుండి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మంగళం పాడుతూ...కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగుల నోట్లో మట్టికొడుతుందన్నారు.

## నిజాయితీ, నిబద్ధతతో ప్రజాసేవ చేయండి!

- ఐఏఎస్‌లకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దిశానిర్దేశం



**హైదరాబాద్, మే 25 (జనంసాక్షి) :** శిక్షణ పొందుతున్న ఐఏఎస్‌లకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దిశానిర్దేశం చేశారు. సోమవారం లోక్ భవన్‌లో 2025 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లతో ముచ్చటించిన ఆయన నిజాయితీ, నిబద్ధతతో ప్రజాసేవ చేయాలని సూచించారు. ప్రజలతో అనుసంధానమై, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ సుపరిపాలనకు కృషి చేయాలని ట్రైనీ ఐఏఎస్‌లను గవర్నర్ కోరారు. లోక్ భవన్‌లో సోమవారం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ట్రైనీ ఐఏఎస్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. శిక్షణలో ఉన్న ఎట్టబోయిన సాయి శివాని, సచిన్ బసవరాజ్ గుత్తూర్, పోతరాజు హరి ప్రసాద్, పారస్ కుమార్, పి. సురేష్, నెలటూరు శ్రీకాంత్ రెడ్డిలకు గవర్నర్ కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్, ఎంసీఆర్ హెచ్ఆర్డీ వైస్ చైర్‌పర్సన్ శాంతి కుమారి, కోర్స్ డైరెక్టర్ డా. కందుకూరి ఉషారాణి పాల్గొన్నారు.

## జగ్గారెడ్డి ఔదార్యం

- 70 మంది చిన్నారులకు సైకిళ్లు అందజేత



**సంగారెడ్డి (జనంసాక్షి) :** సంగారెడ్డిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న సైకిళ్ల పంపిణీ కార్యక్రమం స్థానికంగా మంచి స్పందన తెచ్చుకుంటోంది. చిన్నారుల మొఖాల్లో ఆనందం నింపడమే లక్ష్యంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో.. తాజాగా ఆయన మరో 70 మంది చిన్నారులకు స్వయంగా సైకిళ్లను అందజేశారు. ముఖ్యంగా 8 ఏళ్ల లోపు వయసున్న చిన్నపిల్లల కోసమే ఈ విడత కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించడం విశేషం.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు సంగారెడ్డిలో మొత్తం 400 మంది పిల్లలకు సైకిళ్లను పంపిణీ చేశామని చెప్పారు. తమ కార్యాలయానికి వచ్చి ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చి, పేర్లు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ విడతల వారీగా ఖచ్చితంగా సైకిళ్లు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే, సైకిళ్ల కోసం ముందే పేర్లు నమోదు చేసుకున్న మరో 156 మంది చిన్నారులకు జగ్గారెడ్డి టోకెన్లను పంపిణీ చేశారు. వీరందరికీ వచ్చే ఆదివారం సైకిళ్లను అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఇక కార్యక్రమం జరిగేంత సేపూ జగ్గారెడ్డి అక్కడికి వచ్చిన చిన్నారులతో ఎంతో సరదాగా గడిపారు. వారితో ముచ్చటిస్తూ, షేక్‌హ్యాండ్స్ ఇస్తూ, 'హాయ్' చెప్తూ పిల్లలతో పిల్లలైపోయారు. ఈ పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, సీనియర్ నాయకులు కూన సంతోష్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
26 మే 2026

సంపాదకీయం

# సామాన్యులకు ధరాఘాతం

పది రోజుల్లో నాలుగుసార్లు పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, ఇది యాదృచ్ఛికం కాదు, విధానపరమైన నిర్లక్ష్యం. కేంద్ర ప్రభుత్వం మరోసారి సామాన్య ప్రజల జేబులపై చేయి వేసింది. పెట్రోల్, డీజిల్ ధరలను కేవలం పది రోజుల వ్యవధిలో నాలుగుసార్లు పెంచడం అనేది ఆర్థిక నిర్వహణలో వైఫల్యానికి అద్దం పడుతోంది. అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా, ఆ లాభం వినియోగదారుడికి చేరదు. పెరిగితే మాత్రం వెంటనే భారం మోపబడుతుంది ఇదే మోడీ సర్కార్ అనుసరిస్తున్న విధానం.

పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడమంటే కేవలం వాహనదారులకు భారం మాత్రమే కాదు. డీజిల్ అనేది సరుకు రవాణా, వ్యవసాయం, మత్స్యకార వృత్తి వీటన్నిటి వెన్నెముక. డీజిల్ ధర పెరిగిన ప్రతిసారీ, దాని ప్రభావం కూరగాయల బండి నుండి సిమెంట్ బస్తా దాకా అన్నిటిపైనా పడుతుంది. పది రోజుల్లో నాలుగుసార్లు పెంపు అంటే ప్రజలకు కోలుకునే అవకాశం కూడా ఇవ్వకుండా దెబ్బ మీద దెబ్బ కొట్టడమే. ఇప్పటికే పప్పులు, నూనెలు, కూరగాయలు, పాలు అన్నీ సామాన్యుడికి అందని స్థాయికి చేరాయి. వంట నూనె ధర గడిచిన రెండేళ్ళలో దాదాపు రెండింతలైంది. టమాటా, ఉల్లిపాయ ధరలు సీజన్‌తో సంబంధం లేకుండా అమాంతం పెరుగుతున్నాయి. గోధుమలు, బియ్యం ధరలూ ఊరట లేకుండా పైకి పోతున్నాయి. ఇంట్లో పొయ్యి వెలిగించడమే సవాలుగా మారిన రోజుల్లో చమురు ధర పెంపు ఆ మంటకు ఆజ్యం పోయడమే.

రిటైల్ ద్రవ్యోల్బణం నిరంతరం రిజర్వ్ బ్యాంక్ నిర్దేశిత పరిమితిని దాటుతోంది. వేతనాలు పెరగడం లేదు, ఉద్యోగాలు సృష్టించడం లేదు. కానీ జీవన వ్యయం మాత్రం రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. పట్టణాల్లో మధ్యతరగతి, పల్లెల్లో రైతు కూలీ ఇద్దరూ నెల చివరికి అప్పులపాలవుతున్నారు. పొదుపు చేయడం మాట అటుంచితే, రోజువారీ అవసరాలు తీర్చుకోవడమే కష్టంగా మారింది. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని పాలకపక్షమే గతంలో వాగ్దానం చేసింది. అది నేటికీ నెరవేరలేదు. కేంద్రం వసూలు చేస్తున్న అధిక ఎక్సైజ్ సుంకాలను తగ్గించడం ద్వారా ధరలను నియంత్రించవచ్చు. అవసరమైతే స్ట్రాటెజిక్ నిల్వలను విడుదల చేసి నిత్యావసర ధరలను అదుపు చేయవచ్చు. కానీ ఇవేమీ జరగడం లేదు. ఎందుకంటే ప్రభుత్వానికి రెవెన్యూ వస్తోంది, భారం మాత్రం ప్రజలపై పడుతోంది.

*"అచ్ఛే దిన్" నినాదంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సామాన్యుడి జీవితాన్ని మరింత కష్టతరం చేస్తోంది. పెట్రోల్ ధర పెరిగినప్పుడు మిగతా అన్నీ పెరుగుతాయి. అది తెలిసీ చర్య తీసుకోకపోవడం నేరమే. ఎన్నికల వాగ్దానాలు వేరు, పాలన వేరు అయినప్పుడు, ప్రజాస్వామ్యంలో ప్రజలే తమ తీర్పు చెప్పాల్సి ఉంటుంది. ధరల మంట ఆర్పే బాధ్యత ప్రభుత్వానిది, ఆ బాధ్యత నుండి పారిపోవడం మాత్రం సామాన్యుడికి వాతలు వేయడమే.*

# నూతన నిర్వహణా పద్ధతుల్లో ఆధునిక గ్రంథాలయాలు

.ప్రపంచీకరణ, డిజిటల్ సాంకేతికత, సమాచార వ్యవస్థల వేగవంత మైన అభివృద్ధి కారణంగా ఆధునిక సమాజంలో గ్రంథాలయాల పాత్ర పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిల్వ కేంద్రాలుగా మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు అవి జ్ఞానం, పరిశోధన, డిజిటల్ విద్య, సమాచార సేవల సమగ్ర వేదికలుగా రూపాంతరం చెందుతున్నాయి. ఈ మార్పుల నేపథ్యం లో "న్యూ పబ్లిక్ మేనేజ్‌మెంట్" అనే భావన గ్రంథాలయ మరియు సమాచార శాస్త్ర రంగంలో కీలక మార్పులకు దారి తీసింది.



న్యూ పబ్లిక్ మేనేజ్‌మెంట్ అంటే ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ సంస్థల మాదిరిగా సమర్థవంతంగా నిర్వహించే విధానం. ఇందులో ఫలితాల ఆధారిత పరిపాలన, బాధ్యతాయుత వ్యవస్థ, ఖర్చు నియంత్రణ, వినియోగదారుల సంతృప్తి, పోటీ భావన, ఆధునిక సాంకేతిక వినియోగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తారు. 1980లలో బ్రిటన్, అమెరికా దేశాల్లో ప్రారంభమైన ఈ విధానం తరువాత ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం భారతదేశ గ్రంథాలయ వ్యవస్థలపై కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సాంప్రదాయ గ్రంథాలయాల్లో పరిపాలనా జాప్యం, సాంకేతిక వెనుకబాటు, పరిమిత సేవలు, తక్కువ నిధులు వంటి సమస్యలు ఉండేవి. పాఠకుల అవసరాలు మారుతున్నప్పటికీ సేవల్లో తగిన మార్పులు చోటుచేసుకోలేదు. ఈ సమస్యలకు ప్రత్యామ్నాయ మార్గాన్ని న్యూ పబ్లిక్ మేనేజ్‌మెంట్ చూపించింది. గ్రంథాలయాలను కేవలం పుస్తక గదులుగా కాకుండా "జ్ఞాన సేవా కేంద్రాలుగా" మార్చే దిశగా ఇది పనిచేస్తోంది.

ఈ విధానంలో వినియోగదారుల అవసరాలకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుంది. ఒకప్పుడు గ్రంథాలయాలు పుస్తకాల భద్రతపైనే దృష్టి పెట్టేవి. ఇప్పుడు పాఠకుడికి అవసరమైన సమాచారాన్ని వేగంగా, సులభంగా అందించడం ప్రధాన లక్ష్యంగా మారింది. దీనివల్ల డిజిటల్ లైబ్రరీలు, ఈ-బుక్స్, ఆన్‌లైన్ డేటాబేసులు, వర్చువల్ సేవలు వేగంగా అభివృద్ధి చెందాయి. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సేవలు రూపొందించడం వల్ల గ్రంథాలయాల ప్రాధాన్యం మరింత పెరిగింది.

న్యూ పబ్లిక్ మేనేజ్‌మెంట్ ప్రభావంతో సమాచార సాంకేతిక వినియోగం కూడా విస్తరించింది. ప్రస్తుతం అనేక విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు "ఇంటిగ్రేటెడ్ లైబ్రరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్" వంటి సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగిస్తున్నాయి. వీటి ద్వారా పుస్తకాల జాబితా, జారీ, రిటర్న్, సభ్యత్వ నిర్వహణ, డిజిటల్ భద్రపరిచే ప్రక్రియలు వేగవంతమయ్యాయి. "ఆర్ఎఫ్ఐడి" సాంకేతికత ద్వారా పుస్తకాల భద్రత, ట్రాకింగ్ మరింత సమర్థవంతమయ్యాయి. దీని వల్ల సమయం, ఖర్చు, మానవ వనరుల వినియోగం తగ్గి సేవల నాణ్యత పెరిగింది. ఈ విధానం పనితీరు మూల్యాంకనానికి కూడా ప్రాధాన్యం ఇచ్చింది. ఒక గ్రంథాలయం ఎంతమందికి సేవలు అందిస్తోంది? డిజిటల్ వనరుల వినియోగం ఎంత? పరిశోధకులకు ఎంత సహాయం అందుతోంది? వంటి అంశాల ఆధారంగా పనితీరును అంచనా వేస్తున్నారు. దీనివల్ల బాధ్యతాయుత పరిపాలన, పారదర్శకత పెరిగాయి.

భారతదేశంలో "నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్", "ఇన్ఫ్లిబ్‌నెట్" వంటి సంస్థలు డిజిటల్ సమాచార సేవల విస్తరణలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. వీటి ద్వారా విశ్వవిద్యాలయాల మధ్య సమాచార మార్పిడి, ఈ-జర్నల్స్ అందుబాటు, డిజిటల్ రిపాజిటరీల అభివృద్ధి సాధ్యమవుతోంది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా అంతర్జాతీయ స్థాయి సమాచారాన్ని పొందగలుగుతున్నారు.

అయితే ఈ విధానంపై కొన్ని విమర్శలు కూడా ఉన్నాయి. పూర్తిగా మార్కెట్ దృక్పథంతో గ్రంథాలయాలను నడిపితే సామాజిక బాధ్యత తగ్గిపోతుందనే ఆందోళన ఉంది. పేదలు, గ్రామీణ ప్రజలు, అట్టడుగు వర్గాల అవసరాలు నిర్లక్ష్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. జ్ఞానం ఒక సామాజిక హక్కు అనే భావన బలహీనపడే అవకాశం కూడా ఉంది. అందువల్ల సమర్థతతో పాటు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రస్తుతం లైబ్రేరియన్లు కేవలం పుస్తక సంరక్షకులుగా కాకుండా సమాచార నిర్వాహకులు, డిజిటల్ నిపుణులు, డేటా విశ్లేషకులుగా మారుతున్నారు. దీనికి అనుగుణంగా డిజిటల్ లిటరసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలు సమాచార శాస్త్ర విద్యలో చోటు పొందుతున్నాయి. మొత్తానికి, న్యూ పబ్లిక్ మేనేజ్‌మెంట్ గ్రంథాలయ మరియు సమాచార శాస్త్ర రంగానికి కొత్త అవకాశాలను తెరిచింది. ఇది సేవల నాణ్యత, సాంకేతిక వినియోగం, పారదర్శకత, వినియోగదారుల సంతృప్తిని పెంచుతోంది. అదే సమయంలో ప్రజా సేవా విలువలు, సమాన సమాచార హక్కును కాపాడటం కూడా అత్యంత అవసరం. సమర్థతతో పాటు మానవతా దృక్పథం కలిసినప్పుడే గ్రంథాలయాలు సమాజానికి నిజమైన జ్ఞాన కేంద్రాలుగా మారగలవు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# టిడిపి హయాంలో జరిగిన నిశ్శబ్ద ఛిద్రం తర్వాత నిప్పుకణిక

1969 వీరోచిత తెలంగాణ పోరాటం ఉక్కుపాదంతో అణచివేయబడిన తర్వాత, తెలంగాణ సమాజం సుమారు రెండు దశాబ్దాల పాటు ఒక రకమైన మేధోపరమైన స్తబ్ధతలో ఉండిపోయింది. కానీ ఇది బాహ్యంగా కనిపించిన నిశ్శబ్దం మాత్రమే. లోపల మేధావులు, యువత, ఉద్యోగులు, రైతులు ఒక రకమైన మథనంలో పడ్డారు. ఆ మథనం నుంచి ఉద్భవించిన ఆలోచనలు, సమాచార సేకరణ, సామాజిక విశ్లేషణలు తర్వాతి తెలంగాణ ఉద్యమానికి బలమైన మేధో పునాది వేశాయి. ఈ ప్రస్థానం ఒక వ్యక్తి లేదా ఒక పార్టీ ఫలితం కాదు - ఇది బహుళ శక్తులు, బహుళ కోణాలు కలిసి ఏర్పడిన చారిత్రక ప్రవాహం.



**గవర్నర్ పాలన - ఉద్యోగాలు, కానీ అసంతృప్తి**

గవర్నర్ పాలన కాలంలో ఐదు లక్షల ఉద్యోగాలు లభించాయి. ఇది యువతకు కొంత ఊరటనిచ్చింది. కానీ ఇది మూల సమస్యలను పరిష్కరించలేదు. తెలంగాణ వనరుల దోపిడీ, ఉద్యోగాల్లో అన్యాయం, బడ్జెట్ మళ్లింపు వంటి సమస్యలు కొనసాగాయి. ఈ కాలంలోనే కొందరు యువకులు "వ్యవస్థను మార్చాలి" అని విప్లవ బాట పట్టారు. 1970-90 మధ్య కాలం పార్లమెంటరీ రాజకీయాలను వదిలి సామాజిక, సాంస్కృతిక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు సాగాయి. ఎన్టీ రామారావు పాలనలో తీవ్ర నిర్బంధాలు, హత్యలు పెరిగాయి. ఆ సమయంలో ప్రజలు "కాంగ్రెస్‌ను గెలిపించి ఎన్టీఆర్‌ను ఓడించాలి" అని భావించారు. గెలిపించారు కూడా. కానీ ఆ తర్వాత తెలంగాణ సమస్యలు మరింత తీవ్రమయ్యాయి.

బడ్జెట్ దోపిడీ, హైదరాబాద్ ఆక్రమణ - మేధో మథనం


ఈ కాలంలో బడ్జెట్ల దోపిడీ, హైదరాబాద్‌లోని వనరుల ఆక్రమణ తీవ్రంగా జరిగాయి. ఇది తెలంగాణ మేధావుల్లో పునరధ్యయనానికి దారి తీసింది. 1989లో "సమాచార పోరాటం" అత్యవసరమని గుర్తించిన మేధావులు తెలంగాణ అస్తిత్వ పునరుద్ధరణకు నడుం బిగించారు. ఇది రాజకీయ పార్టీల కంటే ముందు మేధావులు, పౌర సమాజం వేసిన బలమైన పునాది.

**తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ (1989) - సత్యశోధన కేంద్రం**

1989లో ఏర్పడిన తెలంగాణ ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ ఈ ఉద్యమానికి అమోఘమైన పాత్ర పోషించింది. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్/ఖైరతాబాద్‌లోని ప్రభాకర్ నివాసం ఈ ఉద్యమ ప్రయోగశాలగా మారింది. లక్ష్యం: ఆంధ్ర పాలకులు తెలంగాణ వనరులను ఎలా దోచుకుంటున్నారో అంకెలతో నిరూపించడం. ముల్కీ నిబంధనల ఉల్లంఘన, నిధుల మళ్లింపుపై శ్వేతపత్రాలు సిద్ధం చేయడంలో ఈ ట్రస్ట్ విజయం సాధించింది. ప్రభాకర్ గారి కృషి, మధుసూదన్ రెడ్డి వంటి ప్రొఫెసర్ల మేధో సహకారం ఈ ఉద్యమానికి బలం చేకూర్చాయి.

అదే సమయంలో ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు, ప్రొఫెసర్లు చర్చలు ప్రారంభించారు. "కాకతి" పేరుతో తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతపై పుస్తకాలు వెలువడ్డాయి. విప్లవ ఉద్యమ చైతన్యం కూడా ఈ మేధో పునరుజ్జీవనానికి బలం చేకూర్చింది. ప్రధాని దేవేగౌడ చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నారనే సందేశం ఉత్సాహాన్ని పెంచింది.

మిగితా తరువాయి రేపటి సంచికలో..



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

# ప్రాచీన భారతీయ ఇంజనీరింగ్ వైభవం

## భవిష్యత్తుకు మార్గదర్శకం!

*ప్రాచీన భారతీయ ఇంజనీరింగ్ విధానం ప్రపంచ నాగరికత చరిత్రలో అత్యంత విశిష్ట స్థానాన్ని సంపాదించిన విజ్ఞాన సంపదగా నిలిచింది. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో కంప్యూటర్లు, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ డిజైన్ వ్యవస్థలు ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, వేల సంవత్సరాల క్రితం భారతీయ శిల్పులు నిర్మించిన దేవాలయాలు, ఆనకట్టలు, కోటలు, గోపురాలు, రాజభవనాలు ఇప్పటికీ అచంచలంగా నిలబడటం ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తోంది. ముఖ్యంగా రాళ్లను ఒకదానికొకటి ఖచ్చితంగా అమర్చే ఇంటర్‌లాకింగ్ సిస్టమ్, గాలి ప్రసరణకు అనుకూల నిర్మాణాలు, భూకంప నిరోధక శిల్పకళ, నీటి నిర్వహణ పద్ధతులు - ఇవన్నీ ప్రాచీన భారతీయ ఇంజనీరింగ్ మహత్తును తెలియజేస్తున్నాయి.*



సుమారు క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల నాటి సింధు లోయ నాగరికత నుంచే భారతీయ ఇంజనీరింగ్ వ్యవస్థ ప్రారంభమైనట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. హరప్పా, మొహెంజోదారో పట్టణాల్లో కనిపించిన డ్రైనేజీ వ్యవస్థలు ప్రపంచంలోనే అత్యంత పురాతన నగర ప్రణాళికలుగా గుర్తించబడ్డాయి. ఆ కాలంలోనే కాలువలు, నీటి నిల్వ వ్యవస్థలు, రహదారుల నిర్మాణం, ఇటుకల ప్రమాణీకరణ భారతీయుల సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతిబింబించాయి. ఒకే కొలతలతో తయారు చేసిన ఇటుకలు, సమాన దూరంతో నిర్మించిన వీధులు, వర్షపు నీటి పారుదల పద్ధతులు నేటి ఆధునిక మున్సిపల్ ఇంజనీరింగ్‌కు కూడా ఆదర్శంగా నిలుస్తున్నాయి.

ముఖ్యంగా ఎలాంటి సిమెంట్ లేకుండా భారీ రాళ్లను ఇంటర్‌లాకింగ్ విధానంలో అమర్చడం భారతీయ శిల్పుల అసాధారణ ప్రతిభను తెలియజేస్తోంది. తమిళనాడులోని బృహదీశ్వరాలయం, తెలంగాణలోని రామప్ప దేవాలయం, ఒడిశాలోని కోణార్క సూర్య దేవాలయం, మహారాష్ట్రలోని అజంతా-ఎల్లోరా గుహలు ఈ ఇంజనీరింగ్ అద్భుతాలకు నిలువెత్తు సాక్ష్యాలుగా ఉన్నాయి. రామప్ప దేవాలయంలో ఉపయోగించిన తేలికపాటి ఇటుకలు భూకంపాలను తట్టుకునే ప్రత్యేక లక్షణాలతో నిర్మించబడ్డాయి. ఆధునిక శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసిన తరువాతే ఆ నిర్మాణ సాంకేతికత వెనుక ఉన్న రహస్యాలను కొంతవరకు అర్థం చేసుకోగలిగారు.

ప్రాచీన కాలంలో వాస్తు శాస్త్రం, శిల్ప శాస్త్రం, ఖగోళ విజ్ఞానం ఆధారంగా నిర్మాణాలు చేపట్టేవారు. సూర్యకిరణాలు ఏ దిశలో పడాలి, గాలి ఏ దిశగా ప్రవహించాలి, నీరు ఎక్కడ నిల్వ కావాలి అన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని భవనాలను నిర్మించేవారు. అందువల్ల ఆ నిర్మాణాలు వాతావరణ మార్పులకు సులభంగా అనుగుణంగా ఉండేవి. వేసవిలో చల్లదనం, చలికాలంలో వెచ్చదనం కలిగే విధంగా నిర్మాణాల రూపకల్పన జరిగేది. ప్రాచీన భారతీయ ఆనకట్టల నిర్మాణ విధానం కూడా ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే స్థాయిలో ఉండేది. తమిళనాడులోని కల్లణై ఆనకట్ట సుమారు క్రీస్తుశకం 2వ శతాబ్దంలో చోళ రాజు కరికాల చోళుడు నిర్మించాడని చరిత్ర చెబుతోంది. ఈ ఆనకట్ట ఇప్పటికీ ఉపయోగంలో ఉండటం ప్రాచీన భారతీయ ఇంజనీరింగ్ ప్రతిభకు గొప్ప ఉదాహరణగా భావించబడుతోంది. భారీ రాళ్లను ఒకదానికొకటి బిగుసుకునే విధంగా అమర్చి నీటి ఒత్తిడిని తట్టుకునే విధంగా నిర్మించారు. సిమెంట్ లేకుండా నిర్మించినప్పటికీ వేల సంవత్సరాలుగా నిలకడగా ఉండటం విశేషం.

నేటి అనేక ఆధునిక ఆనకట్టలు 50 లేదా 100 సంవత్సరాల్లో మరమ్మతులు అవసరమవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రాచీన భారతీయులు ప్రకృతి సహజ పదార్థాలను ఉపయోగించి నిర్మాణాలు చేపట్టేవారు. చున్నం, బెల్లం, గుడ్డు తెల్లసొన, మొక్కల రసాలు కలిపి ప్రత్యేకమైన మిశ్రమాలను తయారు చేసేవారు. ఈ మిశ్రమాలు కాలక్రమంలో మరింత దృఢంగా మారేవి. ఆధునిక కాంక్రీట్ నిర్మాణాల్లో కనిపించే చీలికలు ప్రాచీన నిర్మాణాల్లో తక్కువగా కనిపించడం ఇందుకు నిదర్శనం.

దేవాలయాల గోపురాలు నిర్మించేటప్పుడు భూమి భారం సమానంగా పంచుకునే విధంగా ప్రత్యేక గణిత సూత్రాలను ఉపయోగించేవారు. నేటి కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లు లేకపోయినప్పటికీ ఖచ్చితమైన కొలతలతో నిర్మాణాలు చేపట్టడం విశేషం. రాళ్లను కోయడం, తరలించడం, అమర్చడం వంటి పనుల్లో సమూహ కృషి ప్రధాన పాత్ర పోషించేది. శిల్పులు, కార్మికులు, ఖగోళ నిపుణులు, గణిత శాస్త్రవేత్తలు కలిసి నిర్మాణ ప్రణాళికలను రూపొందించేవారు.

ఆ కాలంలో నిర్మించిన కోటలు యుద్ధ వ్యూహాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించబడ్డాయి. గాలి దిశలు, రహస్య మార్గాలు, నీటి నిల్వలు, రక్షణ గోడలు అన్నీ శాస్త్రీయంగా రూపకల్పన చేయబడ్డాయి. రాజస్థాన్ కోటలు, గోల్కొండ కోట, చిత్తోడ్ కోట వంటి నిర్మాణాలు ఇప్పటికీ దృఢత్వానికి చిహ్నాలుగా నిలుస్తున్నాయి. గోల్కొండ కోటలో శబ్ద ప్రతిధ్వని వ్యవస్థ నేటి ఆడియో ఇంజనీరింగ్‌కు కూడా ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒకచోట చప్పట్లు కొడితే దూర ప్రాంతంలో వినిపించే విధంగా నిర్మాణం రూపొందించడం అసాధారణ శాస్త్రీయ ప్రతిభకు నిదర్శనం.

ప్రాచీన భారతీయ ఇంజనీరింగ్ వ్యవస్థ ప్రకృతితో సమన్వయాన్ని ప్రధానంగా పరిగణించేది. చెరువులు, కాలువలు, బావులు, మెట్లు ఉన్న కుంటలు నిర్మించి నీటి సంరక్షణకు పెద్దపీట వేయబడింది. గుజరాత్‌లోని స్టెప్ వెల్స్, హంపిలోని నీటి మార్గాలు, కాకతీయుల చెరువుల వ్యవస్థలు ప్రపంచ స్థాయి నీటి నిర్వహణ నమూనాలుగా నిలిచాయి. వర్షపు నీటిని వృథా కాకుండా నిల్వ చేసే పద్ధతులు అప్పట్లోనే అమల్లో ఉండేవి. గ్రామీణ వ్యవసాయానికి అవసరమైన నీటిని నిల్వ చేయడం ద్వారా కరవును ఎదుర్కొనే సామర్థ్యం పెరిగేది. ఆధునిక యుగంలో మళ్లీ రైన్ వాటర్ హార్వెస్టింగ్ పేరుతో అదే పద్ధతులను అనుసరిస్తున్నారు.

ప్రాచీన నిర్మాణాల్లో ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే ప్రత్యేక శక్తి ఉండేది. భూకంపాలు, తుఫాన్లు, భారీ వర్షాలను తట్టుకునేలా నిర్మాణ శైలులు ఉండేవి. రాళ్లను బిగుసుకునే విధంగా అమర్చడం వల్ల ప్రకంపనల సమయంలో నిర్మాణం కూలిపోకుండా ఉండేది. ఆధునిక కాలంలో ఎక్కువగా కాంక్రీట్, ఇనుము ఆధారిత నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇవి వేగంగా నిర్మించడానికి అనుకూలమైనప్పటికీ కాలక్రమంలో తుప్పు, పగుళ్లు, నిర్మాణ బలహీనతలు ఎదురవుతున్నాయి. ప్రాచీన నిర్మాణాలు సహజ వాతావరణానికి అనుగుణంగా ఉండటం వల్ల శతాబ్దాల పాటు నిలిచాయి.

అయితే ఆధునిక టెక్నాలజీ వల్ల నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. కంప్యూటర్ ఆధారిత డిజైనింగ్, 3డి మోడలింగ్, డ్రోన్ల సర్వేలు, ఆటోమేటెడ్ యంత్రాలు నిర్మాణ వేగాన్ని పెంచాయి. భారీ వంతెనలు, మెట్రో రైళ్లు, ఆకాశహర్మ్యాలు, సముద్రంపై నిర్మాణాలు ఆధునిక సాంకేతికత వల్ల సాధ్యమయ్యాయి. ఒకప్పుడు సంవత్సరాలు పట్టే నిర్మాణాలు ఇప్పుడు కొన్ని నెలల్లో పూర్తి అవుతున్నాయి. భూకంప నిరోధక సాంకేతికత, ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు, స్మార్ట్ బిల్డింగ్ టెక్నాలజీలు ఆధునిక నిర్మాణాల్లో ఉపయోగించబడుతున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారిత డిజైన్ విధానాలు నిర్మాణ లోపాలను ముందుగానే గుర్తించే స్థాయికి చేరుకున్నాయి.

ప్రాచీన టెక్నాలజీకి ఆధునిక టెక్నాలజీకి మధ్య ఉన్న ప్రధాన తేడా నిర్మాణ తత్వంలో కనిపిస్తుంది. ప్రాచీన భారతీయులు దీర్ఘకాలిక స్థిరత్వాన్ని ప్రధానంగా పరిగణించగా ఆధునిక యుగం వేగం, సౌలభ్యం, ఖర్చు నియంత్రణపై దృష్టి పెడుతోంది. పూర్వ కాలంలో ప్రకృతి సహజ పదార్థాలను ఉపయోగించేవారు. ప్రస్తుతం కృత్రిమ పదార్థాల వినియోగం ఎక్కువైంది. అప్పట్లో చేతిపని ప్రధానంగా ఉండేది. ఇప్పుడు యంత్రాల ఆధిపత్యం పెరిగింది. ప్రాచీన నిర్మాణాలు కళాత్మకతకు ప్రతీకలుగా ఉండేవి. ప్రస్తుతం ఫంక్షనల్ డిజైన్ ప్రధాన లక్ష్యంగా మారింది.

పూర్వ కాలంలో నిర్మాణాలు సామాజిక అవసరాలు, ఆధ్యాత్మిక విలువలు, పర్యావరణ సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్మించబడేవి. ఆధునిక కాలంలో నగరీకరణ, జనాభా పెరుగుదల, పారిశ్రామిక అవసరాల దృష్ట్యా భారీ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. అయినప్పటికీ ప్రాచీన భారతీయ ఇంజనీరింగ్ సూత్రాలను ఆధునిక శాస్త్రవేత్తలు మళ్లీ అధ్యయనం చేస్తున్నారు. గ్రీన్ బిల్డింగ్ టెక్నాలజీ, పర్యావరణ అనుకూల నిర్మాణాలు, సహజ గాలి ప్రసరణ విధానాలు, సౌరశక్తి వినియోగం వంటి అంశాలు ప్రాచీన జ్ఞానాన్ని గుర్తు చేస్తున్నాయి.

భారతీయ ఇంజనీరింగ్ వారసత్వం కేవలం చారిత్రక సంపద మాత్రమే కాదు భవిష్యత్ తరాలకు మార్గదర్శకమైన విజ్ఞాన భాండాగారం కూడా. భారతీయ శిల్పులు నిర్మించిన ప్రతి కట్టడం వెనుక శాస్త్రం, గణితం, ఖగోళ విజ్ఞానం, పర్యావరణ అవగాహన, కళాత్మకత సమన్వయంగా కనిపిస్తాయి. ఒక దేవాలయం కేవలం ప్రార్థనా స్థలం మాత్రమే కాదు శబ్ద శాస్త్రం, కాంతి శాస్త్రం, గాలి ప్రసరణ, నిర్మాణ గణితం, శిల్పకళల సమ్మేళనంగా ఉండేది. ఒక చెరువు కేవలం నీటి నిల్వ కేంద్రం మాత్రమే కాదు వ్యవసాయ భద్రతకు ఆధారం. ఒక కోట కేవలం రక్షణ స్థావరం మాత్రమే కాదు వ్యూహాత్మక ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనం.

భారతీయులు నిర్మాణాలను ప్రకృతి భాగంగా భావించేవారు. అందువల్ల అవి సహజ వాతావరణంతో కలిసిపోయేలా ఉండేవి. ఆధునిక నగరాల్లో ప్రస్తుతం ఎదురవుతున్న వేడి సమస్యలు, నీటి నిల్వ సమస్యలు, గాలి ప్రసరణ లోపాలు ప్రాచీన నిర్మాణాల్లో చాలా తక్కువగా కనిపించేవి. ఎందుకంటే అప్పటి నిర్మాణాలు స్థానిక వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నిర్మించబడ్డాయి.

భవిష్యత్తులో భారతదేశం తన ప్రాచీన ఇంజనీరింగ్ జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో సమన్వయం చేయగలిగితే ప్రపంచానికి మళ్లీ మార్గదర్శక దేశంగా నిలిచే అవకాశం ఉంది. ఇంజనీరింగ్ విద్యలో భారతీయ ప్రాచీన నిర్మాణ శాస్త్రాన్ని కూడా భాగంగా చేర్చాల్సిన అవసరం ఉంది. విద్యార్థులు కేవలం ఆధునిక సాఫ్ట్‌వేర్‌లపై మాత్రమే కాకుండా ప్రాచీన నిర్మాణాల శాస్త్రీయ నేపథ్యంపై కూడా అవగాహన పెంపొందించుకోవాలి. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు కలిసి భారతీయ నిర్మాణ వారసత్వాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ఉంది. పాత దేవాలయాలు, కోటలు, చెరువులు కేవలం పర్యాటక ప్రాంతాలు కాదు భారతీయ విజ్ఞాన చరిత్రకు సజీవ సాక్ష్యాలు. వాటిని కాపాడటం అంటే భారతీయ మేధస్సును కాపాడినట్టే.

వేల సంవత్సరాల క్రితం భారతీయులు సాధించిన ఇంజనీరింగ్ విజయాలు మానవ మేధస్సుకు చిరస్థాయి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. భారతీయ నాగరికత కేవలం సంస్కృతి, సాహిత్యం, ఆధ్యాత్మికతలోనే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగంలో కూడా ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందని ప్రాచీన ఇంజనీరింగ్ వ్యవస్థ స్పష్టంగా నిరూపిస్తోంది.




డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## మిత్రమా..!

నువ్వు ఒక సంద్రాన్ని
దిగమింగిన వాడివి
ఎన్ని దుఃఖాలను అనుభవించినా
నువ్వు కంట కన్నీరు రాకుండా
చిరునవ్వును అందరిలో పులిమిన వాడివో ...
నిన్ను అర్థం చేసుకోవడానికి
నీతో నడిస్తే చాలదేమో
నిన్ను నిన్నుగా చూడడం
ఓ కాలం పట్టగలదేమో మిత్రమా..!
ఎన్ని ఆలోచనల సుడిగుండాలో
నీలో ఎన్ని లావలు బద్దలైనాయో
ఆ హృదయపు రాగములో
అయినా ఆత్మీయంగా పలకరించే
నీ మాట తీరు
మైత్రికే వన్నె తెచ్చింది కదా నేస్తం..!
పండు వెన్నెల చంద్రుడిలా
నీ ముఖం అంతా వెలుగులు చూసిన వాళ్లంగా
ఇప్పుడు ఏ గ్రహణం పరిచిందని
దిగాలు చెందుతున్నావు మిత్రమా..!
నీ ధైర్యానికి .. నీ పట్టుదలకు
ఏ గ్రహణం .. ఏం చెయ్యగలదు
నీవు పున్నపు వెలుగులై
అందరిలో ప్రకాశించే ఆ ఆదిత్యుడివి నేస్తం..!

- మంగల సంతోష్

## సలహా!



దేశం బాగుపడాలంటే
మనిషి మారాలి!
'ఆలోచన' మారాలి!
మనిషి మారకుండా
దేశం బాగుపడదు!
సమాజం ముందుకు
మనిషివెనక్కా !
వాడి పాత అలవాట్లు
కులమతభాషాప్రాంత
భావాలు వదలాలి!
పాలకవర్గాలుకూడా
ధోరణి మార్చుకోవాలి!
విశాలభావాలను
కలిగివుండాలని!
ప్రచారం చెయ్యాలి!
మానవత్వం కేంద్రంగా
మనోభావాలను
ప్రోత్సహించాలి!
కులమత భావాలు
వద్దని చెప్పాలి!
సహకార గుణం పెంచి
ప్రేమ కరుణ వంటి
విశాలభావాలను
అందివ్వాలి!రాజకీయం
దేశశ్రేయస్సుకావాలి!
సంకుచిత భావాలతో
రగిలిపోతున్న మనిషి
ప్రేమానురాగాలతో
జ్యోతిర్గమయంకావాలి
అభ్యుదయంసాధించాలి
ఎవరి మతం వారిది!
ఎవరి కులం వారిది!
అవి పాత అలవాట్లు
ఆ అవశేషాలను
వదిలించు కోవాలి!
వదిలించుకోలేనివాళ్లకు
నా 'సలహా' ఒక్కటి!
కనీసంవాటిని 'గుమ్మం'
దాట నివ్వకండి!ఇంటికి
పరిమితం చెయ్యండి!
విద్య వైద్యం ఉద్యోగం
అందరికీ 'ఇవి' కావాలి!
అందరు ఐక్యమై
వీటికోసం అడగండి!
పాలకుల్నినిలదీయండి!
సలహా ఇవ్వటం తేలికే!
కాని నిస్వార్థ సలహాలు
ప్రపంచాన్ని మారుస్తాయి
యద్భావం తద్భవతి!
మీభావాలేమీవిజయాలు

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# పౌష్టికాహారంతో వ్యాధులు దూరం

- జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 25 (జనంసాక్షి) :** నాణ్యమైన పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యం బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో భాగంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ ఆవరణలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాలులో న్యూట్రిషన్ మిషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోషకాహార మేళలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్ లో జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల నుండి ప్రదర్శించిన పలు పదార్థాలను రుచి చూసిన కలెక్టర్ అంగన్వాడీ ద్వారా గర్భిణులకు ఈ విధమైన పౌష్టికారాన్ని అందించాలని తెలిపారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6వ తేదీ నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో ఇప్పటి వరకు ప్రతి వారం ఒక్కో థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇప్పటి వరకు నిర్వహించిన థీమ్ లను కింది స్థాయి నుండి పై అధికారి వరకు అందరూ సమార్ధవంతంగా పని చేసి విజయవంతం చేయడం జరిగింది. అదే విధంగా నేటి సోమవారం నుండి



ప్రారంభమయిన మహిళా వారోత్సవాలను కూడా అందరూ సమిష్టిగా పని చేసి విజయవంతం చేయాలని సూచించారు. మనం నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధుల బారినపడకుండా మనల్ని మనం కాపాడుకోగలుగుతామని అన్నారు. సేంద్రీయ పద్దతిలో పండించిన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. అంగన్ వాడి టీచర్లు గ్రామీణస్థాయి మహిళలకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం గర్భిణీ మహిళలకు, శిశు సంక్షేమం కోసం అంగన్వాడీ ద్వారా పలు పోషక విలువలు కలిగిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తుంది. పోషకాహార మేళ ను ప్రజలకు, అధికారులకు ఒక అవగాహన కల్పించడం కోసం నిర్వహించడం జరిగిందని అన్నారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ మన శరీరం మనం ఉన్నంత వరకు ఉంటుంది. అందుచేత మనం మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలని, నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని, తద్వారా మనకు ఏవిధమైన వ్యాధులు దరి చేరకుండా ఉంటామన్నరు. మహిళా వారోత్సవాలలో భాగంగా న్యూట్రిషన్ ఫుడ్ ఎగ్జిబిషన్, అంగన్వాడీ లబ్ది దారులు, తల్లితండ్రుల చేత వంటలపోటీలు నిర్వహించరు అందులో భాగంగా సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు న్యూట్రిషన్ ఫుడ్ పైన అవగాహన కలిగిస్తూ స్టాల్స్ నందు తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, కూరగాయలు మరియు పండ్లుకు సంబందించిన ఆహార పదార్ధాలను స్టాల్ లో ప్రదర్శనకు పెట్టారు జంక్ ఫుడ్ యొక్క దుష్ప్రభావాలు మరియు న్యూట్రిషన్ ఫుడ్ యొక్క లాభాలను వివరిస్తూ చాట్స్ ని ప్రదర్శించరు హెల్త్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో గర్భిణి బాలింతలు మరియు కిశోర బాలికలకు రక్త హీనత పరీక్షలు నిర్వహించరు గర్భిణి బాలింతలకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలు, వంటల పోటీలలో గెలుపొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, పిడి డిఆర్డిఓ, సిడిపిఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, మరియు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు

- చిలుక వాగు బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలి
- 13వ వార్డులో బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**తాండూరు, మే 25 (జనంసాక్షి) :** పట్టణంలోని 13వ వార్డులో చిలుక వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులతో కలిసి బ్రిడ్జి నిర్మాణ ప్రాంతానికి చేరుకున్న ఎమ్మెల్యే, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే 13వ వార్డుతో పాటు చుట్టుపక్కల కాలనీల ప్రజలకు వర్షాకాలంలో ఎదురయ్యే రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, అభివృద్ధి పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## వీధి నాటకాలతో చరిత్ర సజీవం



**యాలాల, మే 25 (జనంసాక్షి) :** వీధి నాటకాలు మన చరిత్రను, సంస్కృతిని గుర్తుచేస్తాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. యాలాల్ మండలం కమాల్ పూర్ గ్రామంలో నిర్వహించిన "శ్రీ నల్ల పోచమ్మ" వీధి నాటక కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంతులుకు, పాత్రధారులకు, కళాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి వీధి నాటకాలు ప్రదర్శించడం అభినందనీయమని కొనియాడారు. వీధి నాటకాల ద్వారా మన పూర్వీకుల చరిత్ర, గ్రామీణ సంప్రదాయాలు, దేవతల వైభవం భవిష్యత్ తరాలకు తెలుస్తాయని అన్నారు. కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఇటీవలే ఎమ్మెల్యే యాలాల్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అభివృద్ధితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొంటున్నాం



**ఫరూక్‌నగర్, మే 25 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షపాతి రైతుల మేలుకోరే పార్టీ అని మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి అన్నారు అకాల వర్షాల వల్ల తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొంటామని షాద్ నగర్ మార్కెట్ యార్డులో వరి ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని ప్రకృతి వైపరీత్యాల అకాల వర్షాల వల్ల కొంతమేరకు దాన్యం తడిసిందని అది కూడా మార్కెట్ కమిటీ నిర్వాహకుల నిర్లక్ష్యం లేదని అప్పటికే ఏజెంట్ల పరిధిలోకి ధాన్యం వెళ్లిందని రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నరు. రైతుల కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో యంత్ర పరికరాలు అందిస్తుందని ఏ ప్రభుత్వం చేయని మేలు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని దేశవ్యాప్తంగా రైతులు బిజెపి ప్రభుత్వంపై పోరాటం చేశారని రైతుల మెడకు ఉరితాళ్ళలాగా మారిన మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిన బిజెపి నాయకులు రైతుల వద్దకు వెళ్లి మాట్లాడడం హాస్యస్పదమన్నారు. తాము అధికారంలోకి వచ్చాక షాద్ నగర్ మార్కెట్ యార్డును మరింత ప్రక్షాళన చేసి రైతులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ కొందుర్గు మండల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి కరుణాకర్ గోవర్ధన్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల్‌లో వృద్ధులకు తప్పని 'పింఛన్' తిప్పలు!

- ఫేస్ రికగ్నిషన్ వెరిఫికేషన్ కోసం మున్సిపల్ కార్యాలయం వద్ద బారులు
- ఇంటి నుంచే చేసుకునే వీలున్నా అవగాహన లేక ఇబ్బందులు
- తొందరపడి ఆఫీసుకు రావద్దంటున్న అధికారులు

**అల్వాల్, మే 25 (జనంసాక్షి) :** భానుడు భగభగలాడుతున్నాడు.. ఉదయం తొమ్మిది దాటితేనే ఎండ తీవ్రత జనాలను వణికిస్తోంది. ఇలాంటి విపరీతమైన ఎండల్లోనూ పింఛనుదారులు వెరిఫికేషన్ కోసం అల్వాల్ మున్సిపల్ కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి చూడాల్సి రావడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పింఛన్ల చెల్లింపులో పారదర్శకత, కచ్చితత్వం కోసం ప్రభుత్వం 'ఫేస్ రికగ్నిషన్ యాప్' విధానాన్ని తీసుకొచ్చినప్పటికీ.. క్షేత్రస్థాయిలో సరైన అవగాహన లేకపోవడంతో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద వృద్ధులు, వికలాంగులు బారులు తీరారు.

### ఉక్కపోత.. ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన వృద్ధులు

ఈ సరికొత్త సాంకేతికత ద్వారా లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తమ ఇంటి నుంచే మొబైల్ యాప్ ద్వారా గుర్తింపును నిర్ధారించుకోవచ్చని




అధికారులు చెబుతున్నారు. అయితే ఈ విషయంపై సరైన ప్రచారం లేకపోవడంతో అల్వాల్ పరిధిలోని వృద్ధులు సోమవారం ఉదయాన్నే మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కనీస నీడ, తాగునీటి సదుపాయం సరిగ్గా లేకపోవడంతో తీవ్రమైన ఎండకు, ఉక్కపోతకు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్యాలయ సిబ్బంది వృద్ధులకు లైన్లలో నిలబెట్టి ఫేస్ రికగ్నిషన్ ఫొటోలు తీసి వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.

### తొందరపడొద్దు.. ఇంటి నుంచే చేసుకోవచ్చు

ఎండల తీవ్రత దృష్ట్యా పింఛనుదారులు ఎవరూ తొందరపడి అల్వాల్ మున్సిపల్ కార్యాలయానికి రావద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు ఇంటి నుంచే యాప్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని, వృద్ధులు ఎండల్లో వచ్చి ఇబ్బంది పడొద్దని స్పష్టం చేశారు.

## స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి ప్రభుత్వ భూమి గృహ స్థలం కేటాయించాలి

- ప్రజావాణిలో మొరపెట్టుకున్న 90 సంవత్సరాల వృద్ధురాలు



**గద్వాల నడిగడ్డ మే 25 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్వాతంత్ర సమరయోధుల కుటుంబానికి ప్రభుత్వ భూమి గృహ స్థలం కేటాయించాలని కలెక్టర్ ని కోరుతూ లింగమ్మ సోమవారము ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. ధరూరు మండలం ఉప్పేరు గ్రామానికి చెందిన లింగమ్మ తన భర్త తాయప్ప దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని దేశ సేవ చేసిన స్వాతంత్ర సమరయోధుడని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన మరణించడంతో తాను ఆర్థిక,సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రభుత్వ రెవెన్యూ శాఖ జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్ నం.185,తేదీ 11-03-1997 ప్రకారం స్వాతంత్ర సమరయోధులు మరియు వారి కుటుంబాలకు గృహ స్థలం,ప్రభుత్వ భూమి కేటాయింపు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయాన్ని ఆమె వినతిపత్రంలో ప్రస్తావించారు. సంబంధిత జి.ఓ. నిబంధనల మేరకు తనకు ప్రభుత్వ భూమి, గృహ స్థలం కేటాయించి జీవనోపాధికి తోడ్పాటు అందించాలని లింగమ్మ జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## పూడికతీత పనులన్నింటినీ పూర్తి చేయాలి



**జడ్చర్ల, మే 25 (జనంసాక్షి) :** వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రతిపాదించిన డీ-సిల్టింగ్ (పూడికతీత) పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి, ప్రతిపాదిత పూడికతీత పనుల స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, వాటి సాధ్యతలపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, వర్షపు నీరు సజావుగా సాగిపోయేలా ముందస్తు చర్యలు చేపట్టాలని మరియు పనుల అమలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం




- ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, మే 25 (జనంసాక్షి) :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలో సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య రైతులకు జనుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే మొదటగా జనుము విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన నియోజకవర్గం చేవెళ్ల నియోజకవర్గమని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించి వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుదన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జనుము విత్తనాల పూర్తి ధర క్వింటాలుకు రూ.15,550/- లు కాగా ప్రభుత్వ సబ్సిడీ 50% అంటే రైతు చెల్లించవలసిన రూ. 7775/- రైతుకు 40 కేజీల జనుము విత్తనాల బస్తాకు రూ.3110/- చెల్లించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి, ముడిమ్యాల, చేవెళ్ల సొసైటీ చైర్మన్ లు గోనె ప్రతాప్ రెడ్డి, దేవర వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎర్ర మల్లేష్, సర్పంచ్ గౌడిచెర్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గోనె జంగా రెడ్డి, సొసైటీ డైరెక్టర్ పడాల రాములు, కేసారం నరేందర్, మాధవ రెడ్డి, అరుణమ్మ, శివరాజ్, మాజీ సర్పంచ్ లు పడాల ప్రభాకర్, కేసారం శ్రీనివాస్, పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, నాయకులు గోనె శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, టేకులపల్లి శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వీఓఏలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి




**మహేశ్వరం, మే 25 (జనంసాక్షి) :** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలో పని చేస్తున్న విఓఏలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు.సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలో వీఓఏలు చేపడుతున్న సమ్మెకు అందెల శ్రీరాములు యాదవ్ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ...వీఓఏలకు గౌరవ వేతనం నెలకు 26000 రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు విఓఏలకు ఇస్తానన్న హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవేందర్ రెడ్డి,జంగయ్య యాదవ్,పాండు నాయక్, దేశ్యా నాయక్,యాదయ్య గౌడ్, పోతర్ల సుదర్శన్ యాదవ్,హనుమంత్ నాయక్,మండల అధ్యక్షుడు యాదిష్,ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రావణ్,ఉపేందర్,బీజేవై ఎం నాయకుడు కుండే సురేష్,పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**నర్సాపూర్, మే 25 (జనం సాక్షి) :** రైతులు అధైర్య పడద్దని, ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సోమవారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని సాయి కృష్ణ రైస్ మిల్‌ను, నర్సాపూర్‌లో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డి ఎం సి ఎస్ జగదీష్, డిఎస్ఓ నిత్యానంద్ తాహాసిల్దార్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.



రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్,అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు, ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది రైస్ మిల్ యజమాని సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

# అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు

- ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత
- పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భవిష్యత్
- మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి ప్రతినిధి, మే 25 (జనం సాక్షి) :** అడవుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, రిజర్వ్ ఫారెస్టుల చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అడవి జంతువులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు కొండ సురేఖ, దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో రూ.1.44 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జిల్లా అటవీశాఖ కార్యాలయ భవనాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మరియు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, టి జి ఐ సి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా



బొంతపల్లి సమీపంలో "అమృతవనం", "హరితవనం" పేర్లతో రెండు ఆధునిక ఎకో పార్కులను అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. సంగారెడ్డి, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదించేలా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించినట్లు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్పందన ఆధారంగా 'నైట్ స్టే' సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని ప్రజలకు ఆమె పిలుపునిచ్చారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు భద్రమైన భవిష్యత్ అందించగలమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రకృతి వనాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని తెలిపారు.

సంగారెడ్డి జిల్లా బొంతపల్లి వద్ద ఏర్పాటు చేసిన అమృతవనం, హరితవనం వంటి ఎకో పార్కులు ప్రజలకు ప్రకృతి సౌందర్యాన్ని చేరువ చేయడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల జయప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, జిల్లా అటవీశాఖ అధికారి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



**సంగారెడ్డి, మే 25 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని సూచించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంగీత ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 102 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 44, సంగారెడ్డి డివిజన్‌కు 17, ఆందోల్ డివిజన్‌కు 07, నారాయణఖేడ్ డివిజన్‌కు 16, జహీరాబాద్ డివిజన్‌కు 18 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీలు, కిశోర బాలికలు పౌష్టికారం తీసుకోవాలి

**నర్సాపూర్, మే 25 (జనం సాక్షి) :** గర్భిణీలు, కిశోర బాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి నిత్యం పోషకాహారం తీసుకోవడం ఎంతో అవసరమని నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్ అన్నారు.99 రోజుల కార్యాచరణ' ప్రణాళికలో భాగంగా సోమవారం పట్టణంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మహిళా సంక్షేమ వారోత్సవాల కార్యక్రమాన్ని ఆమె



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పౌష్టికాహార ప్రదర్శనను ఆమె నిశితంగా పరిశీలించి, అక్కడికి వచ్చిన మహిళలతో 'పోషణ్' ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. నిత్యం తీసుకునే ఆహారపు అలవాట్లపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలన్నారు. సరైన పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఈ శిబిరంలో గర్భిణీ స్త్రీలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయికుమార్, కౌన్సిలర్లు సుధీర్, ఆఫ్రిన్, మెడికల్ ఆఫీసర్ సాయి దీప్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# పది రోజుల్లో కొనుగోలు ప్రక్రియను పూర్తి చేస్తాం

- ప్రతి గింజను కొనుగోలు చేస్తాం
- రైతులు అధైర్య పడొద్దు
- 10 కేంద్రాల్లో కొనుగోలు పూర్తి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**నర్సాపూర్, మే 25 (జనం సాక్షి) :** రైతులు అధైర్య పడద్దని , ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. సోమవారం నర్సాపూర్ మున్సిపాలిటీలోని సాయి కృష్ణ రైస్ మిల్ ను , నర్సాపూర్ లో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డి ఎం సి ఎస్ జగదీష్ ,డి ఎస్ ఓ నిత్యానంద్ తాహాసిల్దార్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లను వచ్చే 10 రోజుల్లో పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యచరణ రూపొందించామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలు



విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, కొనుగోలు సంస్థలు, రైస్ మిల్లర్లు, రవాణా విభాగాలు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రైతులకు వెంటవెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తూ, లోడింగ్,అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైన టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైతే అదనపు కేటాయింపులు కూడా చేపడుతున్నామని తెలిపారు. ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించడం, లారీలు, ఇతర రవాణా వాహనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచడం, రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది రైస్ మిల్ యజమాని సురేష్ యాదవ్ పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లలో కాంగ్రెస్ సర్కార్ ఘోర వైఫల్యం

- రోహిణీ కార్తె వచ్చినా కల్లాల్లోనే మగ్గుతున్న ధాన్యం
- హరీశ్ రావు, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే

**నంగునూరు, మే 25 (జనం సాక్షి) :** కేసీఆర్ కృషితో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం వల్లే నర్మెటలో భూమికి బరువయ్యేంత పంట పండింది. బ్రహ్మంగారి కాలజ్ఞానంలో కూడా చెప్పని విధంగా ఎండాకాలంలోనూ చెరువులు మత్తడి దూకితే జల హారతులు ఇచ్చి, కాళేశ్వరం జల భోజనాలు చేసుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని బీఆర్ఎస్ పార్టీ శాసన సభా పక్ష ఉప నేత, మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో జరిగిన పెద్దమ్మ, పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు గారు హాజరయ్యారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన ఆయన నేరుగా ఈ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దేవాలయంలో రేకుల కోసం రూ. 2.25 లక్షలు, 1400 చదరపు అడుగుల గ్రానైట్ పంపించానని తెలిపారు. కమ్యూనిటీ హాల్, రెండు వరుసల రహదారి, ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, బ్యాంకు, రామాలయం, గ్రామ పంచాయతీ భవనం, కంప్యూటర్లతో కూడిన పాఠశాల భవనం, ఆరోగ్య ఉప కేంద్రం, దేశంలో ఎక్కడా లేని విధంగా గొర్రెల హాస్టల్ నిర్మించి నర్మెటను ఆదర్శ గ్రామంగా మార్చినట్లు తెలిపారు. కాళేశ్వరం నీళ్లతో రైతులు అద్భుతంగా పంటలు పండిస్తే.. ఆ పంటను కొనడంలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రోహిణీ కార్తె వచ్చినా ఇంకా వడ్లు కల్లాల్లోనే ఉంటున్నాయని వాపోయారు. వడ్లలో తేమ 10 శాతం మాత్రమే ఉన్నప్పటికీ బియ్యపు మిల్లుల యజమానులు కొర్రీలు పెడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. బస్తాకు 2 కిలోలు ఎక్కువ అడుగుతూ



రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. ఏ-గ్రేడ్ వడ్లను బీ-గ్రేడ్ కింద కొంటూ ఎకరాకు రూ. 600 నుంచి రూ. 700 వరకు రైతులు నష్టపోయేలా చేస్తున్నారని చెప్పారు. కొత్తగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కు రూ.అయిదు వేలను రూ. 10 వేలకు పెంచి కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తోందని విమర్శించారు. " కేంద్ర ప్రభుత్వం యూరియా, డీఏపీ తదితర ఎరువుల ధరలు పెంచుతూ రైతులపై భారం మోపుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువులు సరిగ్గా ఇవ్వక రైతులు క్యూలో నిలబడి ఇబ్బందులు పడుతున్నారు. రైతుబంధు కూడా ఇంతవరకు సరిగ్గా వేయలేదు" అని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో మత్స్యకారులకు వలలు, వాహనాలు ఇచ్చి, ఏటా క్రమం తప్పకుండా ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేశాం. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా చెరువుల్లో చేప పిల్లలు వ మత్స్యకారుల పొట్టకొడుతోంది" అని విమర్శించారు.రైతులను ఇబ్బంది పెట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని, రైతుల పంటలన్నీ కొనుగోలు చేసి, రైతుబంధు వేసేలా పాలకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పెద్దమ్మ తల్లిని ప్రార్థిస్తున్నాను. అమ్మవారి దయతో మళ్లీ అందరికి మంచి రోజులు వస్తాయని కోరుకుంటున్నాను"అని పేర్కొన్నారు.

# సమతుల పోషకాహారంతోనే ఆరోగ్యం

- చిరుధాన్యాలను ఆహారంలో ఎక్కువగా వినియోగించాలి
- పిలుపునిచ్చిన అదనపు కలెక్టర్ నర్సింగరావు
- ఘనంగా మహిళా వారోత్సవాలు ప్రారంభం

**గద్వాల నడిగడ్డ, మే 25 (జనం సాక్షి) :** ప్రతి ఒక్కరూ సమతుల పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని, ఆహారంలో చిరుధాన్యాలను ఎక్కువగా వినియోగించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో సోమవారం న్యూట్రిషన్ గురించి ఐడిఓసి సమావేశపు మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలను, ఎక్కువ కొవ్వు, చక్కెర, ఉప్పు, నూనెలు ఉండే ఆహారాన్ని తగ్గించాలన్నారు. రోజు తగినంత నీరు తాగాలని, కృత్రిమ శీతల పానీయాలను తీసుకోవడం సరికాదని మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ఆరోగ్యకరమైన పానీయాలను తీసుకోవాలన్నారు. శరీరానికి ఎండ తగిలితే అవసరమైనంత విటమిన్ డీ లభిస్తుందన్నారు. రోజుకు 8 గంటల నిద్ర అవసరమని, మొబైల్, టీవీలను చూడడం తగ్గించాలన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు యోగ, వ్యాయామం, క్రీడలు కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద, పలువురు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**గద్వాల నడిగడ్డ, మే 25 (జనం సాక్షి) :** జిల్లా ప్రజలకు తాగునీటిని అందిస్తూనే పారిశుద్ధ్యంపై కూడా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో డిస్టిక్ వాటర్ శానిటేషన్ మిషన్ పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ జల జీవన్ మిషన్ ప్రకారం ప్రతి కుటుంబానికి అవసరమైనన్ని నీటిని సరఫరా చేయాలని, జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలతోపాటు మునిసిపాలిటీలలోని గృహ అవసరాలకేకాక, విద్యాసంస్థలు, వైద్యశాలలు వంటి ప్రభుత్వ విభాగాలకు కూడా నల్ల కనెక్షన్లు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఎక్కడైనా ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తారన్నారు. స్వచ్ఛభారత్ మిషన్లో భాగంగా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలకు కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలలో మురుగు వ్యవస్థ నిర్వహణకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రెడ్డి, డి డబ్ల్యు ఓ సునంద, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 25 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరిం చాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత ప్రజా వాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 35 ఫిర్యాదు లు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,లకు విన్న విస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పు డు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదే శించారు.ఈ కార్యక్ర మంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల దోపిడీని నియంత్రించే చర్యలు చేపట్టాలి

**గద్వాల నడిగడ్డ, మే 25 (జనం సాక్షి) :** ప్రైవేటు స్కూల్ యజమానులు వసూలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని సోమవారము ప్రజావాణిలో అసిస్టెంట్ కలెక్టర్ మధుమోహన్‌కు బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు, జోగులాంబ గద్వాల జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రవేట్ స్కూల్లో ఫీజుల పట్టికను బహిరంగంగా నోటీసు బోర్డులో పెట్టాలనీ,అకాడమీక్ ఇయర్ ప్రారంభం కాకముందే ఊర్లలో కాన్వాసింగ్,బుక్కుల అమ్మకాలు,టైం బెల్ట్ ల అమ్మకాలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలనీ,ఇండ్ల ఆకారంలో, లాడ్జిల్లా ఆకారంలో, కొట్టాల ఆకారంలో, రేకుల గుడిసె ల ఆకారంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలనీ,జిల్లాలో చాలా కాలం నుండి సదుపాయాలు లేకుండా నాణ్యమైన విద్యను అందించకుండా వేలలలో, లక్షలలో అధిక ఫీజులు వసూలు చేసుకుంటూ కేవలం విద్యను వ్యాపారం చేసుకుంటున్నా స్కూల్నకు పర్మిషన్లు రద్దు చేయాలనీ, జిల్లాలో ఎక్కువ శాతం ప్రైవేటు స్కూల్స్ ఇండ్లలో, లాడ్జ ఆకారంలో, కొట్టాల ఆకారంలో స్కూల్స్‌లను నడుపుతున్నారనీ, వాటితో సొమ్ము చేసుకుంటున్నారనీ, అందులో ఏ ఒక్క సౌకర్యం కూడా కల్పించడం లేదనీ, పాఠశాలలలో ప్రేయర్ చేయించడానికి స్థలం కూడా లేదు ప్రహరీ గోడలు లేవు బాత్రూమ్స్ లేవు తరగతి గదులు లేవు, అట స్థలాలు లేవనీ,ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తక్కువ జీతాల కోసం ఎలిమెంటరీ ఎడ్యుకేషన్లో టెట్, బి.ఎడ్‌లో టెట్ అర్హత కలిగిన వారిని నియమించకుండా నాసిరకంతో చదువులు చెప్పిస్తున్నారనీ, జిల్లాలో అంతర్జాతీయ, జాతీయ లెవల్లో పేర్లు పెట్టి పేద తల్లిదండ్రులను మోసం చేస్తూ లక్షలలో ఫీజులు వసూలు చేయడానికి మాత్రమే స్కూల్ పేర్లను అందంగా చూపిస్తున్నారనీ,పేదల రక్తాన్ని జలగ లాగా పీల్చుకా తింటున్నారనీ, అదేవిధంగా అకాడమీ క్లియర్ ప్రారంభమైంది అంటే చాలు బుక్స్ పేరుతో దోపిడీ టైం బెల్టు డ్రెస్ పేర్లతో దోపిడీ బస్సుల పేర్లతో దోపిడి దోపిడి మీద దోపిడీ చేస్తున్న ప్రైవేటు స్కూల్ యొక్క ఆగడాలను కచ్చితంగా కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రవేటు పాఠశాలలో 25% బడుగు బలహీన వర్గాలకు సీట్లు కేటాయించాలి దాన్ని



తుంగలో తొక్కుతున్నారనీ, ఆ చట్టం ప్రకారం నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలి కానీ అంతకు మించి వేలలో లక్షలలో వసూలు చేస్తున్నారనీ, చర్యలు తీసుకోలేని పక్షంలో బిఆర్ఎస్వి పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ము రంగస్వామి, నరసింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు ఉద్యమకారులకు మధ్య వాగ్వివాదం

- నువ్వెంత అంటే నువ్వెంత అంటూ తోపులాట
- వరంగల్ కలెక్టరేట్ వద్ద గందరగోళ వాతావరణం



**వరంగల్ బ్యూరో, మే 25 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఇటు తెలంగాణ ఉద్యమకారులకు అటు పోలీసులకు మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ ఉద్యమకారులంతా కలిసి సోమవారం గ్రీవెన్స్ లో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం కు వచ్చి కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వాలని అందరూ గుమి కూడడంతోపటు నినాదాలు చేస్తున్న సందర్భంలో సుబేదారి పోలీస్ స్టేషన్ చెందిన మహిళా పోలీసులు ఇక్కడ ఇంతమంది ఉండకుండా పక్కకు వెళ్లాలని, వచ్చి పోయే వారకి దారి ఇవ్వాలనీ, కొంతమంది వెళ్లి కలెక్టర్కు వినతిపత్రం ఇవ్వాలని కోరారు. అయినా కూడా వారు అక్కడినుంచి కదలలేదు కాగా వాగ్వివాదానికి దిగారు. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన సుబేదారి ఎస్సై సుమన్ తో పాటు మరికొంతమంది పోలీసులు ఉద్యమకారులకు ఇదే విషయాన్ని చెప్పారు. అయితే బిఆర్ఎస్ పార్టీ నాయకుడు నీలం రాజ్ కిషోర్ కు ఎస్సై సుమన్ కు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒక దశలో నువ్వు ఎంత అంటే నువ్వు ఎంత అంటూ తోపులాట జరిగింది. ఉద్యమకారులు సంయమనంతో ఉండాలని కొంతమందిని మాత్రమే కలెక్టర్ ను కలిసే విధంగా చూస్తామని ఎస్ఐ ఎంత చెప్పినా కూడా కొందరు ఉద్యమకారులు గొడవకు దిగి గందరగోళానికి పాల్పడడం కనిపించింది. తమ నాయకుడు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ వస్తున్నాడని ఆయన వచ్చేదాకా తాము ఇక్కడే ఇలాగే ఉంటాం అంటూ రాజ్ కిషోర్ వాదించాడు. ఈలోగా మాజీ ఎమ్మెల్యే నరేందర్ అక్కడికి వచ్చి ఉద్యమకారులను సముదాయించే ప్రయత్నం కూడా చేశారు. అనంతరం కొందరు వినతిపత్రం ఇవ్వడానికి కలెక్టర్ వద్దకు వెళ్లి వినతిపత్రం ఇచ్చి రావడం జరిగింది. ఉద్యమకారుల్లో కొంతమంది గులాబీ కండువాలు కప్పుకొని రావడం జరిగింది. అయితే వారు ఉద్యమకారులా లేక బిఆర్ఎస్ కార్యకర్తలా, బిఆర్ఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన ప్రదర్శనా అనే అనుమానం కలిగింది.

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి మే 25 (జనం సాక్షి) :** ప్రజావాణి అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ వివిధ శాఖ అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన వెంటనే సంబంధిత అధికారులను వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవిస్తూ ప్రజలు 248 అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ శ్రీనివాస్, ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, డిఆర్డీవో మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, జిల్లా అధికారులు, తహసిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, మే 25(జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 113 దరఖాస్తులు రాగా, వాటిలో ఇందిరమ్మ ఇళ్లకు 25, పెన్షన్లకు 51, ఇతర శాఖలకు సంబంధించినవి 37 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గతవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా కారణాలవల్ల క్రింది స్థాయి కార్యాలయాల్లో సమస్యను పరిష్కరించలేకపోతే, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ఫిర్యాదుదారునికి తెలియజేయాలని, పై స్థాయి కార్యాలయంలో ఏ అధికారికి, ఏ విధంగా తమ సమస్యను తెలియజేయాలో క్షుణ్ణంగా వివరించాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజావాణి దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉండకూడదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి. హెచ్. మహేందర్ జీ, సంపత్ రావు, అన్ని శాఖల జిల్లా అధికారులు, అన్ని మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కమలాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ!

- రాగి వైరు ఎత్తుకెళ్లిన దుండగులు... పోలీసులకు ఫిర్యాదు...



**మంగపేట, మే 25(జనంసాక్షి) :** మండలంలోని కమలాపురం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చోరీకి గురైన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆదివారం అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని దుండగులు ఈ చోరీకి పాల్పడ్డారు. కమలాపురం గ్రామ పరిధిలోని కవ్వాళకుంట ప్రాంతంలో రైతులు గంజి సాంబయ్య (లేట్), ఉడుగుల సాంబయ్యలకు చెందిన వ్యవసాయ పొలాలు ఉన్నాయి. వీరి పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌ను ఆదివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కిందకు పడేసి, ధ్వంసం చేశారు. అనంతరం అందులోని విలువైన రాగి (కాపర్) వైరును దొంగిలించుకొని పరారయ్యారు. సోమవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ట్రాన్స్ఫార్మర్ కింద పడి ఉండటాన్ని గమనించారు. దగ్గరికి వెళ్లి పరిశీలించగా, అందులోని రాగి వైరు చోరీకి గురైనట్లు గుర్తించి షాక్‌కు గురయ్యారు. ఈ విషయమై రైతులు వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి సంబంధిత అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యవసాయ సీజన్‌లో ట్రాన్స్ఫార్మర్ చోరీకి గురికావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు హేమ చలపతిరావు, కరెంటు మల్లయ్య, కుదురు మల్లేష్, భూక్య రాజు, గాజర్ల సంతోష్ లు పాల్గొన్నారు.

# పత్తి విత్తనాల నిందితుల అరెస్టు

- 30 కేజీల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నలుగురు కొనుగోలుదారులు, పరారీలో సూత్రధారి
- నిందితుల వివరాలను వెల్లడించిన బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్



**తాండూర్, మే 25(జనం సాక్షి) :** రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా (ఐపీఎస్) , మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్ ఐపీఎస్ గారి ఉత్తర్వుల మేరకు బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్,తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య ఆదేశాలతో తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రోజున నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొని నిందితులను అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందని బెల్లంపల్లి ఎసిపి కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం రోజున తాండూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు రెచిని గ్రామ శివారులో ఉన్న బ్రిడ్జి వద్ద బైక్ మీద రోళ్ళపాడు నుండి రెచినికి నకిలీ పత్తి విత్తనాలను తెచ్చి కొనుగోలుదారులకు ఇస్తున్నారు అన్న సమాచారం రావడంతో తాండూర్ ఎస్సై ప్రసాద్ మరియు కొండలే సుష్మ మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ తాండూర్ తన సిబ్బందితో కలిసి వెళ్లి రెచిని శివారులో తనిఖీ చేయగా బైక్ మీద సంచిలో తెస్తున్న నకిలీ పత్తి విత్తనాలు లభ్యమైనట్లు గుర్తించారు. దాదాపు 30 కేజీల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని రోళ్ళపాడు, రెచిని గ్రామాలకు చెందిన గోగర్ల మల్లేష్, ముక్క శ్రీకాంత్, గాండ్ల మహేష్, పిడుగు లక్ష్మణ్ వీటిని చీరాలకు చెందిన తిరుమలశెట్టి పొలాలను కౌలు చేసే మల్లేశ్ ద్వారా మోటార్ సైకిల్ మీద తీసుకొని వచి రెచిని గ్రామస్థులు కు ఇస్తుండగా పట్టుకున్న ట్లూ ఎసిపి వెల్లడించారు. నకిలీ పత్తి విత్తనాలు వాడటం వల్ల భూమి యొక్క సారవంతం కోల్పోయి రానున్న రోజుల్లో పంట యొక్క దిగుబడి తగ్గే అవకాశాలున్నాయని అదే విధంగా ఈ విత్తనాలు వాడటం వల్ల పర్యావరణం పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గ్లైపోసిట్ నకిలీ విత్తనాలు వాడటం వల్ల రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల రైతులు ప్రభుత్వం సరఫరా చేసే పత్తి విత్తనాలను వాడాలని అదేవిధంగా లైసెన్సు అనుమతి పొందిన ఫెర్టిలైజర్ దుకాణాల్లో మందులను తీసుకొని రసీదును తప్పకుండా తీసుకోవాలని అన్నారు. రైతులు దళారుల మాయమాటలు నమ్మి ఈ నకిలీ విత్తనాల బారి నుండి మోసపోకుండా ఉండాలని మా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కూడా అవగాహన కార్యక్రమాలను కూడా పెట్టడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లుగానే అమ్ముతున్నట్లుగాని సమాచారం తెలిస్తే తెలియజేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎసిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య, కొండలే సుష్మ మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ ఎస్సై ప్రసాద్ తో పాటు సిబ్బంది ఉన్నారు.

## నెల రోజులైనా కాంటాలు పెట్టే దిక్కులేదు

- గన్నీ బస్తాలు, లారీల కొరతతో రైతుల ఇబ్బందులు
- పెద్దవంగరలో బీఆర్ ఎస్ నేత ఐలయ్య ఆధ్వర్యంలో నిరసన



**పెద్దవంగర మే 25(జనం సాక్షి) :** అసమర్థ కాంగ్రెస్ పాలనలో నెలలు దాటినా..మార్కెట్ దాటని ధాన్యం కేంద్రాల్లోనే పేరుకుపోయిన వడ్లు అని కాంగ్రెస్ ప్రభుత్వంపైన ఘాటైన విమర్శలు చేసిన బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య సోమవారం మండలంలో పోచంపల్లి గ్రామంలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల వద్ద ఎర్రటి ఎండలో రైతులు ఆగమవుతున్నారు. ధాన్యం తీసుకొచ్చి నెల రోజులైనా కాంటాలు పెట్టే దిక్కులేదు. కాంటా పెట్టేందుకు గన్నీ బస్తాలు లేవు. తూకం వేసినా తరలించేందుకు లారీలు లేవు. తరుగు పేరట,ట్రాన్స్పోర్ట్ ఖర్చు పేరిట రైతును దోపిడీ చేస్తున్నారు. ఏ గ్రేడ్ లో పోవలసిన వడ్లు 20 రూపాయల తక్కువతో కామన్ గ్రేడ్ లో పంపుతున్నారని వాపోయారు. ఎర్రటి ఎండలో రైతులు కళ్ళల్లో ఇబ్బంది పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే ఏ ఒక్క సెంటరను సందర్శించక పోవడం విచారకరం అని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి శ్రీరాం సంజయ్,మండల ఉపాధ్యక్షుడు కనుకుంట్ల వెంకన్న,మండల నాయకులు శ్రీరాం సుధీర్, సర్పంచ్లు కుందూరు వెంకన్న, కాసాని హరీష్ యాదవ్, గూగులోతు పటేల్ నాయక్, మాజీ ఎంపీటీసీ సుదగాని రాంమూర్తి, ధరావత్ రాజేందర్, కుందూరు వెంకన్న, పసునూరి సోమిరెడ్డి, కూతురు అనుదీప్, కిషన్,తండల శోభన్, సోషల్ మీడియా నాయకులు శినిగరపు యాకంబ్రం,మైలపాక యాకయ్య, చిర్ర అయిలమల్లు, మైలపాక యకబిక్షం తదితరులు పాల్గొనారు.

## వడదెబ్బతో ముగ్గురు మృతి

**మృతులంతా రోజువారీ కూలీలే..**



**ఆత్మకూర్, మే 25 (జనం సాక్షి):** మండుతున్న ఎండలతోపాటు పడగాల్పుల దెబ్బకు గృహ నిర్మాణ కూలీ బోయిన రాజు (40) మృతి చెందాడు. సోమవారం ఆత్మకూరు ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకల పల్లి గ్రామానికి చెందిన నైనా బోయిన రాజు బ్రతుకుతెరువు కోసం కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 24న ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామంలో నిర్మాణం చేస్తున్న దేవాలయం లో కూలి పనికి వచ్చారని ఎస్సై తిరుపతి తెలిపారు. మండుతున్న ఎండలతోపాటు వడగాల్పులకు తట్టుకోలేక కింద పడిపోవడంతో స్థానికులు వెంటనే వరంగల్ ఎంజిఎం హాస్పిటల్ కి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

**మొగుళ్లపల్లి, మే 25 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం లోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన భోగి సాంబయ్య మే 21 గురువారం రోజున వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం భోగి సాంబయ్య ఉదయం రోజువారి కూలిగా పంట చేనులోకి వెళ్లి తిరిగి 11:30 సమయంలో ఇంటికి వచ్చాడు అప్పటికే అస్వస్థతకు గురైన సాంబయ్య చేతులు కాళ్లు వణుకుతూ ఇంటికి వచ్చి పడుకోగా వడగాల్పులకు గురైన అతను ఇంట్లో ఉన్న రేకుల షెడ్డు వేడి గాలికి మృతి చెందాడు. 12 సంవత్సరాల క్రితం మృతుడి భార్య చనిపోగా ఇప్పుడు సాంబయ్య మృతి కి ఇంటికి పెద్దదిక్కు లేకుండా పోయింది.మృతుడి కి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కరిని కుటుంబం మాది అంటూ కుటుంబ సభ్యులు అన్నారు. మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

**చిట్యాల, మే 25( జనం సాక్షి):** మండల కేంద్రంలోని నవాబుపేట గ్రామంలో ఎండల తీవ్రతకు వడదెబ్బ తగిలి ఒక వ్యక్తి మృతి చెందినట్లు చిట్యాల సబ్ ఇన్‌స్పెక్టర్ పోచంపల్లి సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మృతుడు వరంగల్ జిల్లా, ఖిలా వరంగల్ మండలం, బుధవారపేటకు చెందిన గుండ్రపల్లి సదయ్య (58) వృత్తిరీత్యా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమ వారం ఉదయం 5:00 గంటల ప్రాంతంలో నవాబ్‌పేట గ్రామంలోని సబ్–స్టేషన్ పని నిమిత్తం కాంట్రాక్టర్ వద్దకు వెళ్లేందుకు ఇల్లు వదిలి బయలుదేరారు. ఉదయం 11:00 గంటల సమయానికి నవాబ్‌పేటకు చేరుకున్న సదయ్య, పని ముగించుకుని తిరిగి వస్తుండగా తీవ్రమైన ఎండ కారణంగా వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయారు. వెంటనే అక్కడే ఉన్న స్థానికులు గమనించి 108 అంబులెన్స్ ద్వారా చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మధ్యాహ్నం మృతి చెందారు.ఈ విషయమై మృతుని తమ్ముడు గుండ్రపల్లి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్యాల ఎస్.ఐ. పోచంపల్లి సతీష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## గ్రామాల్లో పెరుగుతున్న మినరల్ వాటర్ ప్లాంట్లు

- నీటి వ్యాపారంగా మారిన తాగునీరు





**రామకృష్ణాపూర్, మే 25 (జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా పరిసర ప్రాంతాల్లో ఇటీవల మినరల్ వాటర్ ప్లాంట్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. శుద్ధమైన తాగునీరు పేరుతో గ్రామాలు, పట్టణాల్లో చిన్నా పెద్దా ప్లాంట్లు ఏర్పడి వ్యాపారంగా మారాయి. వేసవి కాలం ప్రారంభమైన తర్వాత డిమాండ్ పెరగడంతో అనేక మంది యువకులు, వ్యాపారులు ఈ రంగంలోకి అడుగుపెడుతున్నారు. ప్రతి రోజు వేల లీటర్ల భూగర్భ జలాలను వినియోగిస్తూ ప్లాంట్లు నడుస్తుండటంతో భూగర్భ జలాల మట్టాలు పడిపోతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో సరైన అనుమతులు లేకుండానే ప్లాంట్లు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటి నాణ్యత పరీక్షలు, శుభ్రత ప్రమాణాలు పాటించకుండా సరఫరా చేస్తున్న ప్లాంట్లు కూడా ఉన్నాయని వినియోగదారులు చెబుతున్నారు. ఇటీవల ఇంటింటికీ క్యాన్‌ల ద్వారా నీటి సరఫరా విస్తరించడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా మినరల్ వాటర్ వినియోగం పెరిగింది. ఒకప్పుడు బావులు, పంచాయతీ నీటిపైనే ఆధారపడిన ప్రజలు ఇప్పుడు తాగునీటికి డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 20 లీటర్ల క్యాన్‌కు రూ. 20నుంచి రూ. 50 వరకు వసూలు చేస్తున్నారు. అయితే నాణ్యమైన నీరు అందిస్తున్న ప్లాంట్ల వల్ల ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ కలుగుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. వేసవిలో కలుషిత నీటి కారణంగా వచ్చే వ్యాధులను నివారిం చడంలో మినరల్ వాటర్ ఉపయోగపడుతోందని చెబుతున్నారు. మరోవైపు అధికారు లు మాత్రం అన్ని ప్లాంట్లు ప్రభుత్వ నిబం ధనలు పాటించేలా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. నీటి నాణ్యతపై తరచూ పరీక్షలు నిర్వహించి, అనుమతులు లేని ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ ఎండీ మునీర్ మొదటి వర్ధంతి



**రామకృష్ణాపూర్, మే 25(జనంసాక్షి):** మందమర్రి పట్టణ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ ఎండి మునీర్ మొదటి వర్ధంతిని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న పాత్రికేయులు మాట్లాడుతూ ఎండి మునీ ర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని లక్ష్యంతో వర్ధంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి టిఆర్ఎస్ పట్టణ నాయకులు ఎండి అబ్బాస్, ప్రెస్ క్లబ్ పాత్రికేయులు బొడ్డు మల్లేష్, గాండ్ల సంజీవ్, గజ్జల రామచందర్, సకినాల శంకర్, ఉప్పులేటి నరేష్, శెట్టిపల్లి విజయ్, విత్తనాల శ్రీనివాస్, కదారి శ్రీధర్, పూర్ణ రాజ్ కుమార్, అనిల్ భగత్, సంతోష్, సారంగం తదితరులు పాల్గొన్నారు



## ఆహార పదార్థాల స్టాల్స్ పరిశీలించిన కలెక్టర్


**వరంగల్ ఈస్ట్, మే 25 (జనం సాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఐసిడిఎస్, మెప్మా , సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల ఆహార పదార్థాల స్టాల్స్ ను వరంగల్ కలెక్టర్ సత్య శారద, డిఆర్ఓ విజయలక్ష్మి సిడిపిఓలు విద్య, డెబోరా, డిపిఆర్ఓ ప్రేమలత, రమాదేవి మొదలైన వారు పరిశీలించారు. మహిళలు ప్రధానంగా న్యూట్రిషన్ ఫుడ్ తయారు చేశారు. రాగి జావా, జొన్న కడక, అంబలి, మునగకుతో సర్వపిండి, బెల్లంతో తయారుచేసిన పదార్థాలు మొదలైనవి ప్రదర్శనగా పెట్టారు. ఎంతో రుచికరంగాఆరోగ్యదయకమైనటువంటి ఈ పదార్థాలను అక్కడికి వచ్చిన వారందరూ రుచి చూడడం కనిపించింది.

## కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేసిన గౌస్ ఖాన్



**వరంగల్ ఈస్ట్, మే 25 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదను, ఖిలా వరంగల్ మండల ఎమ్మార్వో ఇక్బాల్ సమక్షంలో కలిసి బక్రీద్ సందర్భంగా కొమురయ్య చిన్నమ్మ పటేల్ రెసిడెన్షియల్ కాలనీ వాసులు ముఖచిత్ర జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కాలనీవాసులందరికీ బక్రీద్ ముందస్తు శుభాకాంక్షలు తెలిపి వీరి జీవితాల్లో వెలుగు నిండాలని చెప్పి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌసర్, సామ్రాన్, నాశ్రీన్, షోయబ్ ఖాన్, షారుక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని హెడ్ కానిస్టేబుల్ మృతి



**రెబ్బెన, మే 25(జనం సాక్షి):** విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఘటన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో చోటుచేసుకుంది. రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న జాడి బాబురావు సోమవారం తక్కల్లపల్లి చెక్‌పోస్టులో విధులు ముగించుకొని బైక్‌పై ఆసిఫాబాద్‌కు బయలుదేరారు. పులికుంట సమీపానికి చేరుకున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన వేగవంతమైన కారు ఆయన బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో బాబురావు అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
26 మే 2026

# అహంకారంగా వ్యవహరిస్తే అధికారం దింపడం ఖాయం

- పెన్షన్‌ల కోసం పోటెత్తిన లబ్దిదారులు
- సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహాధర్నా




**ఖమ్మం కార్పొరేషన్, మే 25 (జనంసాక్షి) :** అర్హులైన కొత్త లబ్ధి దారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం నూతన పెన్షన్ లు ఇవ్వాలని, పెన్షన్ ను 2016 రూపాయలు నుంచి 4016 రూపాయలు పెంచి ఇవ్వాలని, ఖమ్మం నగరంలో పెంచిన ఆస్తి పన్నులు వెంటనే తగ్గించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు. కొత్త లబ్ధి దారులకు కొత్త పెన్షన్ లు ఇవ్వాలని, ఎన్నికల హామీలు అమలుపరచాలని, ఖమ్మం నగర ప్రజలపై వేసిన ఇంటి టాక్స్ లు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జూవీ పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది అర్హులు తమకు కొత్త పెన్షన్ లు ఇవ్వాలని కోరుతూ ధర్నా కు హాజరుఅయ్యారు ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ అధ్యక్షతన జరిగిన ధర్నాను ఉద్దేశించి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా అధికారానికి దూరంగా వుండి, ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆచరణలో మాత్రం ప్రజల పట్ల గత ప్రభుత్వ ఎలా వ్యవహరించిందో ఈ ప్రభుత్వం కూడా ప్రజల పట్ల అలాగే వుంటుంది అని, ఇలా ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఈ ప్రభుత్వాన్ని కూడా అధికారం దింపడం ఖాయం అని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అహంకారంగా వుండి ప్రజా సంక్షేమం పట్ల ఉదాసీనత గా వుంటే తెలంగాణ ప్రజలు అధికారం దింపడం ఖాయం అని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు ఫలితంగా సగటు మనిషి జీవితం రోజు రోజుకు ఆర్థిక దిగ్బంధం లోకి వెళ్లి అప్పులు పాలు అవుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రోజూ పెట్రోల్ డీజిల్, గ్యాస్ ధరలు మోడీ భవితవ్యం పెంచుతుంది అని విమర్శించారు. ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ 2000 రూపాయలు నుంచి 4000 రూపాయలు పెంచాలని డిమాండ్ చేశారు. 57 సంవత్సరాలు నిండిన వారికి నూతన పెన్షన్ లు ఇస్తామని ఇచ్చిన హామీ వెంటనే అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఎక్కడ లేని విధంగా ఖమ్మం నగర ప్రజలపై ఇంటి పన్నులు భారాలు వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటు సంస్థకు ఇచ్చి అడ్డగోలుగా ఇంటి టాక్స్ లు వేశారు అని దుయ్యబట్టారు. ఇంటి టాక్స్ లు తగ్గించకపోతే దశల వారీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పింఛన్లు వెరిఫికేషన్ పేరుతో అర్హత వున్న తొలగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఒకేసారి ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలో అనేక ప్రజా సమస్యలపై జిల్లా మంత్రి, కమిషనర్ దృష్టి సారించాలి అని సరళ డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాస రావు, మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు ఎం ఎ జబ్బార్, మీరా సాహెబ్, దొంగల తిరుపతిరావు, ఎస్.నవీన్ రెడ్డి, బండారు రమేష్, ఎస్. కె. నాగుల మీరా, బోడపట్ల సుదర్శన్, ఉపేందర్, వజేనేపల్లి శ్రీనువాసురావు, పి నాగసులోచన, మాజీ కార్పొరేటర్లు ఎల్లంపల్లి వెంకట్రావు, యర్రాగోపీ, నాయకులు ప్రవీణ్ , మధు తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ విహార్ సమీపంలో జింకల పార్క్‌లో అగ్నిప్రమాదం




**నాగార్జునసాగర్, మే 25 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని విజయ విహార్ సమీపంలో జింకల పార్క్ వద్ద సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తులు పెట్టిన మంటలు ఒక్కసారిగా చెట్లకు అంటుకుని వేగంగా వ్యాపించాయి. టూరిజం అధికారులు అప్రమత్తమై వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హోటల్కా విజయ్టే విహార్‌కి తప్పిన ప్రమాదం రూమ్ లకు మంటలు వ్యాపించకుండా సిబ్బంది మంటలను అర్పారు. నాలుగు ఎకరాలలో పార్క్ కాలిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది సకాలంలో మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు.

## చోరీ కేసులో నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా

**చింతకాని, మే 25 (జనం సాక్షి) :** వదనం గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్ రావు కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఏడాది జనవరి 15న తిరుపతి దర్శనానికి వెళ్లి, 20వ తేదీన ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నట్లు గమనించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న బంగారు, వెండి వస్తువులు, కొంత నగదు, టీవీ కనిపించకపోవడంతో చింతకాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, దొంగతనానికి పాల్పడిన కాకరకాయల నరేష్ (వదనం, కందుకూరి), సోమాచారి (సత్తుపల్లి)లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన వస్తువులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో సరైన సాక్ష్యాలను సేకరించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, మూడో అదనపు జేఎఫ్ సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ఏ. ప్రవీణ్ నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించారు. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీ. రాహుల్, విచారణ అధికారి ఎస్సై వీరేందర్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ విజయ్ కుమార్‌లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. నేరం చేసిన నిందితులు చట్టం నుంచి తప్పించుకోలేరని, దొంగతనాలకు పాల్పడితే కచ్చితంగా శిక్ష పడుతుందని ఎస్సై ఎన్. వీరేందర్ తెలిపారు.

## ప్రజల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**నల్లగొండ ప్రతినిధి, మే 25 (జనం సాక్షి) :** ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 30 మంది బాధితులు తమ సమస్యలు, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, సివిల్ మరియు క్రిమినల్ అంశాలకు సంబంధించిన పిర్యాదులను ఎస్పీకి వినిపించారు. ప్రతి ఫిర్యాదును ఓర్పుతో విన్న ఎస్పీ బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, బాధితులకు వేగవంతమైన పరిష్కారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం పెరగాలంటే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పారదర్శకంగా విచారణ జరపాలని అన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లకు వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను సానుభూతితో వినాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి ఫిర్యాదును చట్ట పరిధిలో సమగ్రంగా విచారించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

## గంజాయి నిర్మూలనే లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్' తనిఖీలు



**చిలుకూరు, మే 25 (జనంసాక్షి) :** జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది ఈ రోజు చిలుకూరు మండల కేంద్రంలో ఎస్ఐ హనుమా నాయక్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్ఐ హనుమా నాయక్ మాట్లాడుతూ గాంజా లాంటి మాదకద్రవ్యాల నిర్మూలన, గుర్తింపు లక్ష్యంగా నార్కోటిక్ డాగ్ రోలెక్స్ తో మండల కేంద్రంలో హోటల్స్, టీ దుకాణాలు, మెడికల్ దుకాణాలు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించామని అన్నారు. ప్రస్తుత సమాజంలో గాంజాయి లాంటి మాదకద్రవ్యం మన యువతని సమాజాన్ని పట్టిపీడిస్తుందని దీనిని తరిమికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని అన్నారు. ఎవరైనా గంజాయి ఉపయోగించేవారు ఉన్నా, సరఫరా చేసేవారు ఉన్నా, అలాంటి వారి సమాచారం పోలీసు వారికి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం



**ఫరూక్‌నగర్, మే 25 (జనంసాక్షి) :** షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కో-ఆప్షన్ ఎన్నికల్లో నలుగురు కో-ఆప్షన్ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా ఎంపిక చేసి సోమవారం నాడు మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి అధ్యక్షతన ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మరియు ఇతర కౌన్సిలర్లు ఏకాభిప్రాయంగా వీరిని ఎన్నుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కో-ఆప్షన్ సభ్యులకు సన్మానించి, వారికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా నూతన కోఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు అనంతరం వారు కూడా ముఖ్య అతిథులను సన్మానించారు. కాంగ్రెస్ యువజన నాయకుడు సయ్యద్ ఖదీర్, సీనియర్ నాయకులు వావిలాల, సుజీవన్ మాజీ కౌన్సిలర్ పులిమామిడి శ్రీలత శ్రీశైలం గౌడ్ ఉషారాణి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ వారిని కో ఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. భవిష్యత్తులో మిగత వారికి సమయానుకూలంగా పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ ఛైర్మన్ అంధే మోహన్ ముదిరాజ్, కమిషనర్ సునీత రెడ్డి, కౌన్సిలర్ లు, కో ఆప్షన్ సభ్యులు ఉన్నారు. పలువురు కౌన్సిలర్లు నూతన సభ్యులను సన్మానించారు.

## మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి, కరస్పాండెంట్ మే 25 (జనం సాక్షి) :** మహిళలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవరుచుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సముదాయంలో నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల్లో భాగంగా తొలి రోజు నిర్వహించిన ఫుడ్ మేళాను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల ఆరోగ్యం, భద్రత మరియు పోషకాహారంపై పలు సూచనలు చేశారు. అనంతరం మహిళా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. మేళాలో తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు అందించేలా మహిళలు తయారు చేసిన వంటకాలను పరిశీలించి, వాటి తయారీ విధానం మరియు పోషక విలువల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం భువనగిరి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎనీమియా మరియు స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. ఈ పరీక్షలకు 25 మంది గర్భిణీలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహరావు, డీఆర్ఓ జయమ్మ, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి, జిల్లా వైద్యాధికారి మనోహర్, సీడీపీవోలు వెంకటరమణ, శైలజ, స్వరాజ్యం, యామిని, మహిళా సాధికారత బృందం, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు మరియు సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వృక్షాలు అగ్నికి ఆహుతి

- ప్రధాన రహదారికి ఇరువైపుల చెట్లకు నిర్లక్ష్యంగా నిప్పు
- తృటిలో తప్పుతున్న భారీ ప్రమాదాలు
- గంటల తరబడి స్తంభించిపోతున్న ట్రాఫిక్



**టేకులపల్లి, మే 25 (జనంసాక్షి) :** దశాబ్దాల నాటి భారీ వృక్షాలు హైవే రోడ్డు కిరువైపులా చల్లదనాన్ని ఇచ్చే వృక్షాలు కొందరి నిర్లక్ష్యానికి కారణంగా అగ్నికి ఆహుతై పోవడమే కాకుండా, నిత్యం వేలాది వాహనాలు తిరుగుతూ చెట్లు కోలడంతో భారీ ప్రమాదాలను తృటిలో తప్పించుకొని బిక్కు బిక్కు మంటూ ప్రాణాలు అరిచేతుల పెట్టుకుంటున్నారు. చేనులోని చెత్తను, వ్యర్థాలను రైతులు కాల్చే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. ఇల్లందు, కొత్తగూడెం ప్రధాన రహదారిలో టేకులపల్లి మండలం పొడవునా దశాబ్దాల నాటి భారీ వృక్షాలతో పాటు, కెసిఆర్ ప్రభుత్వంలో నాటిన చెట్లు సైతం అగ్నికి ఆహుతయుతున్నాయి. ఈ క్రమంలో మండలంలోని సులానగర్ సమీపాన సోమవారం ఉదయం నిప్పుతో మొదల్లో కాలి ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో అదే సమయంలో భారీగా వాహన రాకపోకలు జరుగుతున్నాయి. ఓ కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ప్రమాదం నుండి తృటిలో తప్పించుకున్నారు. దీంతో గంటసేపు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. సులానగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో స్థానిక కొంతమంది యువకులతో చెట్టును తొలగింపజేసి అడ్డు తొలగించారు. మరో మూడు గంటల తర్వాత మరొక కిలోమీటర్ సమీపంలో సీతారాంపురం స్టేజి సమీపాన మరో చెట్టు నిప్పు అంటుకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రైతులకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైతే కేసులు కూడా నమోదు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## స్థల వివాదం వేధింపులతో రైతు ఆత్మహత్య

- కేసు నమోదు



**హాలియా, మే 25 (జనం సాక్షి) :** స్థల వివాదం నేపథ్యంలో జరిగిన గొడవలు, బెదిరింపుల కారణంగా మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి విషపదార్థం సేవించి మృతి చెందిన ఘటన హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కేతపల్లి ఈదమ్మ ఆదివారం హాలియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె భర్త కేతపల్లి రవి, అదే గ్రామానికి చెందిన బూడిద యేశయ్య కుటుంబ సభ్యుల మధ్య గత కొంతకాలంగా స్థల వివాదం కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ నెల 3వ తేదీ రాత్రి బూడిద యేశయ్య, అతని కుమారుడు నవీన్, తమ్ముడు అన్నమయ్య కలిసి తమ ఇంటి వద్దకు వచ్చి గొడవకు దిగినట్లు ఆరోపించింది. ఈ సందర్భంగా రవిపై దాడి చేసి, దూషించి, చంపేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన కేతపల్లి రవి విషపదార్థం సేవించగా.. కుటుంబ సభ్యులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఈ నెల 24వ తేదీన రవి మృతి చెందినట్లు తెలిపింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు.

## రైస్ మిల్లుల వద్ద లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**భూదాన్ పోచంపల్లి, మే 25 (జనం సాక్షి) :** రైస్ మిల్లుల వద్ద ధాన్యం లోడ్‌తో వచ్చిన లారీలను వెంటనే అన్లోడ్ చేసి పంపించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. సోమవారం భూదాన్ పోచంపల్లి మండలంలోని పెద్ద రావులపల్లి సోమేశ్వర రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. లారీలు వచ్చిన రోజే అన్లోడ్ చేసి పంపించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా మిల్లుల వద్ద సరిపడా హమాలీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి రోజారాణి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్‌పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మే 25 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి 54 దరఖాస్తులు, డిఆర్డిఏకు 7, డీపీఓకు 5, ల్యాండ్ రికార్డ్స్ కు 4, డిడబ్ల్యుఓకు 3, మిగిలిన 19 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 92 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, హౌసింగ్ పీడీ సిద్దార్థ్, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విపణి

# రాణించిన సూచీలు



## ఆర్థిక రంగంలో అత్యధిక లాభం ఎల్ఐసీదే!

### జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.23,400 కోట్లు

**న్యూఢిల్లీ:**దేశీయ ఆర్థిక రంగంలో అత్యధిక లాభాన్ని నమోదు చేసిన సంస్థగా ప్రభుత్వ రంగ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరి-మార్చి)లో ఎల్ఐసీ రూ.23,400 కోట్లకు పైగా నికర లాభాన్ని ప్రకటించింది. తదుపరి స్థానంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిలిచింది. జనవరి-మార్చి త్రైమాసికంలో ఎస్‌బీఐ రూ.19,684 కోట్ల నికర లాభం ప్రకటించింది. దీని తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.19,221 కోట్ల నికర లాభంతో మూడో స్థానంలో ఉంది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఎస్‌బీఐ రూ.80,032 కోట్ల నికర లాభం ఆర్జించి అగ్ర స్థానంలో ఉంది. దీని తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.74,760 కోట్ల నికర లాభంతో రెండో స్థానం దక్కించుకుంది. ఎల్ఐసీ రూ.57,419 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఐసీఐసీఐ బ్యాంక్ రూ.50,147 కోట్లు ఆర్జించింది.ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.11,378 కోట్ల నికర లాభంతో తొలిస్థానంలో ఉంది. కోల్ ఇండియా రూ.10,839 కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) రూ.8,598 కోట్లు, ఎన్‌టీపీసీ రూ.8,747 కోట్ల నికర లాభంతో తరవాత స్థానాల్లో ఉన్నాయి.కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో (సీపీఎస్ఈలు) పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) రూ.4,546 కోట్లు, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ (ఆర్ఈసీ) రూ.3,375 కోట్లు, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) రూ.1,680 కోట్లు నికర లాభాలతో తొలి 3 స్థానాల్లో ఉన్నాయి.మొత్తం కార్పొరేట్ రంగంలో వొడాఫోన్ ఐడియా అత్యధిక నికర లాభాన్ని నమోదు చేసిన సంస్థగా నిలిచింది. 2025-26 జనవరి-మార్చి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో రూ.51,970 కోట్ల నికర లాభాన్ని సంస్థ ప్రకటించింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాల (ఏజీఆర్) బకాయిల విషయంలో ప్రభుత్వం ఊరటనివ్వడంతో వొడాఫోన్ ఐడియా ఆరేళ్ల తర్వాత నికర లాభాన్ని ఆర్జించింది.

## సెన్సెక్స్ 1,073 పాయింట్లు పైకి




**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ట్రేడయ్యా యి పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు తొలగిపో తాయనే అంచనాల మధ్య సూచీలు లాభాల్లో కదలాడాయి. దాంతో సెన్సెక్స్ 1100 పాయింట్లు వరకు పెరిగింది. సెన్సెక్స్ నేటి ట్రేడింగ్‌లో 76,135 వద్ద మొదలైంది. చివరకు 1,073 పాయింట్ల లాభంతో 76,488 వద్ద ముగిసింది. నిఫ్టీ 312 పాయింట్లు ఎగబాకి, 24వేల పైన స్థిరపడింది. నిఫ్టీ సూచీలో ఐషర్ మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బజాజ్ ఫైనాన్స్, టీఎంపీవీ, లార్సెన్ షేర్లు రాణించాయి. మ్యాక్స్ హెల్త్‌కేర్, ఓఎన్‌జీసీ, హిందాల్కో, నెస్లే, బజాజ్ ఆటో స్టాక్స్ నష్టపోయాయి. యుద్ధం ముగించే విషయమై అమెరికా - ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఓ కొలిక్కి వస్తున్నాయనే వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కాస్త దిగొచ్చాయి. ఒక బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 5.58 శాతం తగ్గి, 97.76 డాలర్లకు వచ్చింది. చమురు ధరలు తగ్గడంతో బ్యాంక్ షేర్లు పెరిగాయి. ఆయిల్ ధరల తగ్గుదల కారణంగా ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని, వడ్డీ రేట్లలో స్థిరత్వం వస్తుందని మదుపర్లు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు నేటి లాభాలకు ఓ కారణం. అమెరికా-భారత్ మధ్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వర లోనే ఖరారవుతుందని ఆశిస్తున్నామని మార్కో రూబియో వెల్లడించడం మరో కారణం. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 35 పైసలు మేర కోలుకుంది. ప్రస్తుతం 95.25 వద్ద స్థిరపడింది.

**తగ్గిన యుద్ధ భయాలు..**

దేశీయ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ప్రారంభమయ్యాయి యుద్ధం ముగించే విషయమై అమెరికా - ఇరాన్ మధ్య శాంతి చర్చలు ఓ కొలిక్కి వస్తు న్నాయనే వార్తలు, ముడి చమురు ధరలు కాస్త దిగి రావడంతో మన సూచీలు సానుకూలంగా కదలా డుతున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 900 పాయింట్ల వరకు లాభపడింది. ఉదయం 9.28 గంటలకు సెన్సెక్స్ 862 పాయింట్లు ఎగబాకి, 76,282 వద్ద ట్రేడ వుతోంది. నిఫ్టీ 261 పాయింట్ల లాభంతో 23,980 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో ఐషర్ మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. హిందాల్కో, ఓఎన్‌జీసీ, టీసీఎస్, మ్యాక్స్ హెల్త్‌కేర్, సన్ ఫార్మా షేర్లు నష్టపోతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.35గా ఉంది. అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు సానుకూల ఫలితాలను ఇస్తున్నట్లు కనిపిస్తోంది. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను వదులుకునేందుకు టెహ్రాన్ అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు పశ్చిమాసియా సంక్షోభానికి ముగింపు పలుకుతాయనే ఆశావహ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా కదలాడుతు న్నాయి. మరోవైపు, చమురు ధరలు దిగొచ్చాయి. రెండు వారాల కనిష్ఠానికి తగ్గాయి. బ్యారెల్‌కు 4.71 డాలర్లు తగ్గి, 98.81 డాలర్లకు దిగొచ్చింది.

**మార్కెట్ ఒడుదొడుకులకు శాంతి**

యుద్ధం ముగించే విషయమై అమెరికా - ఇరాన్ మధ్య శాంతిచర్చలు కొలిక్కి వస్తున్నాయనే వార్తలు, చమురు ధరల ఆధారంగా ఈ వారం స్టాక్ మార్కెట్ చలించొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. యుద్ధానికి ముగింపు పలికే దిశగా ఇరు వర్గాలు చర్యలు తీసుకోవడం ఉపశమనం కలిగించేదే. హర్మూజ్ జలసంధిని 60 రోజుల పాటు తెరుస్తామని ఇరాన్ ప్రకటించడం గట్టిగా ప్రభావం చూపనుంది. కార్పొరేట్ సంస్థల మార్చి త్రైమాసిక ఫలితాలనూ గమనించాలి. విదేశీ మదుపర్ల ధోరణి, రూపాయి కదలికలూ ప్రభావం చూపుతాయి. నిఫ్టీ-50కి 24,000-24,100 వద్ద నిరోధం, 23,500-23,220 వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. జూన్, ఆగస్టు సమీక్షల్లో ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను పెంచొచ్చన్న అంతర్జాతీయ ఆర్థిక సంస్థల అంచనా వేస్తున్నా, రూపాయి మారకపు విలువ దృష్ట్యా సవరించకపోవచ్చని దేశీయంగా భావిస్తున్నారు. బక్రీద్ సందర్భంగా గురువారం మార్కెట్లకు సెలవు కావడంతో, ఈవారం నాలుగు రోజులే ట్రేడింగ్ జరగనుంది. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలిలా..మార్జిన్లు పెరుగుతుండడం, గిరాకీ కొనసాగుతున్నందున ప్రామాణిక సూచీలకు మిన్నగా లోహ సూచీ రాణించొచ్చు. లోహ ధరలు అధికంగా కొనసాగడం కంపెనీలకు కలిసిరావొచ్చు. అయితే కోకింగ్ కోల్ ధరల పెరుగుదలను గమనించాలి.ఇటీవలి భారీ నష్టాల తర్వాత ఐటీ షేర్లు కొంత మేర లాభాలు పొందొచ్చు. ఐటీ సూచీకి 28,000-28,200 వద్ద మద్దతు, 29,700-30,000 వద్ద నిరోధం కనిపిస్తున్నాయి. ప్రభుత్వానికి ఆర్‌బీఐ రూ.2.87 లక్షల కోట్ల డివిడెండ్ చెల్లించనుండటం, దేశ ఆర్థికానికి ఊతం ఇవ్వనుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల ఉపశమనం నిఫ్టీ బ్యాంక్ సూచీకి మద్దతు నివ్వొచ్చు. పెన్షన్ ఫండ్ ఏర్పాటు కోసం పీఎఫ్ఆర్‌డీఏఐతో చర్చల్లో ఉన్నందున కెనరా బ్యాంక్ షేర్లు వెలుగులోకి రావొచ్చు. అధిక విలువల కారణంగా యంత్రపరికరాల షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. బలమైన భవిష్యత్తువృద్ధి అంచనాల కారణంగా ఈ షేర్ల వైపు మదుపర్లు మొగ్గుచూపొచ్చు. నిఫ్టీ వాహన సూచీకి బేరిష్ సంకేతాలున్నాయి. స్వల్పకాల, మధ్య కాల చలన సగటు మధ్య ఈ సూచీ కదలాడుతోంది. 25,700 వద్ద కీలక మద్దతు కనిపిస్తోంది. బజాజ్ ఆటో షేర్లు పెరగొచ్చని సాంకేతిక ఛార్టులు చెబుతున్నాయి. టెలికాం షేర్లపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ఆర్థిక ఫలితాలు అంచనాలకు తగ్గట్లుగా వెలువడడం ఇందుకు నేపథ్యం. జులై-ఆగస్టులో టారిఫ్ పెంపు ఉంటే, ఈ షేర్లకు సానుకూలతలు పెరగొచ్చు. పశ్చిమాసియా పరిణామాల వల్ల పడుతున్న భారం ప్రభావం ఎఫ్ఎంసీజీ షేర్లపై కనిపించొచ్చు. కొంత లాభాల స్వీకరణా జరగొచ్చు. అమెరికా-ఇరాన్ చర్చల్లో పురోగతి వల్ల నిఫ్టీ చమురు-గ్యాస్ సూచీ రాణించొచ్చు. పెట్రో ధరలను శనివారం మరోసారి పెంచడం మార్కెటింగ్ సంస్థలకు కలిసిరావొచ్చు. సిమెంటు షేర్లు రాణించొచ్చు. దీర్ఘకాల గిరాకీ వల్ల 2026-27లో 7-8% విక్రయాల వృద్ధి అంచనా ఉంది. అంబుజా, అల్ట్రాటెక్‌ను పరిశీలించొచ్చని ఓ బ్రోకరేజీ చెబుతోంది. నిఫ్టీ ఫార్మా సూచీ లాభాలు కొనసాగొచ్చు. అధిక కంపెనీలు అంచనాలకు అనుగుణంగా మార్చి త్రైమాసిక గణాంకాలు వెలువరచడమే కారణం.

## మరోసారి స్మార్ట్‌ఫోన్ ధరలు పెంచేసిన రెడ్‌మి



**ముంబై:**మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు పెరుగుతుండటంతో పలు కంపెనీలు స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచేస్తున్నాయి. తాజాగా ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ రెడ్‌మి మరోసారి ఫోన్ ధరలను పెంచేసింది. రెడ్‌మి 15 రెడ్‌మి నోట్ 15 ధరలను రూ. 2 వేల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి.సవరించిన ధరలతో.. రెడ్‌మి నోట్ 15 స్మార్ట్‌ఫోన్ వేరియంట్ ధర రూ.24,999 నుంచి రూ.26,999కు చేరింది. జనవరిలో విడుదలైన ఈ ఫోన్ ప్రారంభ ధర రూ.22,999తో పోలిస్తే ఇప్పటివరకు రూ.4 వేలు పెరగడం గమనార్హం. మరో వేరియంట్ ధర రూ.27,999 నుంచి 29,999కు పెరిగింది. రెడ్‌మి 15 స్మార్ట్‌ఫోన్ వేరియంట్ ధర రూ.18,499 నుంచి రూ.20,499కు పెరిగింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

# 2 నెలల ముందే ఎబోలా వ్యాప్తి..

## నివ్వెరపరుస్తోన్న కాంగో తీరు..!




ఆఫ్రికా దేశాల్లో వేగంగా వ్యాపిస్తోన్న ఎబోలా యావత్ ప్రపంచాన్ని గుబులు పుట్టిస్తోంది. ఇప్పటికే భారత్ సహా పలు దేశాలు అప్రమత్తమై వైరస్ వ్యాప్తి కట్టడికి చర్యలు చేపట్టాయి. కానీ, ఈ సంక్షోభం పుట్టుకొచ్చిన కాంగోలో మాత్రం ఎబోలా నియంత్రణపై అధికారులు నిమ్మకునీ రెత్తినట్లుగా ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్ వ్యాప్తి మొదలైంది కూడా రెండు నెలల కిందటే అయినా.. దాన్ని గుర్తించడంలో వారు చాలా ఆలస్యం చేసినట్లు తెలుస్తోంది.ఈశాన్య కాంగోలోని బునియా నగరంలో మే 15న ఎబోలా తొలి కేసు నమోదైంది. కానీ, అంతకంటే దాదాపు రెండు నెలల ముందే అక్కడ ఈ వైరస్ వ్యాప్తి మొదలైనట్లు అంతర్జాతీయ సంస్థల విచారణలో తేలింది. దీన్నిబట్టి చూస్తే ఊహించిన దానికంటే తీవ్రస్థాయిలో ఇప్పటికే వైరస్ వ్యాప్తి చెంది ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక, బునియాలో కేసు బయటపడిన తర్వాత కూడా కట్టడి చర్యలు తూతూమంత్రంగా ఉన్నాయట. ఎబోలా లక్షణాలున్న వారిని ఐసోలేషన్‌లో ఉంచడం, వైద్యులు పీపీఈ కిట్లు ధరించడం వంటివి మచ్చుకైనా అక్కడ కన్పించట్లేదు. ఇక, శానిటైజర్లు, టెస్ట్ కిట్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. జనరేటర్లకు సరిపడా ఇంధనం లేక.. రోజుకు 20 నుంచి 40 మందికి మాత్రమే టెస్టులు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

**నిధుల కొరత..**

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగోకు గతేడాది భారీగా నిధుల కోత విధించారు. దీంతో ఈ దేశం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. మరోవైపు, అంతర్జాతీయ సహాయ సంస్థలకు కూడా నిధుల కొరత ఏర్పడింది. దీంతో వైరస్ నియంత్రణకు అవసరమైన వైద్య సౌకర్యాలు కల్పించే అవకాశం లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు. 1976లో తొలిసారి ఎబోలా వైరస్ బయటపడిన తర్వాత.. కాంగోలో ఈ వైరస్ వ్యాప్తి చెందడం ఇది 17వ సారి. అయితే, గతంతో పోలిస్తే ఈసారి బయటపడిన బుండిబుగ్యో వైరస్ రకం చాలా ప్రమాదకరంగా కన్పిస్తోంది. ఇప్పటివరకు 900 కేసులు నమోదవగా.. మరణాల రేటు 40 శాతంగా ఉన్నట్లు కాంగో అధికారులు వెల్లడించారు. అయితే, మరణాల సంఖ్య అధికారిక ధ్రువీకరణేదీ లేదు.

**మృతదేహాల కోసం దాడులు..**

ఇదిలాఉండగా.. ఎబోలా రోగులకు చికిత్స అందిస్తోన్న ఓ ఆసుపత్రిపై ఆదివారం రాత్రి కొందరు యువకులు దాడి చేశారు. ఈ వైరస్‌తో ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు వ్యక్తుల మృతదేహాలను తీసుకెళ్లిపోయారు. వ్యాధి విస్తరణ భయంతో ఎబోలా పీడితుల శవాలకు అధికారులే అంత్యక్రియలు జరుపుతున్నారు. దీనిపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత ఎక్కువవుతోంది. సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరగట్లేదంటూ కొందరు బాధ్యతారహితంగా వ్యవహరించి ఎబోలా సోకిన వారి మృతదేహాలను తీసుకెళ్తున్నారు. దీనివల్ల వైరస్ మరింత వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బ్రిటన్‌లో మేయర్లుగా ఎన్నికైన హరియాణా తల్లీతనయులు

చండీగఢ్: హరియాణాలోని రోహ్‌తక్ నుంచి 2013లో బ్రిటన్‌కు వలస వెళ్లిన కుటుంబానికి చెందిన తల్లీతనయులు పర్వీన్ రాణి, తుషార్ కుమార్ (23) ఆ దేశంలో మేయర్లుగా ఎన్నికయ్యారు. బ్రిటన్‌లో భారతీయ మూలాలున్న అతి తక్కువ వయసు గల మేయర్‌గా తుషార్ చరిత్ర సృష్టించారు. ఎల్‌స్ట్రీ అండ్ బోరమ్‌వుడ్ పట్టణ కౌన్సిల్‌కు ఆయన మేయరుగా ఎన్నిక కాగా, వారం రోజుల తర్వాత తుషార్ తల్లి పర్వీన్ రాణి హర్ట్స్‌మేర్ బరా కౌన్సిలుకు భారతీయ మూలాలున్న తొలి మేయరుగా ఎన్నికయ్యారు. భారతీయ కుటుంబానికి చెందిన తల్లీకుమారులు ఇద్దరూ బ్రిటన్‌లో ఒకేసారి మేయర్లుగా ఎన్నిక కావడం గర్వకారణమని వ్యాపారవేత్త అయిన తుషార్ తండ్రి సునీల్ దహియా ఆదివారం ఫోను ద్వారా తెలిపారు. లండన్‌లోని కింగ్స్ కళాశాల నుంచి డిగ్రీ అందుకొన్న తుషార్ ఈ ఏడాది సెప్టెంబరులో పీజీ పూర్తి చేసుకోనున్నారు.



## రూపాయి విలువపై ఎలాంటి టార్గెట్ లేదు: ఆర్‌బీఐ గవర్నర్



**న్యూఢిల్లీ:**అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు మంటలు తదితర కారణాలతో ఇటీవల మన దేశీయ కరెన్సీ రూపాయి విలువ భారీగా పడిపోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి దాదాపు 100 మార్క్ దిశగా పతనమై ఆందోళన కలిగించింది. దీనిపై తాజాగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి ఓవర్ వ్యాల్యూగా ఉందని అనలేమని, వాస్తవిక విలువ కంటే తక్కువగా ట్రేడ్ అవుతోందని మాత్రం చెప్పగలమని అన్నారు. ఇక, రూపాయి విలువకు సంబంధించి ఎలాంటి నిర్దిష్ట మారకపు రేటు స్థాయిని ఆర్‌బీఐ లక్ష్యంగా పెట్టుకోదని సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. అసలు అలాంటి విషయాల్లో కేంద్రబ్యాంకు ఎలాంటి జోక్యం చేసుకోబోదని తెలిపారు. అయితే, ఊహాజనిత కదలికలు లేదా అధిక అస్థిరతను అరికట్టడానికి మాత్రమే విదేశీ మారక ద్రవ్య ఎక్స్ఛేంజీ మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందని స్పష్టంచేశారు. మన రూపాయికి ఒక నిర్దిష్ట విలువను సెట్ చేయడం కంటే.. కరెన్సీ మార్కెట్‌ను స్థిరంగా ఉంచడానికే తాము ప్రాధాన్యమిస్తామని ఆర్‌బీఐ గవర్నర్ వివరించారు. ఇక, అంతర్జాతీయంగా అస్థిరత, చమురు ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ.. మన దేశ బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ స్థిరంగా ఉన్నాయని సంజయ్ మల్హోత్రా తెలిపారు. విదేశీ సంస్థాగత మదుపర్ల నుంచి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. మన కరెన్సీ విలువను స్థిరంగా ఉంచేందుకు దిగుమతులను తగ్గించి.. ఎగుమతులను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఇదిలాఉండగా.. ఇటీవల భారీస్థాయిలో పతనమైన రూపాయి విలువ సోమవారం కాస్త కోలుకుంది. నేటి ట్రేడింగ్‌లో 40 పైసలు పెరిగి 95.20గా ట్రేడ్ అవుతోంది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఖరారయ్యే అవకాశాలున్నట్లు వార్తలు రావడంతో చమురు మంటలు కాస్త చల్లారాయి. దీంతో మన కరెన్సీ కాస్త బలపడింది.

## గాల్లో పారాగ్లైడర్‌ను ఢీకొన్న విమానం

### అత్యవసర పారాచూట్ తెరుచుకోవడంతో తప్పినముప్పు

**జనంసాక్షి:**గాల్లో ఉన్న పారాగ్లైడర్‌ను విమానం ఢీకొన్న ఘటన ఆస్ట్రియన్ ఆల్ప్స్ పర్వతాలపై చోటుచేసుకుంది. 44 ఏళ్ల పారాగ్లైడర్ సబ్రినా తన పారాచూట్‌కు కెమెరాను అమర్చుకుని గాల్లో విన్యాసాలు చేస్తుండగా, ఒక్కసారిగా ఓ విమానం పారాచూట్‌ను ఢీకొట్టుకుంటూ వెళ్లింది. పారాచూట్ రెండు ముక్కలవడంతో ఆమె నియంత్రణ కోల్పోయి, గాల్లోనే గింగిరాలు తిరుగుతూ కింద పడిపోసాగింది. వెంటనే సమయస్ఫూర్తితో ఎమర్జెన్సీ పారాచూట్‌ను తెరవడంతో ప్రాణాలతో బయటపడింది. స్థానికుల సమాచారంతో పోలీసులు హెలికాప్టర్‌లో ఘటనా స్థలానికి చేరుకొని వైద్య పరీక్షల కోసం ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన శనివారం చోటుచేసుకోగా.. ప్రమాదానికి సంబంధించిన ఓ వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. జెల్ ఆమ్ సీ విమానాశ్రయంలో ల్యాండ్ అయిన తర్వాత ఈ ఘటనపై విమాన పైలట్ మాట్లాడుతూ.. సమీపంలోకి వెళ్లేవరకు అక్కడ పారాగ్లైడర్ ఉన్నట్లు గుర్తించలేకపోయామని తెలిపారు. ఆ సమయంలో విమానాన్ని నియంత్రించడం సాధ్యం కాకపోవడంతో పారాచూట్‌ను ఢీకొన్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం పారాగ్లైడర్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు.



## బీఆర్ఎస్ వచ్చాక 24 గంటల తాగునీరిస్తాం

మంచినీళ్లు ఇస్తామని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలకు కేసీఆర్ 24 గంటల కరెంటు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. 24 గంటలు మంచినీళ్లు ఇచ్చేది కూడా కేసీఆరే అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం దివాళా తీసిందని కేటీఆర్ తెలిపారు. ఇందిరాపార్క్ దగ్గర సెంట్రింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నారని పేర్కొన్నారు. సెంట్రింగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మళ్లీ రాబోయేది కేసీఆర్.. గులాబీ జెండానే అని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మిమ్మల్ని ఆదుకుంటామని అన్నారు. సెంట్రింగ్ కార్మికులకు బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం.. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కూకట్‌పల్లిలోని 15 డివిజన్లలో కొత్త అధ్యక్షులను నియమిస్తామని కేటీఆర్ తెలిపారు. జూన్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో కార్పొరేటర్లు నిబద్ధత కలిసిన సైనికుల్లా పనిచేశారని అన్నారు. ఎవరైతే ప్రజల చుట్టూ తిరుగుతారో.. వాళ్లకే కార్పొరేట్ టికెట్లు ఇస్తామని పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. సర్వేల ఆధారంగా కార్పొరేటర్లకు టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. డిజిటల్ పద్ధతిలో పార్టీ సభ్యత్వ నమోదు చేపడుతున్నామని తెలిపారు. సభ్యత్వ నమోదు తర్వాత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్‌పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. తెలంగాణలో 3.39 కోట్ల ఓటర్లు ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 35,985 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.

### విమానం 30వేల అడుగుల ఎత్తులో ఉండగా..

## పైలట్‌కు గుండెపోటు




బార్సిలోనా:విమానం గాల్లో 30,000 అడుగుల ఎత్తులో ఉండగా పైలట్‌కు గుండెపోటు వచ్చిన ఘటన స్పెయిన్‌లోని టెనెరెట్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళుతున్న జెట్2 విమా నంలో చోటుచేసుకుంది. దీంతో విమానాన్ని పోర్చుగ ల్‌లోని ఫ్రాన్సిస్కో సా కార్నీరో ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. వెంటనే పైలట్‌కు వైద్యసాయం అం దించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారు జామున జెట్2 విమానం స్పెయిన్‌లోని టెనెరెట్ నుంచి బర్మింగ్‌హామ్‌కు బయల్దేరింది. విమానం 30,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తుండగా.. పైలట్‌కు గుండెపోటు వచ్చినట్లు కో పైలట్ గుర్తించారు. వెంటనే దగ్గరలో ఉన్న ఫ్రాన్సిస్కో సా కార్నీరో ఎయిర్‌పోర్టు అధికారులను అప్రమత్తం చేశారు. విమానం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునే సమయానికి అధికారులు అత్యవసర వైద్య ఏర్పాట్లు చేసి పైలట్‌కు వెంటనే వైద్యసాయం అందించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటన సమయంలో విమానంలో 220మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన నేపథ్యంలో గంటకు పైగా విమానంలోనే వేచి ఉండాల్సి వచ్చిందని ప్రయాణికులు పేర్కొన్నారు. ఎయిర్‌లైన్స్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేవరకు దాదాపు 13 గంటల పాటు టెర్మినల్‌లోనే ఉన్నామని.. అయినా అధికారులు తమకు ఎటువంటి వసతి ఏర్పాట్లు చేయలేదని వాపోయారు. శనివారం మరో విమానం ఏర్పాటు చేయడంతో బర్మింగ్‌హామ్‌కు చేరుకున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి జెట్2 క్షమాపణలు చెప్పింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత విషయంలో తమ ఎయిర్‌లైన్స్ ఎప్పుడూ రాజీ పడబోదని వెల్లడించింది.



- కాంగ్రెస్‌లో సెగ మళ్ళీ రాజుకుంది..!
- నగర కాంగ్రెస్ అధ్యక్ష పదవితో మరింత చిచ్చు
- కార్పొరేషన్ ఎన్నికల్లోనూ అంతేస్థాయిలో పొక్కిన తగాదాలు
- కార్యకర్తల్లో అయోమయం, నేతల్లో అసంతృప్తి
- పార్టీ కార్యక్రమాలకు రెండువర్గాలుగా హాజరవుతున్న నాయకులు

# హస్తంలో కుస్తీ

## పాలమూరులో డీసీసీ వర్సెస్ ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ బ్యూరో (జనంసాక్షి) :**

*మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు, వర్గ విభేదాలు తీవ్రమయ్యాయి. నేతలు ఎవరంతకు వారు ఇష్టారాజ్యం గా వ్యవహరిస్తున్నారు. దీంతో ద్వితీయ శ్రేణి నేతలు ఎవరికి అనుకూలం గా ఉంటే ఏం జరుగుతుందోనన్న భయాందోళనలో ఉన్నారు. మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ డిప్యూటీ మేయర్ ఎంపికతో మొదలైన వివాదం రోజురోజుకు తీవ్రమవుతూనే ఉంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే పార్టీకి నష్టం జరుగుతుందని శ్రేణులు అభిప్రాయ పడుతున్నారు. సీఎం సొంతజిల్లాలో ఇలా విభేదాలు జరుగు తుండటంతో పార్టీరాష్ట్ర స్థాయిలో బడా నేతలు తలలు పట్టుంకుంటు న్నట్లుగా తెలుస్తోంది.*

పాలమూరు నియోజకవర్గంలో అధికారంలోకి వచ్చామన్న ఆనందం కంటే గ్రూపు తగాదాలే ఎక్కువయ్యాన్న ఆందోళన కార్యకర్తల్లో కనబడుతుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటింది. సీఎం రేవంత్ రెడ్డి స్వంత జిల్లా కావటంతో ఫలితాల్లో తేడా వస్తే ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశ్యంతో ఎన్నికలను పార్టీ నేతలు ప్రతిష్టాత్మకంగా భావించారు. మంత్రులు ఎమ్మెల్యేలు సైతం అభ్యర్థుల గెలుపుకోసం చెమటోడ్చారు. మహబూబ్‌నగర్ కార్పోరేషన్‌లో మొత్తం 60 డివిజన్లకుగాను కాంగ్రెస్ 29 బీఆర్ఎస్ 15 బీజేపీ 8 ఎంఐఎం మూడు స్వతంత్రులు 5 డివిజన్లలో విజయం సాధించారు. అయితే మేయర్, డిప్యూటీ మేయర్ విషయంలో క్యాంపు రాజకీయాలు చేశారు. క్యాంపుల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. సొంతపార్టీ కార్పోరే టర్ భర్త డబ్బులు పంచాడనే ఆరోపణలు రావటం పోలీసులు రంగప్రవేశం చేయటంతో హాట్‌హాట్‌గా మారింది. చివరకు మేయర్‌గా గుమాల మమత, డిప్యూటీ మేయర్‌గా సురేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అయితే ఈ ఎంపిక ఏకపక్షంగా సాగిందని ఓ వర్గం ఆరోపించింది. ఈ వివాదం పార్టీలో తీవ్ర దుమార రేపింది. పార్టీ రెండు వర్గాలుగా చీలికకు కారణమయ్యింది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వర్గం ఒకటైతే, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్‌ముదిరాజీది మరోవర్గంగా మారినట్టు చర్చించుకుంటున్నారు. గతంలో కొన్ని కార్యక్రమాలు ఇరువర్గాలు వేర్వేరుగా నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా కార్యావర్గంలో పార్టీకోసం కష్టపడిన వారికి ప్రాధాన్యత దక్కలేదని ఓ వర్గం నాయకుడు ఆరోపించటం కూడ చర్చనీయాంశంగా మారింది.

**కీలక పాత్ర పోషించిన ఆనంద్ గౌడ్**

పాలమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గెలుపులో కీలక పాత్ర పోషించిన ఆనంద్ గౌడ్ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను తమవైపు తిప్పి చైర్మన్ గా ఎన్నికై కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు తీసుకొచ్చారు. కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ విజయానికి పాటుపడ్డారు. పాలమూరు పట్టణంలో పలుకుబడి, నేతలతో, కార్యకర్తలతో సత్సంబంధాలు ఉన్న నేతగా మంచిపేరుంది. ఇక్కడే అస్సలు కథ మొదలైంది. జిల్లా డీసీసీ, మరో నియోజకవర్గం ఎమ్మెల్యే పీసీసీ స్థాయి నేతలు ఆనందగౌడ్ పేరుని బలపరుస్తుండటం, ఎమ్మెల్యే మరొక పేరును ప్రతిపాదించడంతో కార్పొరేషన్ రాజేసిన చిచ్చు నగర పదవితో మరింత అంటుకున్నట్లుగా ఉంది. ఓ వర్గం పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్తేతే ఎమ్మెల్యే పీసీసీతో పాటు పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షీ నటరాజన్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. దీంతో ఇరువర్గాలు తమ పంథాన్ని నెగ్గించుకునేందు కు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నట్టు తెలుస్తోంది. కార్పోరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికతో ప్రారంభమైన వివాదం సమసిపోతుం దని భావిస్తుంటే నగర పార్టీ అధ్యక్ష పదవి వ్యవహారంతో మరింత రాజుకునేలా కనిపిస్తోంది. మరి పార్టీ అధిష్టానం ఈ అంశాన్ని ఏవిధంగా పరిష్కరిస్తోందో చూడాలి. నగర అధ్యక్ష పదవి మైనారిటీ నేత సిరాజ్ ఖాద్రికా? ఎమ్మెల్యే గెలుపుకై పనిచేసి మేయర్ అవకాశం కోల్పోయిన ఆనందగౌడ్‌కి వరిస్తుందో వేచిచూద్దాం.

**నగర అధ్యక్ష పదవితో మరోసారి..**

తాజాగా మహబూబ్‌నగర్ నగర అధ్యక్ష నియామకం కోసం ఇరువర్గాల నేతలు వేర్వేరుగా పేర్లను ప్రతిపాదించినట్టు జోరుగా ప్రచారం సాగుతుంది. ఎమ్మెల్యే ఓ మైనార్టీ నాయకుడి సిరాజ్ ఖాద్రి పేరును ప్రస్తావిస్తే.. డీసీసీ అధ్యక్షుడు మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ పేరు ప్రతిపాదించారని తెలుస్తోంది. మహబూబ్‌నగర్ కార్పోరేషన్‌లో ముస్లీం మైనార్టీలు , తమ సామాజిక వర్గానికి మేయరో లేదా డిప్యూటీ మేయర్ పదవో వస్తుందని ఆశించామని, కాని ఏ పదవి దక్కలేదని మండిపడుతున్నారు. గత అసెంబ్లీ, పార్లమెంట్, గ్రామపంచాయతీల్లో మైనార్టీలు కాంగ్రెస్ పార్టీకి పూర్తిస్థాయిలో మద్దతు తెలిపి ఓట్లు వేశారని అందుకే తమ సామాజికవర్గానికి కనీసం పార్టీ టౌన్ అధ్యక్ష పదవి కావాలని ఈ సామాజికవర్గం నేతలు డిమాండ్ చేస్తున్నారు. మరోపక్క టౌన్ అధ్యక్షపదవి మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ పేరు తెరమీదికి రావడంతో ఒక్కసారిగా పాలమూరు కాంగ్రెస్‌లో నగర అధ్యక్ష పదవి హాట్ టాపిక్‌గా మారింది.



## డాక్టర్ విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మశ్రీ పురస్కారం ప్రదానం

**హైదరాబాద్, మే 25 (జనంసాక్షి) ::** రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో అపోలో క్యాన్సర్ సెంటర్స్ (హైదరాబాద్) డైరెక్టర్, క్యూర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పీ విజయ్ ఆనంద్ రెడ్డికి ప్రతిష్మాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. వైద్య రంగంలో, ముఖ్యంగా క్యాన్సర్ చికిత్సలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. పురస్కార ప్రదానోత్సవం అనంతరం న్యూఢిల్లీలోని చాణక్య పురిలో ఉన్న అశోక్ హోటల్ లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'ఈ గౌరవాన్ని ఎంతో వినయంతో, కృతజ్ఞతతో స్వీకరిస్తున్నాను. నా సేవలను గుర్తించి ఈ ప్రతిష్మాత్మక పురస్కారాన్ని అందించిన భారత రాష్ట్రపతి గారికి, భారత ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ గుర్తింపు కేవలం నా ఒక్కడికే కాదు, ఆంకాలజీ రంగంలో సేవలందిస్తున్న సహచర వైద్యులు, మార్గదర్శకులు, రోగులు, కుటుంబ సభ్యులకు దక్కిన గౌరవం' అని అన్నారు. 'ఈ అవార్డు సమాజానికి మరింత నిబద్ధతతో, కరుణతో, సేవాభావంతో పని చేయాలనే నా సంకల్పాన్ని మరింత బలపరుస్తోంది. ముఖ్యంగా ధైర్యసాహసాలతో పోరాడుతున్న చిన్నారులు, అయా కుటుంబాలకు ఈ గుర్తింపును అంకితం చేస్తున్నాను' అని పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లోకి బోయినపల్లి బీఆర్ఎస్ నేత మల్లారెడ్డి

### కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**బోయినపల్లి, మే 25 (జనం సాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముదుపు మల్లారెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి, ఆత్మీయంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న ప్రగతి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపు వస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. అనంతరం ముదుపు మల్లారెడ్డి మాట్లాడుతూ చొప్పదండి ఎమ్మెల్యే నాయకత్వంలో, మండల పార్టీ సహకారంతో కోరెం గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, ముఖ్య నాయకులు రోమాల అజయ్, పులి హన్మాండ్లు, ఆంజనేయులు గౌడ్, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంట్రీ చికెన్ కో..' సరికొత్త ప్రీమియం స్టోర్ ప్రారంభం




**ఖైరతాబాద్ (జనంసాక్షి) :** సహజ పద్ధతులలో పెంచిన నాటు కోడి మాంసానికి ప్రసిద్ధి చెందిన స్వదేశీ బ్రాండ్ 'కంట్రీ చికెన్ కో.' బంజారాహిల్స్ లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. దేశంలోనే మొదటిసారి 'ఫార్మ్ టు ఫోర్క్' (పొలం నుంచి ప్లేటు వరకు) అనే 'ఫార్మర్స్ వెబ్‌సైట్'ను కూడా ఆవిష్కరించారు. ఐదేళ్ల విజయవంతమైన ప్రయాణంలో భాగంగా ఈ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. ఇది కంట్రీ చికెన్ ఎనిమిదో అవుట్ లెట్. ఈ వేదికగా చికెన్‌తో పాటు 'కంట్రీ మటన్', 'కంట్రీ క్యాచ్' (సీఫుడ్) విభాగాలను కూడా మార్కెట్లోకి పరిచయం చేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 650 పైగా చిన్న, సన్నకారు రైతులకు శాస్త్రీయ విధానంలో పౌల్ట్రీ పెంపకంపై శిక్షణ ఇచ్చి, ఉత్పత్తులకు హామీతో కూడిన బై బ్యాక్ సౌకర్యం కల్పిస్తూ గ్రామీణ జీవనోపాధి అభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రశంసనీయం అన్నారు. సహజసిద్ధంగా పెంచిన మాంసాహార ఉత్పత్తులు, దుర్వాసన లేని రిటైల్ స్టోర్లు, సులభంగా ఉపయోగించగల మొబైల్ యాప్ ద్వారా వినియోగదారులకు నమ్మకమైన, స్వచ్ఛమైన మాంసాహారాన్ని అందిస్తూ దేశంలోనే కొత్త ప్రమాణాలను తీసుకొచ్చిందన్నారు. కంట్రీ చికెన్ కో. వ్యవస్థాపకుడు, సీఈఓ జీ సాయికేష్ గౌడ్ మాట్లాడుతూ ఐదేళ్ల ఈ ప్రయాణంలో కంట్రీ చికెన్ కో. నగర ప్రజలను సహజ పద్ధతుల్లో పెంచిన మాంసం వైపు నడిపించిందన్నారు. కేవలం ఒకే ఒక్క నాటుకోడి స్టోర్‌గా ప్రారంభమైన ఈ సంస్థ ఈరోజు ఆరోగ్యం, రుచి రెండింటి కోసం సహజమైన మాంసాన్ని ఎంచుకుంటున్న 50,000 పైగా కస్టమర్ల ఆదరణను పొందిందన్నారు. ఒక ప్రియమైన బ్రాండ్‌గా ఎదిగిందమ్నారు. వినియోగదారులు ఆహారంపై ఎంతో అవగాహనతో ఉన్నారన్నారు. కూరగాయలు, పండ్లు రసాయన రహితమా? మామిడి పండ్లు సహజంగా పండించబడినవేనా? హానికరమైన రసాయనాలతో పండించారా? అనే విషయాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు.

## తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

**నిజామాబాద్ అర్బన్, మే 25 జనం సాక్షి :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. జూన్ 2న జరిగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి శకటాలను ప్రదర్శించా లని సూచించారు. అదేవిధంగా వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి దందా..

### 6 టిప్పర్లను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు

- అనుమతులు లేకుండా వందలాది లారీలతో మట్టి తరలింపు
- రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు.. గ్రామస్తుల ఆందోళన, కౌన్సిలర్లు, స్థానికుల నిరసన
- అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**పెద్దపల్లి, మే 25 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుడి నుంచి వెళ్తున్న మట్టి లారీలను అడ్డుకొని తనిఖీ చేసిన 16వ వార్డు కౌన్సిలర్ నాంసాని శ్రీనివాస్, బొంకురి అవినాష్‌లు అక్రమంగా మట్టి తరలిస్తున్న 6 టిప్పర్లను సీజ్ చేయించారు. మినీ ట్యాంక్ బండ్ వద్ద జరిగిన తనిఖీలో అనుమతులు లేని లారీలను గుర్తించి డిప్యూటీ తహసీల్దార్ విజేందర్ సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తదుపరి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పరిమితికి మించి అధిక లోడ్‌తో వెళ్తున్న లారీలను నిట్టూర్ గ్రామ ప్రజలు రెండు గంటల పాటు రోడ్డుపై ఆపి నిరసన వ్యక్తం చేశారు. గోరంత పర్మిషన్ తీసుకుని కొండంత మట్టిని తీసి అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో లారీలను నడుపుతున్నట్లు పలువురు గ్రామస్తులు ఆరోపించారు. గత ఐదు రోజుల నుంచి సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామ శివారు చెరువు నుంచి రోజంతా లారీలు నడపడంతో ఇతర వాహనాలకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.అనుమతి పేరుతో అడ్డగోలుగా వందలాది లారీలతో మట్టి తరలింపు జరుగుతోందని, మట్టి లారీల ముందు వెనుక సెక్యూరిటీగా భద్రతతో కారులో దర్జాగా వెళ్తున్న వ్యాపారులు ఉన్నట్లు స్థానికులు ఆరోపించారు. ఈ అక్రమాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## పేద కుటుంబాలకు భరోసా కల్పించేదే లైఫ్ ఇన్సూరెన్స్

- ఉపాధి కూలీలకు లైఫ్ ఇన్సూరెన్స్ పై అవగాహన.
- శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మెట్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ నరేష్

**మల్లాపూర్, మే 25(జనంసాక్షి) :** మండలంలోని మల్లాపూర్, కుస్థాపూర్, చిట్టాపూర్ గ్రామాలలో ఉపాధి హామీ కూలీలతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత కార్మికులు, కూలీలు కూడా తమ కుటుంబ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని తప్పనిసరిగా లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మెట్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ నరేష్ పాల్గొని లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల వల్ల కలిగే ప్రయోజనాలను కూలీలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత అత్యంత అవసరమైందన్నారు. అనుకోని ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు, కుటుంబ పెద్ద మరణం వంటి ఘటనలు సంభవించినప్పుడు కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా నిలబెట్టేది లైఫ్ ఇన్సూరెన్స్ మాత్రమేనని తెలిపారు. ఇంటి పెద్దకు ఏదైనా జరిగితే కుటుంబ సభ్యులు రోడ్డున పడకుండా ఆదుకునే భరోసా పాలసీల ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాద మరణాలు, అనారోగ్య పరిస్థితుల్లో కుటుంబ సభ్యులకు ఆర్థిక భరోసా అందించడంలో ఇన్సూరెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థికంగా బలపడేందుకు ఇలాంటి పాలసీలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ నరేష్, యూనిట్ మేనేజర్ సాయిందర్, డెవలప్మెంట్ ఆఫీసర్స్ నిమిషకవి రాజేష్, ప్రవళిక, సేల్స్ ఆఫీసర్స్ లావణ్య, రామ నవీన్, లలిత తదితరులు పాల్గొన్నారు

## మడిగేలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**ఆర్మూర్,మే 25 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద ఓ మడిగె లోపల గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఆర్మూర్ పట్టణ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు.స్థానిక నివాసి ఆజ్మత్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.మృతుడి వయసు సుమారు 40 నుండి 45 సంవత్సరాలు ఉండి, ఎరుపు రంగు చొక్కా,నలుపు రంగు చెడ్డి వేసుకున్నాడు.మృతదేహం కొద్దిగా ఉబ్బి ఉండి, ఎత్తు 5.6 అడుగులు,తల వెంట్రుకలు నలుపు రంగు,గడ్డం తెలుపు రంగులో ఉన్నట్టు తెలిపారు. ఈ సంఘటనపై ఆర్మూర్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్ హెచ్ ఓ ఆర్మూర్ 87126 59858, అఫ్రత్ ఎస్సై 87125 77701,పోలీసు స్టేషన్ ఆర్మూర్ ను 87126 59752 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## అన్నివర్గాల ప్రజలకు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు

- తుముకుంటలో టీజీబీ కొత్త శాఖ ప్రారంభం
- నాబార్డు తెలంగాణ సీజీఎం ఉదయభాస్కర్, టీజీబీ చైర్మన్ కె ప్రతాప రెడ్డి



**శామీర్ పేట్ (జనంసాక్షి) :**

శామీర్‌పేట మండలం తుముకుంట గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టీజీబీ) కొత్త శాఖను నాబార్డ్ తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఉదయభాస్కర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కె. ప్రతాప రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాబార్డ్ తెలంగాణ సీజీఎం ఉదయభాస్కర్ మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధిలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 941 శాఖల ద్వారా సేవలను అందిస్తోందని, దీనితో ఇది ఎస్‌బిఐ తర్వాత తెలంగాణలో రెండవ అతిపెద్ద బ్యాంకుగా నిలిచిందని ఆయన హైలైట్ చేశారు. తుముకుంట శాఖ ప్రారంభోత్సవంతో, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ హైదరాబాద్ నగరంలో తన నెట్‌వర్క్‌ను 99 శాఖలకు విస్తరించి, పట్టణ మరియు సెమీ-అర్బన్ ప్రాంతాలలో తన ఉనికిని బలోపేతం చేసుకుంది. రైతులు, చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలకు సులభమైన రుణాలు అందించడమే ఈ బ్యాంకు ప్రధాన లక్ష్యం. వ్యవసాయం, పశుసంరక్షణ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందించబడుతున్నాయి. సూక్ష్మ రుణాల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక సాధికారత కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. పీఎం-కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఆర్థిక సహాయం, రుణ సౌకర్యాలు కూడా అందిస్తున్నారు.

**డిజిటల్ సేవలపై దృష్టి పెట్టండి**

గ్రామీణ ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో కొత్త శాఖలను ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కె. ప్రతాప్ రెడ్డి తెలిపారు. సమాజంలోని అన్నివర్గాల ప్రజలకు డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి వాటిని విస్తృతంగా విస్తరిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం నాబార్డ్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరస్పర సహకారంతో పనిచేస్తున్నాయని నొక్కిచెబుతూ, రైతులు, గ్రామీణ పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మెట్‌పల్లిలో అక్రమ వెంచర్ల దోపిడీ

- మున్సిపల్ అధికారుల ఉదాసీనతపై కౌన్సిలర్ల ఆగ్రహం
- బచ్‌పన్ స్కూల్ సమీపంలో రోడ్లు, లింక్ రోడ్లు లేకుండా లేఅవుట్లు
- రైతుల ఇబ్బందులు, మున్సిపల్ ఆదాయానికి గండి
- టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం ఆరోపణ




**మెట్‌పల్లి, మే 25 (జనంసాక్షి):** మెట్‌పల్లి పట్టణంలో అక్రమ వెంచర్లు వెల్లువెత్తుతున్నాయి. రియాల్టర్లు మున్సిపల్ నిబంధనలను బేఖాతరు చేస్తూ, పట్టించుకోని అధికారుల అండతో విచ్చలవిడిగా దోచుకుంటున్నారని 26వ వార్డు కౌన్సిలర్ బొడ్ల రమేష్ తీవ్రంగా విమర్శించారు. బచ్‌పన్ స్కూల్ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి పై తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. కౌన్సిలర్ రమేష్, 15వ వార్డు అరిగెల అనూష-రాకేష్, 16వ వార్డు అరిసె వనజ-మురళి, 9వ వార్డు బొడ్ల వసుధ-నాగేష్‌లతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు అందజేశారు. రోడ్లు, లింక్ రోడ్లు లేకుండా అక్రమ లేఅవుట్లు వేస్తున్నారని, ఇది మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని రమేష్ ఆరోపించారు. అక్రమ లేఅవుట్ల కారణంగా చుట్టుపక్కల పంట పొలాలు సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అక్రమ లేఅవుట్ల వల్ల మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోందని, రియాల్టర్లు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ఫీజులను ఎగవేస్తున్నారని తెలిపారు. అక్రమ లేఅవుట్ల ఏర్పాటుకు టౌన్ ప్లానింగ్ అధికారుల సహకారం ఉందని, వారి నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని కౌన్సిలర్లు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొని ప్రజలు మోసపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బచ్‌పన్ స్కూల్ సమీపంలోని అక్రమ లేఅవుట్ల హద్దు రాళ్లను తక్షణమే తొలగించాలని, అక్రమ లేఅవుట్లు పెట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ లేఅవుట్లకు సహకరించిన టౌన్ ప్లానింగ్ అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మెట్‌పల్లి పట్టణంలో ఇతర ప్రాంతాలలో ఉన్న అక్రమ లేఅవుట్లపై కూడా తక్షణమే చర్యలు తీసుకొని, అక్రమ వెంచర్లకు అడ్డుకట్ట వేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మెట్‌పల్లిలో అక్రమ వెంచర్ల విచ్చలవిడి దోపిడీపై కౌన్సిలర్లు వ్యక్తం చేసిన ఆందోళన మున్సిపల్ అధికారులు, రియాల్టర్ల మధ్య ఉన్న సంబంధాలపై అనుమానాలను పెంచుతోంది. ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
26 మే 2026

# రైతుల కన్నీళ్లు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- తడిసిన ధాన్యం నీటిపాలు.. రైతుల అగచాట్లు
- కొనుగోలు కేంద్రాల్లో నెలల తరబడి కుప్పలు
- తాలు, తరుగు పేరిట దోపిడీ.. లారీలు రాక రైతుల హరిగోస
- రైతు సేవ చేసిన కేసీఆర్‌ను సహించలేని రేవంత్ సర్కార్



**కథలాపూర్, మే 25 (జనంసాక్షి):** కొనుగోలు కేంద్రాల్లో నెలలు గడిచినా ధాన్యం కుప్పలుగా నిలిచిపోవడం, తూకంలో ఆలస్యం, సకాలంలో లారీలు రాకపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాల పాలు చేస్తోందని ఆరోపించారు. కథలాపూర్ మండలం కలికోట గ్రామంలోని సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన లోక బాపు రెడ్డి, అక్కడ నెలల తరబడి నిలిచిపోయిన ధాన్యం కుప్పలను పరిశీలించి రైతులను పరామర్శించారు. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించి మేలు చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాల్లోకి నెట్టేస్తోందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం మాయమాటలు చెప్పి అధికారం చేపట్టి రైతులను మోసం చేశారన్నారు.

రైతు సేవ కేంద్రాల్లో సన్న రకం వడ్లు మాత్రమే కొనాలని నియంత్రిస్తున్న వ్యవసాయ అధికారుల తీరు సోచనీయమని మండిపడ్డారు. రైతులు పండించిన పంటను కూడా నియంత్రించాలని చూస్తున్న రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం బయటపడుతోందన్నారు. తూకంలో 43 కిలోలకు తూకం వేసి 44 జోకుతామని, అలాగే అయితే తీసుకుంటామని మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. రైతుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు చేరే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలుస్తుందని, లేని పక్షంలో రైస్ మిల్లులను ముట్టడించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. జై జవాన్ జై కిసాన్ నినాదంతో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల మాజీ జడ్పీటీసీ చింతకుంట గ్రామ సర్పంచ్ నాగం భూమయ్య, కథలాపూర్ మండల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్ రావు, మండల కో-ఆప్షన్ సభ్యులు ఎండీ. రఫీ, కలికోట గ్రామ సర్పంచ్ రాంమోళ్ల రమేష్, అంబారిపేట గ్రామ సర్పంచ్ వేముల గంగరాజం, కలికోట గ్రామ మాజీ సర్పంచ్ సరోజ సీతారాం, మాజీ ఎంపీటీసీ దేవేంద్ర గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మ రాజేశం గౌడ్, మండల యూత్ నాయకులు మున్నీర్ పాషా, రెడ్డి, పెద్ది గిరి మల్లేష్, కల్లెడ నరేష్, గధం మల్లేష్, కటి పెల్లి రవి, అశోక్ రెడ్డి, గుండ్ల శ్రీను, రాజేష్, నరేష్, గంగనర్సయ్య, నంద గిరి సాయి రామ్, పెద్ద సాయి రామ్, గ్రామం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామం రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో నాణ్యత లోపాలు

- సుందరగిరి-హుస్నాబాద్ రోడ్డు ప్రమాదకరంగా మారుతోంది
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు చూసి చూడనట్టు
- టీడీపీ నాయకుల ఆగ్రహం.. పరిహారం ఇవ్వాలని డిమాండ్



**చిగురుమామిడి, మే 25 (జనంసాక్షి):** సుందరగిరి నుంచి హుస్నాబాద్ వరకు నిర్మాణం జరుగుతున్న నాలుగు వరుసల రహదారి పనుల్లో నాణ్యత లోపాలు, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు బొల్లుమల్ల సదానందం ఆరోపించారు. సోమవారం సుందరగిరి నుంచి హుస్నాబాద్ మీదుగా జరుగుతున్న రహదారి పనులను టీడీపీ నాయకులు పరిశీలించారు.

ఈ సందర్భంగా సదానందం విలేకరులతో మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామం నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం వరకు 20 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి 163 కోట్ల రూపాయలు మంజూరు చేసిన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అయితే, ఈ నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో ఎక్కడా నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టారీతిన పనులు జరుగుతున్న తీరు చూస్తుంటే బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పనులను మొదటి ప్యాకేజీ కింద హుస్నాబాద్ సబ్ స్టేషన్ నుంచి చిగురుమామిడి పరిధి వరకు 10 కిలోమీటర్ల దూరానికి 77 కోట్ల రూపాయలతో రెండు నెలల క్రితం ప్రారంభించారన్నారు. ఫోర్ లైన్స్ రోడ్డు అంటే మూలమలుపులు లేకుండా నాణ్యతతో కూడిన రోడ్డు వేయాల్సి ఉండగా, ఇక్కడ అందుకు భిన్నంగా జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత రోడ్డును తవ్వకుండా వదిలేసి, ఇరువైపులా లూజ్ మట్టిని పోసుకుంటూ పాత రోడ్డుకు ఎత్తు సరి చేశారన్నారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ఎక్కడైనా కొత్త రోడ్డు వేస్తున్నారంటే ఒక మీటర్ లోతు నుంచి గ్రావెల్ గానీ జీఎస్‌బీగానీ కంకరతో ఉన్నటువంటి రోడ్డును వేసుకొని తారు రోడ్డు వేసి పూర్తి చేయాలన్నారు. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా రోడ్డును నిర్మిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయన్నారు. రోడ్డు పక్కన ఉన్న చెట్లను కొట్టేసి ఆ చెట్టు మొదళ్లను అదే భూమిలో కప్పేశారని, కొన్ని చెట్టు మొదళ్లు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఎప్పటి నుంచో ఉంటున్న కల్వర్టులను ఎక్కడికక్కడ మట్టిలో వేసి కప్పేశారని, రాబోయే వర్షాకాలంలో వర్షాలు పడితే ఆ నీరు ఎటు వెళ్లాలో, పక్కనున్న పొలాలు గానీ ఇళ్లు గానీ మునిగిపోతాయా లేదా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు మొత్తం 56 మూలమలుపులు ప్రమాదాలకు సూచికలుగా మారాయన్నారు. ఇవి ఎక్కడా సరి చేయకుండా రోడ్డు వేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇక్కడ ఆర్ అండ్ బీ వ్యవస్థ పూర్తిగా వైఫల్యంగా కనిపిస్తోందని, భవిష్యత్తులో రోడ్డు తొందరగా చెడిపోయి మళ్లీ రోడ్డు వేసే అవకాశం ఉందన్నారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు 10 నుంచి 12 వ్యవసాయ భూములు ఉన్నాయన్నారు. ఆ వ్యవసాయ భూములను నమ్ముకుని ఉన్న రైతులకు అన్యాయం చేయకుండా వారికి ఉచితంగా బోర్లు వేసే ఆలోచన కూడా ప్రభుత్వం చేయాలన్నారు. భూములు పోయిన రైతులకు నష్టపరిహారం కట్టించాలని, ఈ 20 కిలోమీటర్ల పరిధిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణంలో ఇళ్లను కూల్చివేయాల్సి వస్తుందని, కాబట్టి ఆ ఇంటి యజమానులకు నష్టపరిహారం కట్టించి ఉచితంగా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు వరుకోలు రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

- ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు దారుల నుండి 40 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ క్రైమ్ మే 25: జనం సాక్షి :** నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్ఐ, సీఐలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలు చట్టప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తోందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలియజేశారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలియజేశారు. వివిధ ఫిర్యాదులకు సంబంధించిన 40 ఫిర్యాదులను స్వీకరించారు.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**




**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 25 (జనం సాక్షి);** ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 300 వచ్చాయి. సద్వినియోగం చేసుకోవాలి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలలోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాజేందర్ రెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 9 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 12 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద జంతువులను కుర్బానికి దూరంగా ఉంచాలి

**ముస్లిం మత పెద్దలు**




**సిరిసిల్ల టౌన్ మే 25 (జనం సాక్షి) :** దేశంలోని ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముస్లిలు పెద్ద జంతువుల కుర్బానీకి దూరంగా ఉండాలని, సాధ్యమైనంత వరకు చిన్న జంతువులను కుర్బానీ చేయాలని మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సమీ, మాజీ అధ్యక్షుడు ఎం,డి, సత్తార్ లు సూచించారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలోని వివిధ ముస్లిం నాయకులు, ఉలేమాలు (మత పెద్దలు) కూడా ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతున్నా రని తెలిపారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆవులు, ఇతర పశువుల విక్రయాన్ని సాధ్యమైనంత వరకు నివారించాలని అన్నారు. సిరిసిల్ల ఈద్‌గాహ్‌లో నిర్వహించనున్న బక్రీద్ (ఈద్-ఉల్-అజ్హా) నమాజ్ సమయాలను కూడా ప్రకటించారు. నిర్ణయించిన సమయానికి హాజరై, క్రమశిక్షణతో నమాజ్‌లో పాల్గొనాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సోహెల్, మాజీ మజీద్ కమిటీ అధ్యక్షుడు, షేక్ యూసుఫ్, ముస్తఫా, గౌరవ అధ్యక్షులు సయ్యద్ సమ్మద్, కమిటీ జనరల్ సెక్రెటరీ మొహమ్మద్ రఫీ మహమ్మద్ మునీర్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఫయాజ్, ఎండి చాంద్ పాషా, మహమ్మద్ అమ్జద్, షేక్ బాసు, పాషా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# ఎంఆర్ఓ కార్యాలయం ముందు రైతు ఆత్మహత్యాయత్నం

**భూమి సర్వే ఆలస్యంతో మనస్థాపం**

**భిక్కనూరు, మే 25 (జనంసాక్షి):** మండల కేంద్రానికి చెందిన రైతు ఆన్‌లైన్ సర్వే ఆలస్యంతో మనస్థాపం చెంది మండల రెవెన్యూ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన కార్యాలయ సిబ్బంది, తోటి రైతులు, స్థానికులు వెంటనే అప్రమత్తమై రైతును అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. ఉద్రిక్త వాతావరణం నెలకొన్న ఘటనలో రైతు బోండ్ల నవీన్ (బోండ్ల కిష్టయ్య కుమారుడు) వంశపారంపర్యంగా వస్తున్న పట్టా భూమి సర్వే నంబర్ 607లో 1 ఎకరం 25 గుంటల భూమి ఉంది. కాస్తులో ఉండి పంట పండిస్తున్న ఈ భూమిని ఆన్‌లైన్ నమోదు చేయించుకోవాలని గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో విసిగిపోయి ఆత్మహత్యాయత్నం చేశారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్యను వివరణ కోరగా 607 సర్వే నంబర్‌లో పూర్తి విస్తీర్ణం 13.31 ఎకరాల భూమి ఉందని, సర్వే పూర్తి చేస్తే గానీ అసలు విషయం బయటపడదని అన్నారు. త్వరలోనే ఈ సర్వే నంబర్లు ఉన్న రైతులకు నోటీసులు అందజేస్తామని పేర్కొన్నారు. 9 నెలల నిరీక్షణ.. ఆరు నెలల క్రితం భూమి సర్వే కోసం చాలానా కట్టిన బాధిత రైతు కథనం ప్రకారం తన భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవడానికి గత పది నెలలుగా సదరు రైతు ఎంఆర్‌వో కార్యాలయం చుట్టూ కాలార్గేల తిరుగుతున్నాడు. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని స్థానికులు, తోటి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూమి సర్వేను వేగవంతం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షించిన కలెక్టర్ సత్యప్రసాద్



**మల్యాల మే 25 (జనం సాక్షి) :** మల్యాల మండలం తకళ్లపెల్లి, బల్వాంతపూర్, రామన్నపేట గ్రామాల్లోని వరి ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడివో స్వాతి, ఆర్ఐ తిరుపతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు

- కొనుగోళ్లు వేగవంతం చేయాలని మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను
- అడిషనల్ కలెక్టర్, సివిల్ సప్లై మార్కెట్ అధికారులతో చర్చ
- ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది : ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసన్న



**కరీంనగర్ బ్యూరో, మే 25 (జనంసాక్షి):** మార్కెట్ యార్డులో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను ముమ్మరంగా చేపడుతున్నామని కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న తెలిపారు. ధాన్యం కొనుగోలు మరింత వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. అదేవిధంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలుపై సివిల్ సప్లై, మార్క్‌ఫెడ్ డీఎంతో చర్చించానని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశానని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారని తెలిపారు.

కరీంనగర్ మార్కెట్ యార్డు వద్ద రైతులు చేపట్టిన ధర్నాపై మార్కెట్ కమిటీ చైర్మన్ స్పందించారు. ఈ సందర్భంగా ఆకుల నరసన్న మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గన్నీ బ్యాగులు, ట్రాక్టర్లు, లారీలు వంటి అవసరమైన వనరుల కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాముల్లో భద్రపరిచి, వర్షాలు లేదా ఇతర సమస్యల వల్ల నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లను మరింత వేగవంతం చేస్తున్నామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆకుల నరసన్న స్పష్టం చేశారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రతిపక్షాల మాటలను నమ్మి రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోందని పేర్కొన్నారు.

# జిల్లా మహిళా సాధికారిత కేంద్రం హెల్ప్‌లైన్, టోల్ ఫ్రీ నెంబర్ బోర్డు ఆవిష్కరణ



**కామారెడ్డి ప్రతినిధి, మే 25 (జనంసాక్షి) :** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్, టోల్ ఫ్రీ నెంబర్ బోర్డును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్ట ర్ మాట్లాడుతూ మహిళల రక్షణ, సాధికారిత, సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలకు తక్షణ సహాయం అందించేందుకు హెల్ప్‌లైన్ సేవలు ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, ఆర్డీఓ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాలలో మహిళా సాధికారిత కేంద్రం హెల్ప్‌లైన్, టోల్ ఫ్రీ నెంబర్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సులభంగా కనిపించే ప్రదేశాల్లో బోర్డులు ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

మహిళల భద్రత, హక్కుల పరిరక్ష ణ, అత్యవసర సహాయ సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎసీఎల్బీ గిరి, డీడబ్ల్యువో ప్రమిల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కామాంధుడికి 20 ఏళ్ల జైలు శిక్ష



**షాబాద్, మే 25(జనం సాక్షి) :** కాపాడాల్సిన తండ్రి కన్న కూతురిపై అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన 2024 సంవత్సరంలో షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకోగా బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండల పరిధిలోని కుర్వగూడకు చెందిన దాదే రాజు (37) కన్న కూతురిపై మానవత్వం మరిచి అఘైత్యానికి పాల్పడ్డ సంఘటనకు సంబంధించిన కేసు, నమోదు చేసి దర్యాప్తు ఆధారాలు న్యాయస్థానానికి సమర్పించిన యేడల విచారణ అనంతరం ప్రత్యేక ఫోక్సో న్యాయస్థానం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 2500 జరిమానా విధిస్తూ, అలాగే బాధితురాలికి ఏడు లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని తీర్పు జారీ చేసింది. కేసు విజయవంతంగా నిరూపించబడడంలో సహకరించిన దర్యాప్తు బృందాన్ని, ప్రభుత్వ న్యాయవాదిని, కోర్టు సిబ్బందిని అధికారులు అభినందించారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

- మేలు రకం విత్తనాలు వినియోగించాలని రైతులకు పిలుపు
- ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ.. స్వల్పకాలిక పంటలు ప్రోత్సహం
- యువతకు ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు
- ఖరీఫ్ సీజన్‌కు ఎరువులు, విత్తనాలు సరఫరా సిద్ధం



**నిజామాబాద్ అర్బన్, మే 25 (జనంసాక్షి):** వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మేలైన పంటలు సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ఖరీఫ్ సీజన్‌ను పురస్కరించుకుని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాల పంపిణీపై చర్చించి, అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈసారి ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున, తక్కువ నీటి వినియోగం అవసరం అయ్యే స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని రైతులను కోరారు. కేవలం వరి పంటకే పరిమితం కాకుండా జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని హితవు పలికారు. అధిక దిగుబడిని అందించే నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని, మేల్ సీడ్‌ను వాడవద్దని సూచించారు.

ఖరీఫ్‌లో జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని అన్నారు. లారీలు, హమాలీల కొరత, ఎండ తీవ్రత వంటి అనేక ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ రబీలో రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో నిజామాబాద్ జిల్లాలో దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. దిగుబడులు ఆలస్యంగా వచ్చిన బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో మినహాయిస్తే, జిల్లాలో ధాన్యం సేకరణ పూర్తయ్యిందని అన్నారు. బాల్కొండ సెగ్మెంట్‌లో సైతం ఒకటి రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని తెలిపారు.

యువత విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా జిల్లా కేంద్రంలోని న్యాక్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శిక్షణ తరగతుల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. సాంకేతిక విద్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు న్యాక్ ద్వారా ప్లంబింగ్, హౌజ్ వైరింగ్, ఫిట్టర్, సెంట్రింగ్, మెసన్, యూనిఫామ్ స్టిచింగ్ వంటి కోర్సులలో శిక్షణ అందించేందుకు జిల్లా యంత్రాంగం ద్వారా త్వరలోనే ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువరిస్తారని అన్నారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులను కష్టాల పాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మొక్కజొన్న కొనుగోలులో నెలల తరబడి జాప్యం
- తూకం, లారీలు, గన్నీ సంచుల కొరతతో రైతుల అగచాట్లు
- పైసా వసూలు, దావతుల పేరిట అక్రమాలు
- కేసీఆర్ పాలనలో రైతు సేవ.. ఇప్పుడు రైతు శాపం



**కథలాపూర్, మే 25 (జనంసాక్షి):** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు నెల రోజులుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులు నెలల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడంలో ఆలస్యం, లారీలు సకాలంలో రాకపోవడం, గన్నీ సంచుల కొరత వంటి సమస్యలతో రైతులు విసుక్కుపోతున్నారు. వర్షాలు పడితే తమ పంట ఎలా కాపాడుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. మహిళా రైతులు మరియు చిన్న రైతులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్రమసంఖ్య ప్రకారం రైతుల పేర్లు ప్రచురించినప్పటికీ, రాత్రి వేళల్లో పైసా వసూలు చేసి డబ్బులిచ్చిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులు గుగ్లావత్ సాయి, బంటు అంజన్న, నోముల నర్సన్న, గోపి, రాందాస్, సాయన్న, జమున, గుగ్లావత్ రాజు, గడ్డం గంగారెడ్డి, లక్ష్మి, కొత్తూరు స్వరూప, తిరుపతి వంటి రైతులు తమ ఆవేదనను తెలియజేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోకపోవడం, మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు. గతంలో కేసీఆర్ పాలనలో రైతులకు సకాలంలో ఎరువులు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మేలు చేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాల్లోకి నెట్టేస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపు రెడ్డి విమర్శించారు. రైతుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు చేరే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలుస్తుందని, లేని పక్షంలో రైస్ మిల్లులను ముట్టడించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల మాజీ జడ్పీటీసీ చింతకుంట గ్రామ సర్పంచ్ నాగం భూమయ్య, కథలాపూర్ మండల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్ రావు, మండల కో-ఆప్షన్ సభ్యులు ఎండీ. రఫీ, కలికోట గ్రామ సర్పంచ్ రాంమోళ్ల రమేష్, అంబారిపేట గ్రామ సర్పంచ్ వేముల గంగరాజం, కలికోట గ్రామ మాజీ సర్పంచ్ సరోజ సీతారాం, మాజీ ఎంపీటీసీ దేవేంద్ర గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మ రాజేశం గౌడ్, మండల యూత్ నాయకులు మున్నీర్ పాషా, రెడ్డి, పెద్ది గిరి మల్లేష్, కల్లెడ నరేష్, గధం మల్లేష్, కటి పెల్లి రవి, అశోక్ రెడ్డి, గుండ్ల శ్రీను, రాజేష్, నరేష్, గంగనర్సయ్య, నంద గిరి సాయి రామ్, పెద్ద సాయి రామ్, గ్రామం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామం రైతులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
26 మే 2026

# త్రిశంకు స్వర్గంలో పర్యాటకులు

- కేబుల్ కార్లలో సాంకతిక లోపం
- గంటల పాటు గాల్లోనే 300 పర్యాటకులు
- క్షేమంగా కిందకు దించిన అధికారులు



శ్రీనగర్, మే25 (జనంసాక్షి) : ఉత్తర కశ్మీర్‌లోని ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన గుల్మార్గ్‌లో సోమవారం భారీ ప్రమాదం తృటిలో తప్పింది. ఇక్కడి ప్రముఖ ఆకర్షణ అయిన 'గోండోలా కేబుల్ కార్' సర్వీస్‌లో అకస్మాత్తుగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో సుమారు 300 మంది పర్యాటకులు గాల్లోనే చిక్కుకుపోయారు. కేబుల్ కార్లు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో లోపల ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కొన్ని గంటలపాటు ప్రయాణికులు గాల్లోనే ఉండిపోవడంతో అక్కడ ఉత్కంఠభరిత వాతావారణం నెలకొంది. కేబుల్ కార్లు గాల్లోనే నిలిచిపోవడంతో పర్యాటకులు.. గట్టిగా కేకలు వేశారు. గమనించిన స్థానికులు రక్షణ బలగాలకు సమాచారం అందించారు. కేబుల్ కార్ల నిర్వహణ వ్యవస్థలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే ఇండియన్ ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ , ఎస్డీఆర్ఎఫ్ దళాలతో పాటు స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు. ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించిన ఆయన.. సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. పర్యాటకులందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడమే తమ మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. ప్రస్తుతం పోలీసులు, ఆర్మీ, సహాయక బృందాల సాయంతో పర్యాటకులను కేబుల్ కార్ల నుంచి సురక్షితంగా కిందకు దించారు. మరోవైపు కేబుల్ కార్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ఇంజనీర్లు పనులు ప్రారంభించగా.. అసలు ఈ సాంకేతిక లోపం తలెత్తడానికి గల కారణాలపై ఉన్నతాధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# లాయర్ హత్య కేసులో స్కార్పియో స్వాధీనం

- లోతుగా విచారిస్తున్న పోలీస్ బృందాలు

హైదరాబాద్, మే25 (జనంసాక్షి) : హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ వద్ద కారు ఢీకొన్న ఘటనలో న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ మరణించిన ఘటనలో నిందితులను పట్టుకోవాలని ఆయన కుమారుడు నగర్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. తనకున్న అనుమానలతో ఆధారాలను వివరించారు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన శనివారం తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. బెంగళూరు హైవేపై హత్యకు ఉపయోగించిన 'స్కార్కియో' వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. భూ తగాదాలే ఈ ఘటనకు ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలుస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం, ఇంటి నుంచి బయటకు వచ్చిన ఖాజా మొయినుద్దీన్‌ను నిందితులు వాహనంతో ఢీకొట్టి హత్య చేసినట్లు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా స్కార్పియో వాహనాన్ని ఇటీవల స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఆ కారును గతంలో విక్రయించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే, తాను ఆ వాహనాన్ని ఆరు నెలల క్రితమే అమ్మేశానని వాహన యజమాని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ వాహనం ఎవరి వద్ద ఉందన్న దానిపై అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి కల్వకుర్తికి చెందిన వినయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసుకు సంబంధించిన మరికొంతమంది అనుమానితుల కోసం కూడా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# బహిరంగ ప్రదేశాల్లో నమాజ్ నిషేధం

- అలాగే జంతు బలులు కూడా నిషిద్ధం
- అధికారులను ఆదేశించిన యూపి సిఎం యోగి



లక్నో, మే25 (జనంసాక్షి) : దేశవ్యాప్తంగా బక్రీద్ వేడుకలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఎం యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. బక్రీద్ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో నమాజ్‌ల నిర్వహణ, జంతుబలిని అనుమతించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు లఖ్‌నవూలో సోమవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులకు సీఎం యోగి పలు సూచనలు చేశారు. ప్రార్థనలు కేవలం మసీదులు, ఈద్గాహ్‌ల పరిధిలోనే జరగాలని.. రోడ్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి ఉండదని తెలిపారు. ఒకవేళ అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే పరిస్థితి ఉంటే షిఫ్టుల్లో నమాజ్ నిర్వహించాలని సూచించారు. అలాగే.. జంతుబలి విషయంలోనూ కఠిన నిబంధనలు అమలు చేయాలని యోగి ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో కుర్బానీ పూర్తిగా నిషేధమని, ప్రభుత్వం నిషేధించిన జంతువులను బలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. కుర్బానీ అనంతరం కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సరైన పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖను అప్రమత్తం చేశారు సీఎం యోగి. రాష్ట్రంలోని సున్నిత ప్రాంతాలు, ఈద్గాహ్‌లు, మసీదుల వద్ద అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అల్లర్లకు ప్రేరేపించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈద్గాహ్‌ల వద్ద పోలీస్ బలగాలు మోహరించాలని, సున్నితమైన ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా చేపట్టాలన్నారు.

# లారీల సమస్యతో ధాన్యం తరలింపులో ఆలస్యం

- తడిసిన ధాన్యం సైతం ప్రభుత్వం కొంటుంది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడి



హైదరాబాద్, మే25 (జనంసాక్షి) : రాష్ట్రంలో పండిన ధాన్యమంతా ప్రభుత్వం తప్పక కొనుగోలు చేస్తుందని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. లారీల కొరత వల్ల ధాన్యం తరలింపు ఆలస్యం అవుతోందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'లారీల కొరత సమస్యను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇసుక లారీలు, ట్రాక్టర్లను కూడా ధాన్యం తరలింపు కోసం వాడుతున్నాం. ఈలోపు వర్షం పడి ధాన్యం తడిసినా.. ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ధాన్యం తడిసి రంగు మారినా.. కొనుగోలు చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్, భాజపా నాటకాలు ఆడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల టన్నులనే కొనుగోలు చేస్తామని చెప్పింది. ధాన్యం కొనుగోళ్ల గురించి మాట్లాడే హక్కు భాజపా నేతలకు లేదు. రాష్ట్రంలో కోటి టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వచ్చింది. కేంద్రం మాత్రం 52 లక్షల టన్నులకు మాత్రమే మద్దతు ధర చెల్లిస్తామని చెప్పింది. రాష్ట్రంలో మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని భాజపా నేతలు కేంద్రానికి చెప్పాలి. కేంద్రం కొనకపోయినా.. మొత్తం ధాన్యాన్ని రాష్ట్రం కొనుగోలు చేస్తోంది. కేంద్రం మద్దతు ధర ఇవ్వకపోయినా మరో 70 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తోంది. రైతులను అడ్డం పెట్టుకొని భాజపా, బీఆర్ఎస్ కలిసి డ్రామాలు చేస్తోంది' అని ఆది శ్రీనివాస్ విమర్శించారు.

# మద్దతు ధరలు పెంచి కేంద్రం చేతులు దులుపుకుంటోంది

- కనీసం 30శాతం కూడా ధాన్యం సేకరించడం లేదు
- తెలంగాణలో విద్యారంగం పటిష్టతకు కఠిన చర్యలు
- లెఫ్ట్ నేతలతో భేటీలో సిఎం రేవంత్ వివరణ
- కార్మికుల కనీస వేతనం పెంచడంపై లెఫ్ట్ నేతల అభినందన



హైదరాబాద్, మే 25 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు పెంచడమే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. కనీసం 30 శాతం ధాన్యం కూడా సేకరించడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో సీపీఎం, సీపీఐ బృందాలు వేర్వేరుగా సీఎంతో సమావేశమయ్యాయి. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆయా పార్టీ నేతలు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయం తీసుకోవడంపై నేతలు సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, మసీ ప్రక్షాళన, విద్యారంగ అంశాలపైనా వారి మధ్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లా డుతూ.. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హమాలీ లు వారి స్వస్థ లాలకు వెళ్లడంతో ఇక్కడ కొరత ఏర్పడిందన్నారు. మరోవైపు ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సవిక్షిస్తున్నట్లు తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి.. మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మసీ కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను వివరిం చారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని సీఎం చెప్పారు. విద్యా రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా వారికి వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ.. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నేతలను రేవంత్ కోరారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని.. దానిలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నామని తెలిపారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేస్తే చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తాం

ఏపీ ప్రభుత్వానికి తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరిక



హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రొఫెసర్ నాగేశ్వర్ ను ఏపీ ప్రభుత్వం హైదరాబాద్ లో అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తోందని.. అదే జరిగితే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇంటిని ముట్టడిస్తామని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ పై జనసేన పార్టీ, ఏపీ పోలీసులు, ఆ రాష్ట్ర ప్రభుత్వం కేసుల పేరుతో వేధింపులకు గురి చేస్తోందని "ఎక్స్" వేదికగా మండిపడ్డారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌కు కవిత మద్దతు ప్రకటించారు. పార్టీలకు అతీతంగా రాజకీయ విశ్లేషణలు చేసే నాగేశ్వర్ పై కావాలనే అక్రమ కేసులు బనాయిస్తూ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ సమాజం, తెలుగు ప్రజలు ఎంతగానో గౌరవించే మేధావి, ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఏపీ పోలీసులు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ ను అక్రమ కేసులతో వేధిస్తున్నారని కవిత విమర్శించారు. ఆయన విశ్లేషణలతో ఏకీభవించకపోతే ఖండించాలే తప్ప ఇలా కేసులు పెట్టటం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. గతంలో తన పై ఆయన చేసిన విశ్లేషణలను కూడా వ్యక్తిగతంగా విభేదించానని కవిత గుర్తు చేశారు. అభిప్రాయ బేధాలు ఉన్న సరే రాజ్యాంగం కల్పించిన "భావప్రకటన స్వేచ్ఛ"ను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడే విషయంలో టీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడదని చెప్పారు. ఈ విషయంలో ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ కు అండగా ఉంటామని చెప్పారు. ప్రొఫెసర్ ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుందని... అదే గనుక నిజమైతే దీన్ని తెలంగాణ మేధావులపై ప్రత్యక్ష దాడిగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. ఏపీ పోలీసుల ప్రయత్నాలకు తెలంగాణ పోలీసులు సహకరిస్తున్నారని వార్తలు వస్తున్నాయని అలాంటి ప్రయత్నాలను తెలంగాణ పోలీసులు మానుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిహాసించేలా ఏపీ పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే దాన్ని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. లేదంటే తాము హైదరాబాద్ లోని ఏపీ సీఎం చంద్రబాబు ఇంటిని ముట్టడిస్తామని కవిత హెచ్చరించారు.

వడదెబ్బతో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి భద్రాచలం గవర్నమెంట్ హాస్పిటల్ లో మార్చురీ వాహనం ఇవ్వకపోవటంతో కిలోమీటర్ కు పైగా మృత దేహాన్ని కుటుంబ సభ్యులు భుజాలపై మోసుకెళ్లిన సంఘటనపై కవిత తీవ్ర విచారణం వ్యక్తం చేశారు. ఇంతకన్నా అమానుషం, అమానవీయం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల ఎంత నిర్దయగా ఉందో ఈ ఉదంతంతో అర్థమవుతుందన్నారు.

# యర్రావారిపాలెం మండలంలో ఏనుగుల హల్‌చల్

- మామిడి వరిపంటల ధ్వంసం

తిరుపతి, మే25 (జనంసాక్షి) : యర్రావారిపాలెం మండలంలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. కూరపర్తివారిపల్లి, నెరబైలు, మడిచెరువు అటవీ సమీపంలోని మామిడి తోటలు, టెంకాయ, వరి పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. నేడు, రేపో మామిడి కాయలను మండీలకు తరలించే సమయంలో ఈ విధంగా ఏనుగులు నష్టం కలిగించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంటను ఏనుగులు ధ్వంసం చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గడిచిన 4 నెలల కాలంలో సుమారు 60 వరకు అన్ని పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి.

# తాజ్‌మహల్ సందర్శించిన మార్కో రుబియో

- గంటన్నరపాటు అక్కడ గడిపిన రుబియో జంట



న్యూఢిల్లీ, మే25 (జనంసాక్షి) : అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో తాజ్‌మహల్ అందానికి ఫిదా అయ్యారు. భారత్ పర్యటనలో భాగంగా ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను కొద్ది సేపటి క్రితం సందర్శించారు. ఆయనతో పాటు భార్య జెనెట్ రుబియో, భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్ కూడా తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఈ నేపథ్యంలో తాజ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తాజ్ మహల్ వద్ద దాదాపు గంటన్నర పాటు గడిపిన రుబియో దంపతులు సందర్శకుల పుస్తకంలో ప్రత్యేక సందేశం రాశారు. 'ప్రపంచంలోనే గొప్ప సంపదను సందర్శించేందుకు మాకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు' అంటూ రుబియో దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. మార్కో రుబియో నాలుగు రోజుల పాటు భారత్‌లో పర్యటించేందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన కోల్‌కతా, న్యూఢిల్లీ పర్యటనలు పూర్తి చేసి, ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్‌తో కీలక చర్చలు జరిపారు . మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం భారత పర్యటనను పూర్తి చేసుకుని అమెరికాకు పయనమవుతారు.

# డైమండ్ హార్బర్‌లో బీజేపీ అడుగు

- ఫల్తా గెలుపుతో టీఎంసీకి బీటలు

కోల్‌కతా, మే25 (జనంసాక్షి) : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఊహించని భారీ కుదుపు చోటుచేసుకుంది. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫల్తా' అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉత్కంఠభరిత రీపోలింగ్‌లో భారతీయ జనతా పార్టీ అఖండ విజయాన్ని నమోదు చేసింది. ఈ రీపోలింగ్‌లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పాండా ఏకంగా 1,08,000 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచి సంచలనం సృష్టించారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ తగిలి ఏకంగా నాలుగో స్థానానికి పడిపోయింది. ఇక్కడి అభ్యర్థి పోలింగ్‌కు ముందే చేతులెత్తేశారు. విజయం సాధారణమైనది కాదు.. ఎందుకంటే ఫల్తా నియోజకవర్గం టీఎంసీ నెంబర్-2, ఎంపీ అభిషేక్ బెనర్జీకి చెందిన 'డైమండ్ హార్బర్' లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. ఒకప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌కు తిరుగులేని కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో కమలం వికసించడం.. బెంగాల్ రాజకీయాల్లో ఇక మమతా బెనర్జీ మార్క్ హవాకు బ్రేకులు పడ్డాయనే సంకేతాన్ని స్పష్టంగా ఇస్తోందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. స్థానానికి తొలిసారిగా ఏప్రిల్ 29న పోలింగ్ జరిగింది. ఆ సమయంలో అధికార టీఎంసీ ఈవీఎంల తారుమారుకు పాల్పడిందని, బూత్ క్యాప్చరింగ్, ఓటర్లను బెదిరించడం వంటి అక్రమాలకు ఒడిగట్టిందని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ స్థానంలో నెలకొన్న తీవ్రతను గమనించిన ఎన్నికల సంఘం (ఇఅ) అక్కడ జరిగిన పోలింగ్‌ను రద్దు చేసి, మే 21న కట్టుదిట్టమైన కేంద్ర బలగాల నిఘాలో మొత్తం 285 బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించింది. ఈసారి భయం లేకుండా దాదాపు 88 శాతం మంది ఓటర్లు తరలివచ్చి ప్రశాంతంగా ఓటు వేశారు. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచే బీజేపీ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. రౌండ్ రౌండ్‌కు మెజారిటీ పెరుగుతూ పోయింది. ఈ రీపోలింగ్‌కు ముందే ఓటమిని పసిగట్టిన టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ తాను పోటీలో నిలబడనని ముఖం చాటేయడం గమనార్హం. అయితే చివరకు ఆయనకు ఈ ఎన్నికల్లో దక్కింది కేవలం 7 వేల పైచిలుకు ఓట్లే. ఈ ఘోర పరాజయాన్ని జీర్ణించుకోలేకపోతున్న మాజీ సీఎం మమతా బెనర్జీ రిజల్ట్స్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ ఏజెంట్లలా నటిస్తూ కేంద్ర బలగాలు కౌంటింగ్ కేంద్రాల్లోకి దూరి ఓట్లను మళ్లీ దొంగిలించాయని అంటూ ఆమె మండి పడ్డారు. మరోవైపు ఈ ఘనవిజయంపై పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి స్పందిస్తూ.. టీఎంసీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అభిషేక్ బెనర్జీ చెప్తుండే 'డైమండ్ హార్బర్ మోడల్' కాస్తా ఇప్పుడు 'తృణమూల్ నష్ట నమూనా'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. తాను ప్రజలను లక్ష మెజారిటీ అడిగితే.. వారు 1.08 లక్షల మెజారిటీతో నమ్మకాన్ని నిలబెట్టారని, ఫల్తా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మళ్లీ 'స్వర్ణ వైభవాన్ని' తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు.

# దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

- ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అబద్ధాలు
- ఎన్సాన్‌పల్లి ఐకెపి సెంటర్ సందర్శించిన హరీష్ రావు



సిద్దిపేట, మే25 (జనంసాక్షి) : ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అరిగోస పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. యూరియా, సాగునీరు, కరెంట్ సరఫరా, పండిన పంట కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యిందన్నారు. రైతులు ఇంత బాధపడటం మొట్టమొదటి సారి చూస్తున్నామన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్లో వరి ధాన్యాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. గతంలో ఈ ప్రభుత్వం ఉన్నా ఇట్లాంటి దుర్భర పరిస్థితులు ఎదురు కాలేదని చెప్పుకొచ్చారు. 'ఉత్తమ్ నీది నోరా మోరా.. మొన్న 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అని చెప్పి ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అనడం ఎంతవరకు సబబు' అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం కాదని.. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కోటి మెట్రిక్ టన్నుల ధాన్యంలో 70 లక్షలు కొంటే

మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని మాజీ మంత్రి ప్రశ్నించారు. తాలు పెడితే తోలు తీస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు 5 కిలోలు తరుగు తీస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని విమర్శించారు. రోహిణి కార్తె వచ్చినా కళ్లాల్లోనే ధాన్యం, రైతులు ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నదని తెలిపారు. రైతులు గుండెలు బాదుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కళ్లు కనబడటం లేదంటూ విమర్శలు గుప్పించారు. వరి కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు వదిలారని హరీశ్ రావు తెలిపారు. 'మిషన్ మోడ్‌లో వడ్లు కొనాలని రేవంత్ అంటున్నారు. నీది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్. నిన్న కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులకు ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశించారు. రైతుల ఆశలు నిరాశ అయ్యాయి. 45 రోజుల్లో మొత్తం రైతుబంధు వేస్తానని చెప్పి 60 రోజులు గడిచినా వేయలేదు. రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమే... దేవుని మీద ఒట్టు పెట్టి మాట తప్పిన రకం నువ్వు. ఢిల్లీ ట్రిప్పులు మాని.. లారీల ట్రిప్పులు పెంచు. ఒకటి, రెండు రోజుల్లో మార్పు రాకుండే స్వయంగా నేనే కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నా చేపడతా. వేలాది మంది రైతులతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌లను దిగ్బంధిస్తాం. రాజకీయ విమర్శలు మాని పరిష్కార మార్గాలు చూడండి' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370